## బాలల కోసం

# బొమ్మల భాగవతం



VGS PUBLISHERS

రచన

డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ

వి.జి.యస్. బుక్ లింక్స్

# 5-6-59/3, సెకండ్ ఫ్లోర్, తమ్మిన కృష్ణ వీధి, సాయిరాం థియేటర్ వెనుక,
విజయవాడ - 520 001 ఫోన్ : 2510202, ఫ్యాక్స్ : 0866-2515555

# 3-1-399, నింబోలి అడ్డా, కాచిగూడ, హైదరాబాద్ - 500 027,
ఫోన్ : 040-24650717. email : vgspublishers.hyd@gmail.com

FIRST EDITION : April 2018

Copy Rights Reserved by the Publishers

బాలల కోసం
# బొమ్మల భాగవతం

Dr. NAGABHAIRAVA ADINARAYANA

` 72/-

Copies can be had from :

V.G.S. BOOK LINKS
5-6-59/3, Second Floor, Tammina Krishna Street,
Behind Sairam Theatre, VIJAYAWADA - 520 001.
Ph : 2510202, 2512222. Fax : 0866-2515555.
email: vgsbooklinks@gmail.com

B.O : V.G.S. BOOK LINKS
# 3-1-399, Nimboliadda,
Kachiguda, HYDERABAD - 500 027.
email: vgspublishers.hyd@gmail.com
Ph. 040-24650717

&

SHREE RAJESWARI BOOK STALL
15-1-66, Siddiamber Bazaar,
HYDERABAD - 500 012.
Ph : 24742570, 24731972.
Fax : 040 - 24607764

We have taken many efforts to present this book without errors. But, some errors might have crept in. We don't take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice, we will correct them in our next edition.

All disputes are subject to AMALAPURAM Jurisdiction only.

VGS PUBLISHERS

బాలబాలికలారా !

రామాయణం, మహాభారతం, మహాభాగవతం భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు కరదీపికలు. ప్రాచీన పురాణేతిహాసాలను, అందలి విశేషాలను మరచిపోతున్న నేటి తరానికి ఆ కథలలోని మాధుర్యాన్ని అందించాలనే ఆలోచనతో ఈ పుస్తకాలను ప్రచురిస్తున్నాం.

మహా భాగవతం విష్ణుమూర్తి దివ్యగాథలను తెలిపే భక్తిరస ప్రధాన మైన గ్రంథం. దశావతార రహస్యాన్ని తెలిపే మధుర గ్రంథం. నమ్మిన వారికి కొంగు బంగారమై, పూజలు చేసినవారికి ఆపన్నహస్తమైన ఆ శ్రీమన్నారాయణుని భక్తవాత్సల్యాన్ని, ప్రేమానురాగాలను తెలియజేసే ఈ భాగవతాన్ని బాలబాలికలందరూ తప్పక చదువవలసిందే.

ఈ భాగవత పఠనం వలన దేవుని లీలా విలాసాలు తెలియడంతో పాటు మహాభక్తుల యొక్క జీవితవృత్తాంతాలు, వారికి భగవంతుడు సాయం చేసిన విధానం తెలుస్తాయి. మంచి, చెడుల విచక్షణ కలిగి ఉత్తములుగా తయారవడానికి, వ్యక్తిత్వం పెంపొందించుకోవడానికి ఈ గ్రంథం బాలబాలికలకు ఉపయోగపడుతుంది.

బాలబాలికలకు అర్థం కావడం కోసం సరళమైన భాషలో రచన చేయడం జరిగింది. అంతేకాకుండా అవసరమైన చోట్ల అందమైన బొమ్మలతో ఆకర్షణీయంగా తయారు చేయడం జరిగింది.

భాగవతంలో పిల్లలకు ఆసక్తిని రేకెత్తించే కథలను మాత్రమే గ్రహించాము. అర్థం కాని వేదాంతాది విషయాలను విస్మరించామని గుర్తించ ప్రార్థన.

భావి భారత పౌరులుగా, నీతిమంతులుగా తయారవడానికి దోహద పడే ఈ పుస్తకాన్ని చదవండి. ఉత్తములుగా ఎదగండి.

**రచయిత,**

**పబ్లిషర్స్.**

VGS PUBLISHERS



# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| మహాభాగవత రచన | ... | 5 |
| పరీక్షిత్తు వృత్తాంతం | ... | 6 |
| దక్షప్రజాపతి కథ | ... | 11 |
| ధ్రువుని కథ | ... | 15 |
| జడభరతుని కథ | ... | 17 |
| గజేంద్ర మోక్షం | ... | 19 |
| క్షీరసాగరమథనం-కూర్మావతారం | ... | 22 |
| వామనావతారం | ... | 25 |
| మత్స్యావతారం | ... | 28 |
| అంబరీషుని కథ | ... | 30 |
| కార్తవీర్యార్జునుడు-పరశురాముడు | ... | 32 |
| అజామిళుని కథ | ... | 34 |
| వృత్రాసుర వృత్తాంతం | ... | 36 |
| జయ విజయులు | ... | 39 |
| హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల జననం | ... | 40 |
| వరాహావతారం-హిరణ్యాక్షుని వధ | ... | 40 |
| హిరణ్యకశిపుని వధ-ప్రహ్లాద చరిత్ర | ... | 42 |
| ప్రహ్లాదుని జననం | ... | 42 |
| హిరణ్యకశిపుడు దేవతలను జయించుట | ... | 43 |
| నరసింహావతారం | ... | 45 |
| రామావతారం | ... | 47 |
| శ్రీకృష్ణావతారం | ... | 53-111 |


VGS PUBLISHERS

# మహాభాగవత రచన

వ్యాసుడు గొప్ప మహర్షి. వేదాలను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం అని నాలుగు వేదాలుగా విభాగం చేశాడు. వేదసారంతో కథారూపంలో మహాభారతాన్ని రచించాడు. పదునెనిమిది పురాణాలను సంతరించాడు. అప్పటికీ ఆయన మనస్సుకు శాంతి కలుగలేదు. మరేదో చేయాలనే తపన ఆయన మనస్సును కలవరపెడుతూ ఉంది.

ఒకనాడు పరమ భాగవతోత్తముడైన నారదుడు వ్యాసమహర్షి ఆశ్రమానికి వచ్చాడు. విష్ణుమూర్తి అవతారాల విశేషాలతోను, విష్ణుమూర్తిని ఆరాధించి మోక్షాన్ని పొందిన భాగవతుల కథలతోను ఒక గ్రంథం వ్రాయవలసిందని కోరాడు. ఆ గ్రంథం వలన మనస్సుకు శాంతి కలుగుతుందని చెప్పాడు. నారదుని సూచన పాటించి వ్యాసుడు భాగవతాన్ని రచించి, తన కుమారుడైన శుకమహర్షికి వినిపించాడు.

ఈ భాగవతం విన్నవారికి సకల శుభాలు కలుగుతాయని, మోక్షప్రాప్తి కలుగుతుందని పరీక్షిత్తు కథ ద్వారా తెలుస్తుంది.

ఇక కథల్లోకి వెళదామా !...



# పరీక్షిత్తు వృత్తాంతం

పాండవులకు కౌరవులకు కురుక్షేత్రంలో పదునెనిమిది రోజులపాటు యుద్ధం భయంకరంగా జరిగింది. ఇరుపక్షాలలో ఎందరో వీరులు మరణించారు. యుద్ధం ముగిసే సమయానికి కౌరవుల పక్షంలో దుర్యోధనుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ మాత్రమే సజీవులై ఉన్నారు. దుర్యోధనుడు మడుగులో దాగి ఉంటే పాండవులు అతనిని మాటలతో రెచ్చగొట్టి, బయటకు రప్పించారు. భీముడు గదాయుద్ధ నియమాలకు విరుద్ధంగా దుర్యోధనుని తొడలు విరుగగొట్టాడు. అశ్వత్థామ దుర్యోధనుని చూచి "నేను పాండవులను చంపి వస్తాను" అని ప్రతిజ్ఞ చేసి వెళ్ళాడు. ఉపపాండవులను చంపి వచ్చి, పాండవులను చంపానని దుర్యోధనునితో చెప్పాడు. ఆ మాటలు విని దుర్యోధనుడు ఆనందంగా కన్నుమూశాడు. పాండవులు జీవించి ఉన్నారని తరువాత అశ్వత్థామ తెలుసుకున్నాడు.

తన పుత్రులు ఐదుగురు అశ్వత్థామ చేతిలో హతమయ్యారని తెలిసి ద్రౌపది కన్నీరు మున్నీరుగా ఏడ్వసాగింది. బిడ్డలు మరణించడం, భార్య కడుపు కోతతో దుఃఖించడం చూచి అర్జునుడు కోపంతో రగిలిపోయాడు. అశ్వత్థామను హతమార్చి అతని శిరస్సు తెస్తానని ద్రౌపదికి మాట ఇచ్చి బయలుదేరాడు. అతడెక్కిన రథాన్ని శ్రీకృష్ణుడు నడుపసాగాడు. వారిద్దరూ అశ్వత్థామ కోసం వెతుకసాగారు. కృష్ణార్జునులు తన కోసం వస్తున్నారని గ్రహించిన అశ్వత్థామ ప్రాణభయంతో 'బ్రహ్మశిరం' అనే అస్త్రాన్ని ప్రయోగించాడు. కృష్ణుడు హెచ్చరించడంతో అర్జునుడు కూడా బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగం చేశాడు. ఆ రెండు అస్త్రాలు ఢీకొంటే ప్రళయం వస్తుందని, లోకాలు సర్వనాశనమవుతాయని దేవతలు భయపడ్డారు. అస్త్రాలను ఉపసంహరింపు మని అశ్వత్థామను, అర్జునుని వేడుకున్నారు. వారి మాటలు ఆదరించి అర్జునుడు తాను ప్రయోగించిన అస్త్రాన్ని ఉపసంహరించుకున్నాడు. కాని అశ్వత్థామకు బ్రహ్మశిరాన్ని ప్రయోగించడం తప్ప ఉపసంహరించడం తెలియదు. ఆ కారణం చేత అతడా అస్త్రాన్ని అప్పటికే గర్భవతిగా ఉన్న అభిమన్యుని భార్య ఉత్తర గర్భం మీదికి మళ్ళించాడు. అర్జునుడు అశ్వత్థామను బంధించి తెచ్చి, పుట్టెడు పుత్రశోకంతో ఉన్న ద్రౌపది ముందు నిలబెట్టాడు.

ద్రౌపది అశ్వత్థామతో "గురుపుత్రా ! గాఢనిద్రలో ఉన్న నా కుమారులను కొంచమైనా కనికరం లేకుండా నీ కరవాలానికి బలి చేశావు. నీకు పాండవులు సోదర సమానులు కదా ? వారి పుత్రులను చంపడానికి నీకు చేతులు ఎలా వచ్చాయి ? శిశు హంతకుడవైన నీ కసాయితనాన్ని లోకం మెచ్చుకుంటుందా ? నీవు బంధింపబడ్డావని నీ తల్లి కృపికి తెలిస్తే ఎంత అల్లాడిపోతుందో ఊహించు. ఆ తల్లి పడే బాధను మించి నన్ను బాధపెట్టావు. నీవు చేసిన ఈ దుష్కార్యానికి నిన్ను వదలకూడదు. కాని నువ్వు గురుపుత్రుడవు. మీదు మిక్కిలి బ్రాహ్మణుడవు. అందుచేత నిన్ను చంపకుండా వదిలిపెడుతున్నాము. వెళ్ళు. ఇకనైనా మనిషిగా మానవత్వంతో బ్రదుకు" అని దుఃఖిస్తూ పొమ్మని చెప్పింది. అతనిని ఏమీ చేయవద్దని అర్జునుని హెచ్చరించింది. కన్న సంతానాన్ని హతమార్చిన కఠినాత్ముడైన అశ్వత్థామను కనికరించిన ద్రౌపది దయార్ద్ర హృదయాన్ని అందరూ



VCS PUBLISHERS

మెచ్చుకున్నారు.

కృష్ణుడు అర్జునునితో "అశ్వత్థామ శిరస్సు మీద ఒక అమూల్యమైన రత్నం ఉంటుంది. దానిని కత్తిరించి, తీసి ద్రౌపదికి ఇవ్వు. శిఖను తరిగి పొమ్మనడం శిరస్సును నరకడంతో సమానమే కదా !" అన్నాడు. అర్జునుడు కృష్ణుడు చెప్పినట్లే అశ్వత్థామ తలపై నున్న మణిని తీసుకొని వెళ్ళిపొమ్మన్నాడు. అశ్వత్థామ అవమాన భారంతో ఎక్కడికో వెళ్ళిపోయాడు. మరణించిన తమ పుత్రులకు పాండవులు అంత్యక్రియలు చేశారు. యుద్ధంలో మరణించిన వారందరికీ తర్పణాలను ఇచ్చారు. నూరుగురు పుత్రులను పోగొట్టుకొని విచారిస్తున్న గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చారు. ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగింది. కృష్ణుడు పాండవుల చేత అశ్వమేథ యాగం చేయించాడు.

ఉప పాండవులు మరణించారు. ఘటోత్కచుడు మరణించాడు. అభిమన్యుడు మరణించాడు. పాండవుల అనంతరం వారసులు లేరు. కాని అభిమన్యుడు మరణించే సమయానికి అతని భార్య ఉత్తర గర్భవతి. ఆమెకు జన్మించినవాడే పాండవుల రాజ్యానికి వారసుడు అవుతాడు. కాని ఆమె గర్భంపై అశ్వత్థామ బ్రహ్మశిరమనే అస్త్రాన్ని ప్రయోగించాడు కదా! ఆ అస్త్ర ప్రభావం చేత ఉత్తర మరణించిన మగబిడ్డను కన్నది. వంశానికి వారసుడు లేకుండా పోయాడని పాండవులు దుఃఖించసాగారు. ఆ సమయంలో కృష్ణుడు వచ్చాడు. తన దివ్యశక్తిని ధారపోసి బ్రహ్మశిరో నామకాస్త్ర ప్రభావాన్ని పోగొట్టి శిశువును సజీవుని చేశాడు. విష్ణువు అవతారమైన కృష్ణుని చేత బ్రతికింపబడినాడు కాబట్టి ఆ శిశువుకు 'విష్ణురాతుడు' అని పేరుపెట్టారు. కాని పుట్టినప్పటి నుండి అందరిని పరీక్షించి చూసేవాడు కాబట్టి అతనిని అందరూ 'పరీక్షిత్తు' అని పిలిచేవారు. అదే పేరుతో అతడు ప్రసిద్ధి పొందాడు.

పరీక్షిత్తు పెరిగి పెద్దవాడయ్యాడు. పాండవులు అతనికి పట్టాభిషేకం జరిపించారు. పాండవులు మహాప్రస్థానం చేశారు. పరీక్షిత్తు ఐరావతిని వివాహం చేసుకున్నాడు. ధర్మరాజులాగా పరీక్షత్తు కూడా ఆదర్శవంతంగా, ధర్మబద్ధంగా పరిపాలన చేస్తూ ప్రజల మనస్సును చూరగొన్నాడు. ఆయన కాలంలో సకాలంలో వర్షాలు కురిసేవి. అతడెన్నో యాగాలు చేసి కీర్తిని పొందాడు. దేశం సుభిక్షంగా ఉండేది. అతనికి కలిగిన కుమారుడే జనమేజయుడు.

పరీక్షిత్తు ఒకరోజు అడవికి వేటకు వెళ్ళాడు. జంతువులను చాలా సేపు వేటాడి అలసి పోయాడు. బాగా దాహం వేసింది. సమీపంలో ఒక మున్యాశ్రమం కనిపిస్తే అక్కడికి వెళ్ళాడు. అది శమీక మహాముని ఆశ్రమం. పరీక్షిత్తు వెళ్ళే సమయానికి శమీకుడు తపస్సులో ఉన్నాడు. పరీక్షిత్తు మంచినీళ్ళు అడిగాడు. తపోముద్రలో నున్న శమీకునికి రాజు మాటలు వినిపించలేదు. శమీకుడు బదులు చెప్పకపోవడంతో దాహంతో ఉన్న పరీక్షిత్తుకు కోపం వచ్చింది. ప్రక్కనే చచ్చిపడి ఉన్న ఒక పాము కనిపిస్తే, దానిని శమీకుని మెడలో వేసి వెళ్ళిపోయాడు.

శమీకముని కుమారుడు శృంగి. పరీక్షిత్తు వెళ్ళిపోయిన తరువాత శృంగి ఆశ్రమంలోకి వచ్చాడు. తండ్రి మెడలో మరణించిన పామును చూశాడు. కోపం వచ్చింది. "నా తండ్రి మెడలో మృత సర్పాన్ని వేసి అవమానించిన వాడెవడో, అతడు తక్షకుడనే పాము కాటుకు గురై వారం రోజులలో



మరణించుగాక !" అని శపించాడు. శమీకుడు కళ్ళు తెరచాడు. జరిగిన విషయమంతా తన దివ్యదృష్టితో చూచి తెలుసుకున్నాడు. కుమారుని చూస్తూ "శృంగీ ! పొరపాటు చేశావు. నా మెడలో పామును వేసినవాడు మహారాజైన పరీక్షిత్తు. ధర్మపాలకుడు. శ్రీకృష్ణుని అనుగ్రహం వల్ల జీవాన్ని పొందినవాడు. అటువంటి వానిని కోపంతో శపించావు. ఆ పరీక్షిత్తు మరణిస్తే రాజ్యం అరాచకమైపోతుంది. ఎన్నో అకృత్యాలకు నిలయమౌతుంది. అది జరుగకూడదు. తప్పో, ఒప్పో శాపమిచ్చావు. తిరిగి తీసుకోలేవు. కాని శాప విషయాన్ని పరీక్షిత్తుకు తెలియజేయడం మన ధర్మం. తరువాత ఏమి చేయాలో ఆయన నిర్ణయించుకుంటాడు" అని చెప్పి, పరీక్షిత్తును కలుపుమని శృంగిని పంపించాడు. తండ్రి ఆనతి ప్రకారం శృంగి వెళ్ళి పరీక్షిత్తుకు జరిగిన సంగతినంతా వివరించి చెప్పాడు. తాను శమీకుని యెడల చేసిన అవమానానికి పరీక్షిత్తు బాధపడ్డాడు. ఋషులను కాపాడవలసిన తాను ఋషుల పట్ల అపచారానికి ఒడిగట్టడం ఘోరమైన చర్య అని దుఃఖించాడు. మంత్రి సామంత్రులను, పురోహితులను పిలిచి, జరిగిన విషయాన్ని వివరించి ఏమి చేయాలో తెలియజేయుమన్నాడు.

'మహర్షుల శాపాలు అనుభవించవలసిందే' అన్నారు అందరూ. తనకు చావు తప్పదని పరీక్షిత్తు అనుకున్నాడు. తన కుమారుడైన జనమేజయునకు పట్టంగట్టాడు. దానధర్మాలు ఆచరించాడు. గంగా తీరం చేరి ప్రశాంత వాతావరణంలో శ్రీమహావిష్ణువు పాదారవిందాలను ప్రార్థిస్తూ మరణించాలనుకున్నాడు. గంగా తీరాన్ని చేరుకున్నాడు. తిరిగి భూమి మీద పుట్టకుండా మోక్షాన్ని పొందడానికి మార్గమేమిటా అని ఆలోచనలో ఉన్న పరీక్షిత్తు వద్దకు శుకమహర్షి వచ్చాడు. ఆయనకు నమస్కరించి పరీక్షిత్తు కూర్చోబెట్టాడు. "మునీంద్రా ! నేను మరణానికి చేరువౌతున్నాను. నాకు మోక్షాన్ని పొందే మార్గాన్ని ఉపదేశించండి" అని శుకుని ప్రార్థించాడు.

"మహారాజా ! పుట్టినవారు గిట్టక తప్పదు. ఇది సృష్టి ధర్మం. కాని జీవించి ఉన్నప్పుడే ముక్తి పొందడానికి తగిన మార్గాన్ని ఎన్నుకోవాలి. అందుకు సులువైన మార్గం భాగవత గాథలను చదువుకోవడం లేదా వినడం. ఈ భాగవత గాథలను నా తండ్రి వ్యాసుడు నాకు చెప్పాడు. నేను ఆ గాథలను నీకు వినిపిస్తాను. భాగవత శ్రవణం వలన నీకు ముక్తి కలుగుతుంది. మనస్సును పరమాత్ముడైన ఆ విష్ణుమూర్తి యందు లగ్నం చేయి. సంసార బంధాలు నశిస్తాయి. పాపాలు హరిస్తాయి. భాగవతం నిన్ను భగవంతుని సన్నిధికి చేరుస్తుంది. మోక్షాన్ని ప్రసాదిస్తుంది" అని చెప్పాడు శుకుడు.

"మహర్షీ ! నేను వారం రోజుల్లో మరణించేటట్లు శృంగి శపించాడు. ఇప్పటికే కొంతకాలం జరిగిపోయింది. మిగిలిన కాలం భాగవత గాథలు వినడానికి సరిపోతుందా? ఆసాంతం భాగవత గాథలు వినకపోతే మోక్షం సిద్ధిస్తుందా?" అని పరీక్షిత్తు శుకమహర్షితో తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు. అందుకు శుకమునీంద్రుడు "భగవంతుని ఎంతకాలం ధ్యానం చేశామనేది ప్రధానం కాదు, ఎంత నిష్ఠగా ధ్యానం చేశామనేది, ఎంత భక్తిశ్రద్ధలతో భగవంతుని కథలు విన్నామనేది ప్రధానం. దీనికి ఖట్వాంగుడి వృత్తాంతమే నిదర్శనం. ఖట్వాంగుడనే రాజు దేవతలకు సహాయం



చేస్తూ కొన్ని తరాలు తన రాజ్యానికి దూరంగా ఉన్నాడు. అతడు తిరిగి వచ్చిన తరువాత అతనినెవరూ రాజ్యంలో గుర్తించలేదు. ఖట్వాంగుడు తన ఆయుర్దాయం గురించి తెలుసుకుంటే ఏడు గడియలు మాత్రమే ఉందని దేవతలు చెప్పారు. ఖట్వాంగుడు సర్వస్వాన్ని త్యజించి, మిగిలిన ఏడు గడియలు విష్ణువు మీద మనస్సు నుంచి, నారాయణ నామస్మరణ చేస్తూ గడిపాడు. దానితో అతనికి మోక్షం సిద్ధించింది. కాబట్టి నీవు కూడా మిగిలి ఉన్న సమయాన్ని భగవంతుని దివ్యగాథలను ఆలకిస్తూ ఉంటే నీకూ మోక్షం సాధ్యమవుతుంది. నీకు విష్ణుమూర్తి అవతారాల గురించి, విష్ణుభక్తుల భక్తితాత్పర్యాల గురించి, భగవంతుడు భక్తులపై చూపే వాత్సల్యం గురించిన కథలు చెపుతాను. విను" అంటూ విష్ణువును గురించిన దివ్యమైన గాథలను, భగవంతుని అవతార విశేషాలను వివరించాడు.

"పరీక్షిన్మహారాజా ! ఈ రోజుతో భాగవత కథలు సమాప్తమయ్యాయి. మృత్యువు కబళించే లోపు హరినామస్మరణతో, భగవంతుని పూజించు. నీకు ముక్తి కలుగుతుంది" అని శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్పి వెళ్ళిపోయాడు. పరీక్షిత్తు తదేక దృష్టితో పరిసరాలను మరచి శ్రీమన్నారాయణ మంత్రాన్ని ధ్యానం చేయసాగాడు. ఆ రోజు శృంగి శాపం ప్రకారం ఏడవ రోజు. తక్షకుడు పరీక్షిత్తును కాటు వేయవలసిన రోజు. పరీక్షిత్తు ధ్యానంలో ఉంటే ఎందరో ఋషి శ్రేష్ఠులు ఆయనను పరివేష్ఠించి మంత్రాలను చదువుతున్నారు.

తక్షకుడు పరీక్షిత్తును కాటువేసి శృంగి శాపం నెరవేర్చడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. సదస్యులకు ఇవ్వడానికి పండ్లను తీసుకొని వెళ్ళడం తక్షకుడు చూశాడు. వెంటనే సూక్ష్మమైన క్రిమిరూపాన్ని ధరించి ఒక పండులోకి దూరాడు. పండ్లను లోపలికి తీసుకొని వెళ్ళేటప్పుడు పరీక్షించారు గాని, తక్షకుడు సూక్ష్మరూపంలో ఉండడంతో భటులు గుర్తించలేక పోయారు. సభికులు ఆహారంగా పండ్లను తీసుకుంటున్నారు. పరీక్షిత్తు కూడా ఒక పండును తీసుకున్నాడు. అది తక్షకుడు సూక్ష్మరూపంలో ఉన్న పండే. పరీక్షిత్తు పండును కొరికాడు. అది సూర్యుడు అస్తమిస్తున్న సమయం. పరీక్షిత్తు కొరికిన వెంటనే ఆ ఫలం నుండి తక్షకుడు బయటకు వచ్చాడు. సహజ రూపాన్ని పొంది విషాన్ని కక్కుతూ పరీక్షిత్తును కాటు వేశాడు. వెంటనే విష ప్రభావంతో పరీక్షిత్తు శరీరం రంగు మారిపోయింది. భౌతిక శరీరం నేలమీద వాలిపోయింది.

పరీక్షిత్తు శరీరం నుండి సభికులందరూ చూస్తూ ఉండగానే ఒక తేజోవంతమైన కాంతిపుంజం బయటకు వచ్చింది. అదే సమయానికి ఆకాశం నుండి ఒక అందమైన విమానం అక్కడకు చేరింది. పరీక్షిత్తు శరీరం నుండి బయటకు వచ్చిన ఆయన ఆత్మను తనపై ఎక్కించుకొని ఆకాశంలోకి ఎగిరిపోయింది. ఈ దృశ్యాన్ని చూచిన వారందరూ పరీక్షిత్తు విష్ణుమూర్తిని ధ్యానించడం వల్ల, శుకమహర్షి నుండి భాగవతాన్ని వినడం వల్ల ఆయన వైకుంఠ వాసానికి వెళ్ళాడని, మోక్షాన్ని పొందాడని భావించారు. తనను ధ్యానించిన పరీక్షిత్తుకు ముక్తిని ప్రసాదించిన ఆ శ్రీమన్నారాయణుని కీర్తించారు. ఇదీ పరీక్షిత్తు కథ.

ఇక శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుకు తెలిపిన విష్ణుమూర్తి అవతారాలను గురించి, విష్ణుభక్తులైన భాగవత శ్రేష్ఠుల గురించి తెలుసుకుందాం.

VGS PUBLISHERS



VGS PUBLISHERS

# దక్షప్రజాపతి కథ

దక్షుడు ఒక ప్రజాపతి. అతని భార్య ప్రసూతి. అతనికి పదహారుగురు పుత్రికలు. వారిలో సతీదేవి ఒకర్తె. ఆమెనే దాక్షాయణి అని కూడా అంటారు. దక్షుడు ఆమెను పరమశివునికి ఇచ్చి వివాహం చేశాడు.

ఒకసారి బ్రహ్మవేత్తలు లోకకల్యాణం కోసం ఒక యజ్ఞాన్ని తలపెట్టారు. ఆ యజ్ఞానికి దక్షప్రజాపతి వచ్చే సమయానికి పరమేశ్వరుడు, విష్ణువు తదితర దేవతలు ముందుగా వచ్చి ఆసీనులై ఉన్నారు. దక్షుడు యజ్ఞవాటికలో ప్రవేశింపగానే అందరూ గౌరవంతో లేచి నిలబడ్డారు గాని ఈశ్వరుడు మాత్రం లేవలేదు. "కన్యాదానం చేసిన మామను గౌరవించడం నీకు తెలియదా?" అని దక్షుడు శివుని మీద మండిపడ్డాడు. అందుకు శివుడు "ఈ యజ్ఞవాటికలో సృష్టి స్థితి లయ కారకులుగా మేము వ్యవహరిస్తున్నాం. ఈ యాగ సందర్భంగా త్రిమూర్తులను మీరే గౌరవించాలి. కనుక మర్యాదగా మాట్లాడడం నేర్చుకో !" అని బదులు చెప్పాడు. ఈ మాటలకు దక్షుడు కోపంతో ఊగిపోయాడు. యజ్ఞప్రదేశం నుండి నిష్క్రమించాడు.

యజ్ఞశాలలో తనకు గౌరవం ఇవ్వకుండా ధిక్కరించి పలికిన పరమేశ్వరుని అవమానించాలని దక్షుడు తానే స్వయంగా ఒక యజ్ఞాన్ని నిర్వహించడానికి పూనుకున్నాడు. ఆ యజ్ఞానికి దేవతలను, మహర్షులను అందరినీ ఆహ్వానించాడు. కాని సతీదేవికి, ఈశ్వరునికి ఆహ్వానాలు పంపలేదు. తండ్రి యజ్ఞం చేస్తున్నాడనే విషయం తన సోదరీ సమూహం ద్వారా సతీదేవికి తెలిసింది. తండ్రి తనను ఆహ్వానించనందుకు ఆశ్చర్యపోయింది. యజ్ఞసమయంలో పుట్టినింటికి వెళ్ళి తల్లిదండ్రులను, తోబుట్టువులను చూడాలనుకున్నది. శివునితో తన కోరికను తెలియజేసింది. శివుడు కాసేపు సమాధానం చెప్పలేదు. మౌనం అర్ధాంగీకారంగా సతీదేవి భావించింది. ఈశ్వరుడు మౌనాన్ని వీడి "సతీ ! పిలవని పేరంటానికి వెళ్ళడం మంచిది కాదేమో ?" అన్నాడు. అందుకు సతీదేవి "పేరంటానికి అయితే వెళ్ళకూడదు గాని యజ్ఞానికి పిలవకపోయినా వెళ్ళవచ్చు గదా? కాబట్టి వెళ్ళి యజ్ఞాన్ని చూచి వస్తాను" అన్నది. సర్వజ్ఞుడైన శివుడు చిరునవ్వు నవ్వాడు. "నీ యిష్ట ప్రకారమే వెళ్ళిరా !" అన్నాడు. సతీదేవి బయలుదేరడంతో ఆమెకు తోడుగా నందీశ్వరుని, కొంత ప్రమథ సమూహాన్ని పంపించాడు.

సతీదేవి తన వారినందరినీ చూడబోతున్నాననే ఆనందంలో పుట్టింటికి చేరింది. కాని ఇంట్లోకి అడుగుపెట్టిన ఆమెకు వెంటనే అవమానం ఎదురయింది. తన తల్లి తనకు ఎదురుగా వచ్చి కూడా పలుకరించలేదు. తోడ బుట్టినవారు తన చెంతకు రాలేదు. బంధువులు కుశల ప్రశ్నలు వేయలేదు. భర్త మాట కాదని రావడం తప్పని, అందుకు తగిన శాస్తి జరిగిందని సతి మనసులో అనుకున్నది. యజ్ఞాన్ని చూద్దామనుకుంటూ యజ్ఞ వాటికలోనికి ప్రవేశించింది. యజ్ఞ నిర్వహణలో ఉన్న దక్షుని వద్దకు వెళ్ళి నమస్కరించింది. పలుకరించబోయింది. దక్షుడు విసుక్కున్నాడు. "నిన్నెవరు పిలిచారు ? నీ వెందుకు వచ్చావు ?" అని ఈసడించుకున్నాడు. సతీదేవికి నోట మాటరాలేదు.

VGS PUBLISHERS


VGU PUBLISHERS

తండ్రి మాటలు ఆమె మనసును బాగా నొప్పించాయి. హృదయం విలవిలలాడింది.

భర్త అంగీకారం తెలుపకపోయినా తానే చొరవ తీసుకొని పుట్టింటి మీద మమకారంతో స్వతంత్రంగా నిర్ణయం తీసుకొని రావడం తప్పని సతీదేవికి తెలిసివచ్చింది. "ఇంత అవమానం జరిగాక భర్త దగ్గరకు ఏ ముఖంతో వెళ్ళగలను ?" అనుకున్నది. త్రిమూర్తులలో ఒకడై, సర్వలోక పూజితుడైన పరమేశ్వరుని నిందించినవారు త్వరలోనే ప్రతిఫలం పొందుతారని అనుకున్నది. తన కాలి బొటన వ్రేలుని భూమిపై రాసింది. వెంటనే ఆ ప్రదేశంలో అగ్ని జ్వలించింది. యజ్ఞవాటికలోని అందరూ చూస్తూ ఉండగానే ఆ అగ్నిలో ప్రవేశిస్తూ "దక్ష ప్రజాపతీ ! నేను ఇప్పుడే ఇక్కడే ఈ అగ్నిలో సజీవంగా నన్ను దహనం చేసుకుంటున్నాను. నన్ను అవమానించిన నీ యజ్ఞవాటిక నా దహనంతో వల్లకాడుగా మారిపోతుంది. భూత సమూహాలన్నీ ఇక్కడే విలయ తాండవం చేస్తాయి" అంటూ అగ్నిలో ప్రవేశించి దహనమయిపోయింది. దేవతలు, మునీంద్రులు నిశ్చేష్టులయ్యారు.

పరమశివుడు సతీదేవికి తోడుగా పంపిన నందీశ్వరుడు, ప్రమథ గణాలు, సతీదేవి బూడిదగా మారడం చూచి హాహాకారాలు చేస్తూ, యజ్ఞానికి సంబంధించిన వస్తు సంచయాన్ని నాశనం చేయసాగారు. వారిని ఆపవలసినదిగా దక్షుడు దేవతలను ప్రార్థించాడు. దేవతలు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో వారికి నంది, ప్రమథ గణాలకు యుద్ధం మొదలయింది. కైలాసంలో ఉన్న పరమశివునికి ఈ విషయం తెలిసింది. ఆయన ఉగ్రుడయ్యాడు. తన జటాజూటం నుండి ఒక జటను పెరికి భూమిపై విసిరి కొట్టాడు. అక్కడి నుండి భయంకరాకారంతో ఒక వ్యక్తి జన్మించాడు. అతడే వీరభద్రుడు. కళ్ళ నుండి నిప్పులు కురిపిస్తున్న ఆ వీరభద్రునిలో శివుడు తన రౌద్రతేజస్సును నిక్షిప్తం చేశాడు. "వీరభద్రా ! దక్షుడు నా సతీదేవి మరణానికి కారణమయ్యాడు. అతని యజ్ఞాన్ని నాశనం చేసిరా !" అని ఆజ్ఞాపించాడు. వీరభద్రుడు "ఓం నమశ్శివాయ" అంటూ బయలుదేరాడు. అతనితో పాటు ప్రమథగణాలన్నీ బయలుదేరాయి.

అతి భయంకరమైన రూపంతో, ప్రమథ గణంతో కలిసి మహోద్రేకంతో వస్తున్న వీరభద్రుని చూచి దక్షుడు భయపడ్డాడు. ప్రాణభయంతో దిక్పాలకులనీ, బ్రహ్మనీ, శ్రీహరినీ శరణువేడాడు. వీరభద్రుని ఆపడానికి దేవతా సమూహాలన్నీ ప్రయత్నించాయి గాని అతనిని ఆపలేకపోయాయి. అతని చేతిలో ఓటమి పాలయి పారిపోయాయి. వీరభద్రుడు దక్షుని సమీపించాడు. దక్షుడు విష్ణువును స్మరించి, రక్షింపుమని వేడుకున్నాడు. విష్ణువు సుదర్శన చక్రాన్ని ప్రయోగించినా, అది వీరభద్రుని ఆపలేకపోయింది. దానితో వీరభద్రుని నియంత్రించగల శక్తి పరమేశ్వరునికి తప్ప మరెవరికీ లేదని విష్ణుమూర్తి గ్రహించాడు. వెంటనే గరుత్మంతుని కైలాసానికి పంపించాడు. గరుత్మంతుని కోరికపై శివుడు శాంతించి తానే స్వయంగా బయలుదేరి దక్షుని యజ్ఞశాల వద్దకు వచ్చాడు. శివుడు అక్కడికి వచ్చేలోపలే వీరభద్రుడు దక్షుని జుట్టు పట్టి లాగి, అతని శిరస్సును ఖండించాడు. వీరభద్రుని కత్తివేటుకు దక్షుని తల ఎగిరి యజ్ఞగుండంలో పడిపోయింది.

సతీదేవి శపించినట్లే యజ్ఞవాటిక వల్లకాడుగా తయారయింది. శివుడు యజ్ఞవాటికలో ప్రవేశించే

VGS PUBLISHERS


VGS PUBLISHERS

సమయానికి దక్షుని మొండెం నేలమీద పడిపోయి ఉంది. మెడ నుండి ఎగిసి పడిన రక్తం శివుని పాదాల మీద పడింది. ఆ రక్తాభిషేకంతో శివుడు శాంతించాడు. శివుని చూచి వీరభద్రుడు కూడా శాంతించాడు. దక్షప్రజాపతి భార్య భర్త మరణానికి చింతిస్తూ పరమేశ్వరుని పాదాలపై బడి శరణు వేడింది. పతిభిక్ష పెట్టుమని ప్రార్థించింది. దయాసముద్రుడైన పరమేశ్వరుడు యజ్ఞం కోసం తెచ్చిన ఒక గొర్రె శిరస్సును ఖండించి, దానిని దక్షుని మొండానికి అతికించాడు. ప్రాణం పోశాడు. దక్షుడు సజీవుడయ్యాడు. తిరిగి బ్రతికిన దక్షుడు ఎదురుగా కనిపించిన పరమేశ్వరునికి నమస్కరించాడు. తన అహంకారం నశించిందని, తన తప్పులు మన్నింపుమని వేడుకున్నాడు. శివుని హృదయ పూర్వకంగా స్తుతి చేశాడు. భక్తవశంకరుడైన శివుడు అతనిని మన్నించాడు. సతీ వియోగానికి బాధపడుతూ తపస్సు చేసుకోడానికి హిమాలయాలకు వెళ్ళాడు.

బ్రహ్మ కోరికపై దక్షుడు మరొక యజ్ఞాన్ని ప్రారంభించగా విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. దేవతలందరూ విష్ణువును స్తుతించారు. త్రిమూర్తులను వేరుగా చూడవద్దని, ముగ్గురూ లోకాలను రక్షించేవారని విష్ణువు తెలియజేశాడు. దక్షునికి యజ్ఞఫలం పొందేటట్లు వరం ఇచ్చాడు.

# ధ్రువుని కథ

స్వాయంభువు మనువు భార్య శతరూప. వారికి ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు పుత్రులు కలిగారు. వారిలో ఉత్తానపాదునకు సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. ఉత్తానపాదునికి సునీతి వలన ధ్రువుడు అనే పుత్రుడు, సురుచి వలన ఉత్తముడు అనే కుమారుడు కలిగారు.

ఉత్తానపాదునికి చిన్న భార్య అయిన సురుచి అంటే ప్రేమ అధికం. అందువలన ఎక్కువ కాలం సురుచి మందిరంలోనే ఉండేవాడు. ఆ కారణం చేత సురుచి కుమారుడైన ఉత్తమునికి ఉత్తానపాదుని దగ్గర చనువు ఎక్కువగా ఉండేది. ఒకరోజు సురుచి మందిరంలో ఉత్తానపాదుడు ఉత్తముని తన ఒళ్ళో కూర్చోబెట్టుకొని ఆడిస్తున్నాడు. ఆ సమయానికి ధ్రువుడు అక్కడికి వచ్చాడు. తమ్ముడైన ఉత్తముడు తండ్రి తొడపై కూర్చొని ఆడుకోవడం గమనించాడు. వెంటనే వెళ్ళి తాను కూడా తండ్రి ఒళ్ళోకి ఎక్కి కూర్చున్నాడు. ధ్రువుడు తన కుమారునితో సమానంగా తన భర్త ఒళ్ళో కూర్చోవడం చూచి సురుచి సహించలేకపోయింది. గబగబా వచ్చి భర్త ఒళ్ళో ఉన్న ధ్రువుని లాగి పారేసింది. “తండ్రి ఒళ్ళో కూర్చునే హక్కు నీకు లేదు. ఎప్పుడూ రాకు. పో !” అంటూ తన మందిరం నుంచి పంపించింది.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

ధ్రువుడు ఏడుస్తూ తన తల్లి సునీతి దగ్గరకు వెళ్ళి, జరిగిన సంగతి చెప్పాడు. ఆమె బాధపడింది. మంచి మాటలతో అతనిని ఓదార్చింది. విష్ణుమూర్తి కథలను చెప్పి అతని మనస్సును విష్ణుమూర్తి వైపు మళ్ళించింది. "శ్రీహరి దయకు పాత్రుడవయితే నీకు కూడా అన్నీ లభిస్తాయి. ముందు తపస్సు చేసి ఆ విష్ణుమూర్తి అనుగ్రహాన్ని సంపాదించు" అని బోధ చేసింది. తల్లి మాటలు విని తపస్సు చేయాలనే ఉద్దేశంతో ధ్రువుడు అడవికి బయలుదేరాడు. దారిలో నారదుడు కనిపించాడు. ధ్రువుని సంకల్పం తెలుసుకున్నాడు. నారాయణమంత్రాన్ని ఉపదేశించాడు. నిష్ఠతో జపిస్తే శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమౌతాడని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

ధ్రువుడు యమునా నదిలో స్నానం చేసి, మధువనంలో నారదుడు చెప్పినట్లు నారాయణ మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేశాడు. ధ్రువుని తపోనిష్ఠకు ముల్లోకాలు చలించాయి. దేవతలు ఆశ్చర్యపోయారు. వారు ఇంద్రుని తీసుకొని విష్ణుమూర్తిని దర్శించారు. ధ్రువుని తపస్సును విరమించేటట్లు చేయుమని ప్రార్థించారు. విష్ణువు లక్ష్మీదేవితో వచ్చి ధ్రువునికి కనిపించాడు. ధ్రువుడు విష్ణుమూర్తి పాదాలపై తల నుంచి ప్రార్థించాడు. శ్రీహరి ధ్రువునితో "నీ తపస్సుతో నన్ను మెప్పించావు. కొంతకాలం నీ తండ్రి రాజ్యానికి రాజువై పాలించు. భగవద్భక్తితో సత్కర్మలు చేస్తూ, యాగాలు నిర్వహించు. అనంతరం ఆకాశంలో నక్షత్రానివై శాశ్వతంగా ప్రకాశిస్తావు" అని చెప్పి అంతర్ధానమయ్యారు.

VCS PUBLISHERS

ధ్రువుడు తన రాజ్యానికి వచ్చాడు. తండ్రి ఉత్తానపాదుడు ధ్రువుని గాఢాలింగనం చేసుకున్నాడు. ధ్రువునికి అనతికాలంలోనే పట్టాభిషేకం చేసి, తాను వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. ధ్రువుడు భ్రమిని అనే కన్యను వివాహమాడాడు. ధర్మాన్ని ఆచరిస్తూ, యజ్ఞ యాగాదికాలు నిర్వహిస్తూ, శ్రీమన్నారాయణుని ధ్యానం చేస్తూ చాలాకాలం రాజ్యం చేశాడు. అతనికి అంత్యకాలం సమీపించగానే విష్ణుభటులు వచ్చి ఆయనను దివ్య విమానంలో ఎక్కించుకొని వైకుంఠానికి బయలుదేరారు. "నా తల్లిని విడిచి నేను రాలేను" అని ధ్రువుడు అనగానే విష్ణుభటులు తమకంటే ముందుగా వైకుంఠానికి వెళుతున్న ఆమెను చూపించారు. ధ్రువుడు ఆనందంతో వైకుంఠం చేరుకున్నాడు.

చిన్నతనంలోనే నిష్ఠతో తపస్సు చేసిన ధ్రువుడు శ్రీమన్నారాయణుని అనుగ్రహంతో ధ్రువతారగా నిలిచిపోయాడు.


VGS PUBLISHERS

# జడభరతుని కథ

ఒకప్పుడు నాభి అనే రాజు ఉండేవాడు. అతని భార్య మేరుదేవి. ఆయన భార్యాసహితంగా మహావిష్ణువును పూజించాడు. విష్ణువు ప్రత్యక్షం కాగా అతని వంటి పుత్రుని ప్రసాదింపుమని ప్రార్థించాడు. విష్ణువు నాభి కోరిక మన్నించి అతనికి కుమారునిగా జన్మించాడు. అతడే ఋషభుడు. ఉత్తమమైన పాలనతో ఋషభుడు మంచి కీర్తిని సంపాదించుకున్నాడు. ఇంద్రునికి ఋషభుని మీద ఈర్ష్య కలిగింది. దానితో ఆ రాజ్యంలో వర్షాలు పడకుండా చేశాడు. దాని వలన రాజ్యం అనావృష్టితో అల్లాడింది. అప్పుడు ఋషభుడు తన దివ్యశక్తులతో రాజ్యంలో వర్షాలు కురిపించాడు. దేశాన్ని సుభిక్షం చేశాడు.

ఋషభుని భార్య జయంతి. వారికి కలిగిన సంతానంలో ప్రసిద్ధి పొందినవాడు భరతుడు. అతడు గొప్ప విష్ణుభక్తుడు. అతని భార్య పంచజని. భరతుడు ధర్మదీక్షతో, సత్కర్మలు చేస్తూ భూమండలాన్ని పాలించాడు. తరువాత రాజ్యాన్ని తన కుమారులకు అప్పగించి, ఆశ్రమవాసానికి వెళ్ళాడు. విష్ణుసేవలో కాలం గడుపుతూ ఉన్నాడు. హరి సేవ వలన అతనిలో కోరికలు నశించాయి. జింక చర్మం ధరించి, ముప్పూటలా స్నానం చేస్తూ, శ్రీహరిని స్మరిస్తూ కాలం గడుపుతున్నాడు. అతని జుట్టు జడలు కట్టింది. అప్పటి నుండి అతనిని 'జడ భరతుడు' అని పిలిచేవారు. ఒకరోజు భరతుడు నదిలో స్నానం చేయడానికి వెళ్ళాడు. నిండుచూలుతో ఉన్న ఒక జింక ఆ నదిలో దప్పిక తీర్చుకుంటూ కనిపించింది. అదే సమయంలో జింకను చూచి ఒక సింహం దానిని తినడానికి గర్జిస్తూ వచ్చింది. సింహగర్జన విని జింక భయపడి నీటిలో దూకింది. హఠాత్తుగా సింహగర్జన వినడం వలన కలిగిన భయంతో జింక గర్భంలో ఉన్న పిల్ల బయట పడింది. జింక, జింకపిల్ల నీటిలో కొట్టుకుపోతుంటే చూడలేక భరతుడు నీటిలో దిగాడు. తల్లిని కాపాడలేకపోయాడు గాని జింకపిల్లను కాపాడగలిగాడు. జింక నదిలో కొట్టుకుపోవడం చూచి సింహం వెళ్ళిపోయింది.

భరతుడు జింకపిల్లను ఆశ్రమానికి తీసుకొనివచ్చాడు. దానిని ప్రేమతో పెంచుతూనే తపస్సును కొనసాగించాడు. క్రమంగా జింకపిల్లతో అతనికి అనుబంధం బలపడింది. బంధం బలపడడంతో క్రమంగా జడభరతుడు భగవంతుని పూజించడం మానుకున్నాడు. అన్నింటిని మరచి జింకపిల్లను సాకుతూ, దానితోడిదే లోకమన్నట్లుగా తయారయ్యాడు. ఒకనాడు ఆ జింకపిల్ల ఆశ్రమాన్ని విడిచి ఎటో వెళ్ళిపోయింది. దాన్ని తలచుకుంటూ భరతుడు తల్లడిల్లాడు. కొద్దిరోజుల తరువాత జింక తిరిగి వచ్చింది. అప్పటికి అతనికి చివరి క్షణాలు దగ్గరపడ్డాయి. జింకనే చూస్తూ ప్రాణాలు విడిచాడు.

జింకనే చూస్తూ మరణించిన భరతుడు తరువాతి జన్మలో లేడిగా జన్మించాడు. పూర్వజన్మ సంస్కారం వలన అతనికి పూర్వజన్మ జ్ఞానం కలిగింది. లేడిగా పుట్టడానికి గల కారణాలను విశ్లేషించుకున్నాడు. జింక దేహాన్ని విడిచిపెట్టాడు. మరుజన్మలో ఒక బ్రాహ్మణ కుమారునిగా జన్మించాడు. పూర్వజన్మ స్ఫూర్తి ఉండడం చేత బంధ విముక్తి కోసం అన్నింటికి దూరంగా మసలసాగాడు. తండ్రి మరణించిన తరువాత సవతి తల్లి కుమారులు అతనిని ఇంటి పనులు

VGS PUBLISHERS


VGS PUBLISHERS

చేయుమని చెప్పారు. ఎప్పుడూ భరతుని వారు తిడుతూ ఉండేవారు. అయినా భరతుడు విరాగంతో వారు చెప్పిన పనులన్నీ చేస్తూ ఉండేవాడు.

భరతుడు సుఖ దుఃఖాలకు అతీతంగా, దేని మీద అనురాగాన్ని పెంచుకోకుండా నిరాసక్తంగా తిరుగుతూ ఉండేవాడు. సవతి తల్లి కొడుకులు అతనికి పొలం అప్పగించారు. అతడు కాదనకుండా పొలాన్ని కాపలా కాయడానికి వెళ్ళాడు. సంతానం లేని ఒక భిల్లరాజు సంతానం కోసం కాళికాదేవికి ఒక వ్యక్తిని బలి ఇద్దామనుకున్నాడు. అతనికి భరతుడు కనిపించాడు. భరతుని తీసుకొనివెళ్ళి కాళికాదేవికి బలి ఇవ్వబోయాడు. భరతుని తేజస్సును చూచి కాళికాదేవి భయపడింది. బ్రాహ్మణ హత్యకు పూనుకున్నందుకు భిల్లరాజుపై బడి అతనిని చంపివేసింది. శ్రీమన్నారాయణుని మనస్సులో నిలుపుకున్న భరతుడు కాళికాలయం నుంచి తిరిగి వచ్చి పొలానికి కాపలాగా ఉన్నాడు.

కొన్ని సంవత్సరాల తరువాత రహూగణుడు అనే రాజు ఆధ్యాత్మక విద్య తెలుసుకోవాలనే జిజ్ఞాసతో ఆ మార్గం గుండా వెళుతూ భరతుని తన పల్లకికి బోయిగా చేసుకున్నాడు. పల్లకి ఎగుడు దిగుడుగా నడపడంతో ఆ రాజు భరతుని తిట్టాడు. దానికి బదులు చెపుతూ భరతుడు అతనికి ఆధ్యాత్మక విద్యను బోధించాడు. అంతటితో ఆ రాజు తన అహంకారాన్ని విడిచి భరతునికి నమస్కరించాడు. తన పూర్వజన్మల గురించి చెప్పి, ఎల్లప్పుడు శ్రీమన్నారాయణుని ఆరాధిస్తే, మోక్షం కలుగుతుందని, సదా భగవద్భక్తులను పూజించడం మంచిదని బోధ చేశాడు.

విష్ణువును సదా పూజించడం వల్ల జడ భరతుడు మోక్షసాధనాలను తెలుసుకొని, మరణానంతరం విష్ణువులో లీనమయ్యాడు.

# గజేంద్ర మోక్షం

ద్రవిడ దేశాన్ని ఇంద్రద్యుమ్నుడు అనే రాజు పాలించేవాడు. అతనికి విష్ణువుపై అపారమైన భక్తి విశ్వాసాలు ఉండేవి. ఒకనాడు ఇంద్రద్యుమ్నుడు కొలువులో ఆసీనుడై ఉన్నాడు. ఆ సమయంలో దుర్వాసుడు సభలోనికి వచ్చాడు. రాజ కార్యాల్లో నిమగ్నుడయిన ఇంద్రద్యుమ్నుడు దుర్వాసునికి వెంటనే స్వాగతం చెప్పలేదు. అందుకు దుర్వాసుడు కోపించాడు. "మదగర్వంతో విర్రవీగుతున్నావు కనుక మదపుటేనుగువై జన్మించు" అని శాపం ఇచ్చాడు. ఇంద్రద్యుమ్నుడు దుఃఖిస్తూ దుర్వాసుని కాళ్ళు పట్టుకొని తనను క్షమింపుమని ప్రార్థించాడు. శాప విమోచనం చెప్పవలసిందని వేడుకున్నాడు. మహావిష్ణువే స్వయంగా వచ్చి శాపవిమోచనం కలిగిస్తాడని దుర్వాసుడు తెలియజేశాడు. శాపం కలిగినందుకు బాధపడినా, స్వయంగా విష్ణువే వచ్చి శాప విమోచనం కలుగజేస్తాడనే మాటకు ఇంద్రద్యుమ్నుడు సంతోషించాడు.

ఇంద్రద్యుమ్నుడు త్రికూట పర్వత సమీపంలో ఉన్న అరణ్యంలో ఏనుగుగా జన్మించాడు. ఏనుగుల గుంపుకు రాజై ఆ అడవిలో ఆనందంగా తిరుగసాగాడు. ఒకరోజు ఆ గజరాజు సమీపంలో ఉన్న ఒక కొలనులో దిగింది. దానితోపాటు దాని భార్యలైన ఏనుగులు కూడా నీటిలో దిగాయి.

VCS PUBLISHERS



అన్నీ సరస్సును అల్లకల్లోలం చేస్తూ వినోదించసాగాయి. అప్పటివరకు నిశ్చలంగా ఉండే మడుగు అల్లకల్లోలం అయినందుకు అందులో నివాసం ఉండే మొసలికి కోపం వచ్చింది. అది వచ్చి ఏనుగు కాలును పట్టుకున్నది. ఆ గజరాజు మొసలి పట్టు నుండి విడిపించుకోడానికి పలువిధాల ప్రయత్నించింది. మొసలి తనపట్టు విడవలేదు. నీళ్ళలో ఉండే మొసలి బలవంతురాలు కదా ! ఎంత బలాన్ని ప్రయోగించినా ఏనుగు మొసలి నుండి తప్పించుకోలేకపోయింది.

ఏనుగును మడుగులోకి లాగాలని మొసలి, మొసలి నుండి విడిపించుకొని బయటపడాలని ఏనుగు పెనుగులాడుతూనే ఉన్నాయి. రోజులు గడిచాయి. పోరాటం ముగిసిపోలేదు. గజరాజు వెంట వచ్చిన ఆడ ఏనుగులు ఏమీ చేయలేక ఆ గజేంద్రుని విడిచి వెళ్ళిపోయాయి. ఒంటరిగా మిగిలిపోయినా స్థైర్యాన్ని కోల్పోకుండా, ఆ గజరాజు పోరాడుతూనే ఉంది. మరికొన్ని రోజులు గతించినా పోరాటం ఆగలేదు. నెలలు గడిచాయి. ఆహారం, నిద్ర లేకపోవడంతో గజేంద్రుని బలం క్షీణించింది. శక్తి ఉడిగిపోయింది. మహావిష్ణువు స్ఫురించాడు. వెంటనే శ్రీమన్నారాయణుని తలచుకొని ఏకాగ్రచిత్తంతో "నీవే దిక్కు" అంటూ మొరపెట్టుకుంది.

గజరాజు విష్ణువును స్మరించిన సమయానికి ఆ దేవదేవుడు లక్ష్మీదేవితో వినోదం కోసం పాచికలాడుతున్నాడు. గజరాజు మొర విన్నంతనే విష్ణువు ఉన్న ఫళంగా బయలుదేరాడు. భక్తులు అపాయంలో ఉంటే భగవంతుడు సహించలేడు కదా ! విష్ణువు బయలుదేరిన వెంటనే ఆయన వెనుక లక్ష్మీదేవి, ఆమె వెనుక గరుత్మంతుడు, శంఖచక్రాలు వెన్నంటి రాసాగాయి. విష్ణుమూర్తి గజరాజు ఉన్న మడుగు దగ్గరకు చేరుకున్నాడు.

విష్ణువు చేరేసరికి గజరాజు పరిస్థితి దిగజారింది. మరణానికి చేరువయ్యాడు. వచ్చిన వెంటనే విష్ణుమూర్తి తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. అది వెళ్ళి మొసలి శిరస్సును ఖండించింది. అంతే ఏనుగు కాలు మొసలి నోటి నుంచి బయటపడింది. గజరాజు మొసలి నుండి విముక్తుడయ్యాడు. సరస్సును వీడి గట్టు మీదికి వచ్చాడు. తనను రక్షించిన విష్ణుమూర్తిని స్తుతించాడు.

సుదర్శన చక్రంతో ఖండింపబడిన మొసలి గంధర్వునిగా మారి తనకు శాపవిముక్తి కలిగించినందుకు విష్ణువును కీర్తించాడు. దుర్వాసుని వలన శాపాన్ని పొందిన ఇంద్రద్యుమ్నుడు కూడా విష్ణువుచే శాపవిముక్తి పొందాడు. విష్ణువతనికి మోక్షాన్ని ప్రసాదించాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# క్షీరసాగరమథనం-కూర్మావతారం

దేవలోకానికి అధిపతి ఇంద్రుడు. ఇంద్రుడు ఒకనాడు తన ఏనుగును ఎక్కి తిరుగుతున్న సమయంలో విష్ణువును సందర్శించి వస్తున్న దుర్వాసుడు ఎదురుపడ్డాడు. దుర్వాసుడు ఇంద్రునికి ఒక తులసిమాలను బహూకరించాడు. ఇంద్రుడు అహంకారంతో ఆ తులసిమాలను నిర్లక్ష్యంగా స్వీకరించి తన ఏనుగుకు అందించాడు. అది ఆ మాలను దుర్వాసుని ముందే కాళ్ళక్రింద పడవేసి, త్రొక్కింది. ముక్కోపి అయిన దుర్వాసుడు ఆ సన్నివేశానికి మండిపోయాడు. “ఇంద్రా! అహంకారంతో కళ్ళు మూసుకుపోయి ప్రవర్తిస్తున్నావు. విష్ణుమూర్తి ప్రసాదితమైన తులసిమాలను బహుమతిగా ఇస్తే దానిని శిరస్సున ధరించకుండా, నేలపై పడవేసి, ఏనుగుతో త్రొక్కించి అవమానించావు. ఏ అహంభావంతో ఈ పని చేశావో ఆ అహంభావం నశిస్తుంది. ఏ అధికార గర్వంతో ఈ నైచ్యానికి ఒడిగట్టావో, ఆ అధికారం అంతరించిపోతుంది. నీ దేవతల రాజ్యం రాక్షసుల వశమౌతుంది. ఇది నా శాపం” అని శపించి వెళ్ళిపోయాడు.

దుర్వాసుని శాపకారణంగా క్రమంగా దేవతల శక్తి నశించింది. రాక్షసులతో జరిగిన యుద్ధంలో దేవతలు ఓడిపోయారు. ఇంద్రుని అధికారం అంతరించింది. రాక్షసులు బలవంతు లయ్యారు. ఇంద్రుడు రాక్షసులను జయించలేక, ఓటమి భారంతో వైకుంఠం వెళ్ళి మహావిష్ణువు శరణుజొచ్చాడు. విష్ణువు అతనిని ఓదార్చి “సముద్రాన్ని మథిస్తే అమృతం వస్తుంది. ఆ అమృతాన్ని త్రాగినవారికి చావు ఉండదు. అమృతాన్ని సాధిస్తే రాక్షసులను జయించవచ్చు. కాబట్టి అమృతాన్ని సాధించడానికి ప్రయత్నించండి. అందుకు మీ బలం సరిపోదు. కనుక దానవులతో స్నేహం చేయండి. వారితో కలిసి సముద్రాన్ని మధిస్తే మీకు అమృతం సిద్ధిస్తుంది. రాక్షసులను మోసగించి అమృతమంతా మీకు దక్కే విధంగా నేను చేస్తాను” అన్నాడు.

దేవతలు రాక్షసులతో మంతనాలాడి పాలసముద్రాన్ని మథించడానికి ఒప్పించారు. సముద్రాన్ని మథించడానికి కవ్వంగా మందరపర్వతాన్ని తెచ్చారు. తాడుగా వాసుకిని తెచ్చారు. తలవైపు రాక్షసులు, తోకవైపు దేవతలు పట్టుకొని, వాసుకిని మందర పర్వతానికి చుట్టి క్షీరసముద్రాన్ని చిలకడం ఆరంభించారు. పర్వతం సముద్రంలో మునిగిపోకుండా విష్ణువు తాబేలు రూపం ధరించి మందర పర్వతాన్ని తన వీపు మీద ధరించాడు. మందర పర్వతం మునగకుండా చేయడానికి విష్ణువు ఎత్తిన అవతారమే కూర్మావతారం.

దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని మథించడం మొదలుపెట్టారు. కొంతసేపటికి సముద్రం నుండి కామధేనువు జనించింది. దానిని మునులు తీసుకున్నారు. తరువాత ఉచ్చైశ్రవమనే గుర్రం, ఐరావతం అనే ఏనుగు ఆవిర్భవించాయి. వాటిని దేవేంద్రుడు తీసుకున్నాడు. తరువాత కల్పవృక్షం, చింతామణి పుట్టాయి. వాటిని దేవతలు గ్రహించారు. తరువాత లక్ష్మీదేవి, చంద్రుడు పుట్టారు. లక్ష్మీదేవిని విష్ణువు భార్యగా స్వీకరించాడు. చంద్రుడు ఆకాశంలోకి వెళ్ళాడు. కొంతసేపటికి తరువాత భయంకరమైన హాలాహలం అనే విషం ఉద్భవించింది. దేవతలు, రాక్షసులు భయపడ్డారు.

VCS PUBLISHERS


VGS PUBLISHERS

హాలాహలం బారి నుండి కాపాడవలసిందని పరమేశ్వరుని ప్రార్థించారు. ఈశ్వరుడు ఆ హాలాహలాన్ని తీసుకొని తన కంఠంలో నిలుపుకున్నాడు. ఆ విషప్రభావం చేత శివుని కంఠం నల్లగా అయిపోయింది. అందువల్లనే శివుని గరళకంఠుడు, నీలకంఠుడు అని పిలుస్తారు.

దేవతలు లక్ష్మీదేవి ఉద్భవించినా తృప్తిపడలేదు. హాలాహలం పుట్టినా ప్రయత్నాన్ని మానలేదు. చిలుకుతూనే ఉన్నారు. చివరకు అమృతం వచ్చింది. ఆ అమృత కలశాన్ని అసురులు అందుకొని వెళ్ళిపోయారు. వారిని దేవతలు అడ్డగించారు. అదే సమయంలో విష్ణువు జగన్మోహిని అవతారంతో వారి ముందుకు వచ్చాడు. ఆమె అందానికి దేవతలు, రాక్షసులు సమ్మోహితులయ్యారు. “మీరిద్దరూ కలిసి పాలసముద్రాన్ని మథించి అమృతాన్ని సాధించారు కాబట్టి ఇరువురూ దానిని సమానంగా పంచుకోవాలి. నేను మీకు సమంగా పంచుతాను” అంటూ రాక్షసుల వద్దనున్న అమృత భాండాన్ని జగన్మోహిని తీసుకున్నది.

“ఒక ప్రక్క దేవతలు, మరొక ప్రక్క దానవులు వరుసగా కూర్చోండి. అందరికీ అమృతం వడ్డిస్తాను” అని జగన్మోహిని అంటుంటే ఆమె అందాన్ని చూచి మైమరచి అందరూ ఆమె చెప్పినట్లే రెండు వరుసల్లో కూర్చున్నారు. జగన్మోహిని ముందుగా దేవతలు ఉన్న వరుసలోకి వెళ్ళింది. అమృతం పంచడం ఆరంభించింది. ఆమె అందానికి ముగ్ధులైన రాక్షసులు నోరు మెదపలేదు. దేవతలు అమృతాన్ని ఆస్వాదిస్తున్నారు. రాక్షసుల పంక్తిలో ఉండవలసిన రాహువు, కేతువు వచ్చి సూర్యచంద్రుల సరసన ఆసీనులయ్యారు. జగన్మోహిని సూర్యచంద్రులతో పాటు రాహుకేతువులకు కూడా అమృతాన్ని వడ్డించింది.

రాహుకేతువులు అమృతాన్ని నోట్లో పెట్టుకుంటున్న సమయంలో వారిద్దరినీ సూర్యచంద్రులు గుర్తించారు. జగన్మోహినిగా ఉన్న విష్ణువుకు తెలియజేశారు. వెంటనే విష్ణుమూర్తి సుదర్శన చక్రంతో వారిద్దరి తలలు ఖండించాడు. అప్పటికే అమృతం గొంతుల వరకు దిగడం వల్ల రాహుకేతువుల తలలు సజీవంగా ఉండి, మొండేలు మాత్రం, నిర్జీవంగా నేల మీద పడిపోయాయి. తలలు మాత్రమే ఉన్న రాహుకేతువులను గ్రహపంక్తిలో ఉండుమని బ్రహ్మ ఆదేశించాడు. జగన్మోహిని అమృతాన్ని దేవతలందరికీ పంచిపెట్టి ఖాళీ భాండాన్ని రాక్షసుల ముందు వేసి మాయమైపోయింది.

జగన్మోహిని మాయమవడంతో రాక్షసులు తమకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నారు. వెంటనే దేవతలతో యుద్ధానికి తలపడ్డారు. అమృతం త్రాగడం వలన చావు భయం లేని దేవతలు రాక్షసులతో ధైర్యంగా తలబడ్డారు. యుద్ధంలో వారిని జయించి అమరావతిని ఆక్రమించు కున్నారు. దేవతల ధాటికి ఆగలేక రాక్షసులు పాతాళానికి పారిపోయి తలదాచుకున్నారు.

విష్ణుమూర్తి కూర్మావతారంతో అమృతం జనించడానికి సాయపడడంతోపాటు, జగన్మో హినిగా కనిపించి దేవతలకు మాత్రమే అమృతం అందేటట్లు చేశాడు. ఆయన చేసిన పనివల్ల దేవతలు అమరులయ్యారు. రాక్షసుల మీద విజయం సాధించారు.

VGS PUBLISHERS



# వామనావతారం

అమృతాన్ని త్రాగిన తరువాత దేవతలు శక్తిమంతులయ్యారు గదా ! వారితో జరిగిన యుద్ధంలో రాక్షసులు ఓటమి పాలయి పాతాళంలో తలదాచుకుంటున్నందుకు రాక్షసుల గురువయిన శుక్రాచార్యుడు బాధపడ్డాడు. తన శిష్యుడైన బలిని పిలిచి అతని చేత విశ్వజిత్తు అనే యజ్ఞాన్ని చేయించాడు. యజ్ఞం పూర్తయ్యే సమయానికి యజ్ఞగుండం నుండి ఒక దివ్య తేజస్సు కలిగిన రథం, గొప్ప ధనుస్సు, రెండు అమ్ములపొదులు, వజ్రంతో సమానమైన ఒక కవచం ఉద్భవించాయి. శుక్రాచార్యుని ఆనతితో బలి చక్రవర్తి తన దివ్యాయుధాలతో దేవలోకం మీదికి దండెత్తాడు. దేవతలను ఓడించి, అమరావతి నుండి పారద్రోలాడు. దానితో దేవతలు తలకొక దిక్కుకు పారిపోయారు.

కశ్యప ప్రజాపతికి ఇద్దరు భార్యలు గదా ! దితికి పుట్టినవారు దైత్యులు అంటే రాక్షసులు. అదితికి పుట్టినవారు ఆదిత్యులు. అంటే దేవతలు. దేవతలు బలి చేతిలో ఓడి బాధలు పడుతున్నందుకు అదితి బాధపడి తన భర్త కశ్యపుని వద్దకు వెళ్ళి "స్వామీ ! నా బిడ్డలు ఎంత బాధపడుతున్నారో మీకు తెలుసు గదా ! వారి కష్టాలు కడతేరే మార్గం లేదా ?" అని అడిగింది. కశ్యపుడు కాసేపు ఆలోచించి "అదితీ ! దేవతల కష్టాలను తొలగించి, తిరిగి పూర్వ వైభవం ప్రసాదించగలవాడు ఆ విష్ణుమూర్తి ఒక్కడే. ఆ దేవదేవుని ఆరాధించు. ఆయన అనుగ్రహిస్తే నీ బిడ్డల కష్టాలు తీరుతాయి" అని చెప్పాడు. అదితి విష్ణుమూర్తిని ఆరాధించింది. విష్ణువు ఆమెను అనుగ్రహించి ఆమెకు కుమారుడుగా జన్మించాడు. అతడే వామనుడు.

వామనుడు చిన్నతనంలోనే చతుర్వేదాలతో పాటు సమస్త శాస్త్రాలు అభ్యసించాడు. బలి చక్రవర్తి యజ్ఞం నిర్వహిస్తున్నాడని, ఆ సందర్భంగా దానధర్మాలు విరివిగా చేస్తాడని తెలిసి బ్రాహ్మణులు చాలా మంది ఆ యాగానికి బయలుదేరారు. వామనుడు కూడా తల్లిదండ్రుల అనుమతితో బలి యాగానికి వెళ్ళాడు.

వామనుడు బలి యజ్ఞవాటికలో ప్రవేశించాడు. పొట్టి ఆకారం, కొత్తదైన యజ్ఞోపవీతం, తాటాకుల గొడుగు, పాదాలకు పావుకోళ్ళు, చేతిలో చెంబు, చంకలో జింకచర్మం – ఈ ఆకారంతో కనిపించిన వామనుని చూచి యజ్ఞశాలలోని వారందరూ ఆశ్చర్యపోయారు. బలిచక్రవర్తి కూడా ముద్దుముద్దుగా కనిపించే వామనుని చూచి మురిసిపోయాడు. వామనుడు బలిచక్రవర్తిని ఆశీర్వదించాడు. పరవశించిన బలి "వడుగా ! ఏం కావాలో కోరుకో ! నీకు ధారపోస్తాను" అని అన్నాడు.

"నాకు మూడు అడుగుల భూమిని దానం చెయ్యి" అంటూ వామనుడు తన కోరికను తెలియజేశాడు. "మూడడుగుల నేలా ? ఇంకా ఏదయినా కోరుకో ?" అన్నాడు బలి. "నాకు

VGS PUBLISHERS


శుభమ కలుగుగాక!
VGS PUBLISHERS

మూడడుగుల నేల చాలు" అన్నాడు వామనుడు. బలి వామనునికి దానం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. వామనుడు విష్ణుమూర్తి అవతారమని శుక్రాచార్యుడు గుర్తించాడు. వచ్చినవాడు విష్ణువని, అతనికి దానం ఇవ్వవద్దని బలిచక్రవర్తికి చెప్పాడు. దానం ఇస్తే రాక్షసకులాన్ని నాశనం చేస్తాడని హితవు పలికాడు. అతడికి మూడడుగుల నేల నిస్తే ముల్లోకాలు ఆక్రమిస్తాడని భయపెట్టాడు. ధనమాన ప్రాణాలు కోల్పోయేటప్పుడు మాట తప్పడం తప్పు కాదన్నాడు.

బలిచక్రవర్తి శుక్రాచార్యునితో "గురువర్యా ! మానధనులు మాట తప్పరు. నేను కూడా మాట తప్పను. ఇస్తానని చెప్పి లేదని పంపడం కంటె పాపం ఏముంటుంది. ఆ పని నేను చేయను. స్వయంగా విష్ణువే వచ్చి యాచిస్తున్నాడంటే, అతని చేయి క్రింద, నా చేయి పైన ఉన్నట్లే గదా ! రాజ్యం శాశ్వతం కాదు. ప్రాణాలు ఎప్పుడయినా పోయేవే ! నేను మాట ఇచ్చిన విధంగానే దానం ఇస్తాను" అంటూ భార్యను పిలిచాడు. ఆమె కలశంతో నీళ్ళు పోస్తూ ఉంటే వామనునికి దానం చేయడానికి సిద్ధమయ్యాడు.

తన మాట విననందుకు బలిచక్రవర్తి మీద శుక్రాచార్యునికి కోపం వచ్చింది. 'త్వరలోనే రాజ్యభ్రష్టుడవై పోదువు గాక' అని శపించాడు. అయినా బలి వెనుదీయలేదు. ఎలాగయినా దానమివ్వడాన్ని ఆపాలనుకున్న శుక్రాచార్యుడు సూక్ష్మరూపాన్ని ధరించి కలశంలోని నీరు బయటకు రాకుండా అడ్డం పడ్డాడు. ఆ విషయాన్ని గ్రహించిన వామనుడు తన చేతిలోని దర్భతో కలశంలోని రంధ్రంలో పొడిచాడు. దర్భ శుక్రాచార్యుని కంట్లో గ్రుచ్చుకుంది. ఆ కన్ను గ్రుడ్డిదైపోవడంతో శుక్రాచార్యుడు 'ఏకాక్షి' అయ్యాడు.

బలిచక్రవర్తి వామనుని పూజించి మూడడుగుల నేలను దానం చేశాడు. వామనుడు తనకిచ్చిన మూడడుగుల నేలను స్వాధీనం చేసుకుంటానన్నాడు. వామనుడుగా ఉన్న విష్ణువు తన రూపాన్ని పెంచాడు. ఆ రూపం ఇంతింతై క్రమంగా ఆకాశం వరకు వ్యాపించింది. సూర్య మండలాన్ని దాటి, ధ్రువ నక్షత్రాన్ని మించి బ్రహ్మాండమంతా నిండిపోయింది. ఆ రూపంతో వామనుడు ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించాడు. బలి చక్రవర్తిని ఉద్దేశించి "మూడవ అడుగు ఎక్కడ పెట్టమంటావు ?" అని ప్రశ్నించాడు. బలిచక్రవర్తి భక్తి భావంతో తలవంచి, "మూడవ అడుగు నా శిరస్సుపై ఉంచండి" అని చెప్పడంతో వామనుడు బలిచక్రవర్తి తలపై మూడవ అడుగు పెట్టి అతనిని పాతాళానికి త్రొక్కివేశాడు. అక్కడే ఉండుమని చెప్పాడు.

వామనావతారంతో విష్ణువు బలిచక్రవర్తిని పాతాళానికి పంపడంతో రాక్షసుల ప్రాబల్యం తగ్గిపోయింది. దేవతలు మళ్ళీ అధికారాన్ని అందుకున్నారు. ఇంద్రుడు అమరావతికి ప్రభువయ్యాడు.



VGS PUBLISHERS


VGS PUBLISHERS

# మత్స్యావతారం

ఒకప్పుడు సత్యవ్రతుడు అనే రాజు ఉండేవాడు. ఆయన విష్ణుభక్తుడు. విష్ణువును ప్రసన్నం చేసుకోవాలనే కోరికతో తపస్సు ప్రారంభించాడు. ఒకనాటి ప్రాతఃకాలంలో సంధ్యావందనం కోసం నదికి వెళ్ళాడు. స్నానం, సంధ్యా వందనం పూర్తిచేశాడు. నారాయణునికి జల తర్పణం చేయడానికి దోసిలి నిండా నదీజలాన్ని తీసుకున్నాడు. దోసిట ఉన్న జలంలో ఒక చేప కనిపించింది. అది "రాజా ! నదీ గర్భంలో ఉన్న పెద్ద చేపల వల్ల నా ప్రాణాలకు ముప్పు ఉంది. నన్ను కాపాడు" అని అడిగింది. సత్యవ్రతుడు ఆ చేపపిల్లను తన కమండలంలో వేసుకొని ఆశ్రమానికి తీసుకొనివెళ్ళి ఒక పాత్రలో ఉంచాడు. తెల్లవారేసరికి ఆ చేప ఆ పాత్ర నిండే విధంగా పెరిగిపోయింది. సత్యవ్రతుడు దానిని బావిలో వేయించాడు. మరునాటికి అది బావి పట్టనంతగా పెరిగింది. తరువాత చెరువులో వేశాడు. ఇంకా పెరగడంతో నదిలో వేయించాడు. ఏ రోజు కారోజు పెరిగిపోతూ ఉన్న ఆ చేపను చివరగా సముద్రంలోకి చేర్పించాడు. ఆ తరువాత ఆ చేపతో "నువ్వు మామూలు చేపవు అయితే ఇలా పెరగవు. నీ భక్తుడనైన నన్ను పరీక్షించడానికో, రక్షించడానికో ఈ రూపంలో వచ్చిన శ్రీహరివి అయి ఉంటావు" అంటూ చేపకు నమస్కరించాడు.

చేప సత్యవ్రతునితో "సత్యవ్రతా ! నువ్వు ఊహించింది నిజమే. నేను శ్రీమన్నారాయణ మూర్తినే. నేను చిన్న చేపపిల్లగా నీ దగ్గరకు వచ్చినప్పటి నుండి నన్ను కాపాడుతూ, ఇంతటి మహాకాయం పొందేటందుకు సాయం చేశావు. నీకు ఒక విషయం చెపుతాను. జాగ్రత్తగా విని, నేను చెప్పినట్లు చేయి. నేటి నుండి ఏడవ రోజుతో బ్రహ్మకు ఒక పగలు పూర్తి అవుతుంది. ఆ సందర్భంగా ప్రళయం ఏర్పడుతుంది. ఆ ప్రళయ ప్రభావంతో ముల్లోకాలు నాశనమవుతాయి. అలా కాకుండా ప్రళయం ప్రారంభమయిన వెంటనే ఒక నావ నీ దగ్గరకు వస్తుంది. ఆ సమయానికి నీవు సమస్త ప్రాణులను, ఆహారాన్ని, ఓషధులను సిద్ధం చేసుకో ! నావ వచ్చిన వెంటనే వానినన్నింటినీ నావలో ఎక్కించు. సప్తర్షులు వస్తారు. వారితో పాటు నీవూ నావను ఎక్కు. నావ ప్రళయానికి తిరగబడిపోకుండా ఒక త్రాటిని కట్టి దాని కొసను నాకు అందించు. నేను ఆ త్రాటిని నా కొమ్ముకు కట్టుకొని ప్రళయకాలం పూర్తయ్యే వరకు రక్షిస్తాను" అని చె. సత్యవ్రతుడు సరేనన్నాడు.

శ్రీహరి చెప్పినట్లు ఏడవనాడు ప్రళయం మొదలయింది. సత్యవ్రతుడు విష్ణువు చెప్పినట్లే సకల ప్రాణులను, ఆహారాన్ని, ఓషధులను సిద్ధం చేసుకొని, తన వద్దకు వచ్చిన నావపైకి ఎక్కించాడు. అంతలో సప్తర్షులు కూడా వచ్చారు. వారిని కూడా ఎక్కించుకొన్నాడు. నావకు తాడు కట్టి తాను ఎక్కి కూర్చున్నాడు. త్రాటి రెండవ కొసను నీటిలోకి విడువగా చేప రూపంలో ఉన్న విష్ణువు ఆ కొసను తన కొమ్ముకు తగిలించుకొని నీటిలోకి లాక్కుని వెళ్ళాడు. ప్రళయం పూర్తయ్యేవరకు అలా నీటిలో తిరుగుతూనే ఉన్నాడు. నావలో ఉన్న సత్యవ్రతుడు విష్ణువును ధ్యానిస్తూనే ఉన్నాడు. ప్రళయ కాలం ముగిసింది. సముద్రాలు మామూలు స్థితికి వచ్చాయి. భూమి బయట పడింది. భూమిపై నున్న సర్వప్రాణులు బ్రతికి బయటపడ్డాయి. సృష్టి తిరిగి కొనసాగింది. తనను భక్తితో పూజించిన సత్యవ్రతుని శ్రీహరి ఏడవ మనువుగా చేశాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

ప్రళయకాలం నాటి రాత్రి బ్రహ్మ తాను సృష్టించిన నాలుగు వేదాలను తల క్రింద ఉంచుకొని నిద్రించాడు. సోమకాసురుడు అనేవాడు ఆ వేదాలను దొంగిలించాడు. ఎవ్వరికీ కనిపించకుండా ఉండడం కోసం వేదాలను తీసుకొని వెళ్ళి మహాసముద్రం అడుగున కూర్చున్నాడు. రాక్షసుని చేతిలో పడిన వేదాలు రోదించడం మొదలుపెట్టాయి. ఆ రోదన విన్న బ్రహ్మదేవుడు నిద్ర నుండి లేచాడు. వేదాలు దొంగిలింపబడ్డాయని గ్రహించాడు. మత్స్యరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువును దర్శించి వేదాలను కాపాడుమని ప్రార్థించాడు. మత్స్యరూపంలో ఉన్న శ్రీహరి సోమకాసురుని కోసం ముల్లోకాలు గాలించి, సముద్ర గర్భంలో దాగి ఉన్న అతనిని గుర్తించాడు. అతనితో పోరుకు సిద్ధపడ్డాడు. సోమకాసురుడు కూడా మత్స్యంతో పోరాడి, మరణించాడు. శ్రీహరి వేదాలను తీసుకొని వెళ్ళి బ్రహ్మదేవునికి అందించాడు.

శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించి, లోకాలను ప్రళయం నుండి కాపాడాడు. సృష్టి కార్యానికి భంగం కలుగకుండా చేశాడు. సోమకాసురుని చంపి వేదాలను రక్షించాడు.

# అంబరీషుని కథ

సత్యవ్రతుని లాగానే విష్ణుభక్తుడైన ఒక చక్రవర్తి ఉండేవాడు. అతని పేరు అంబరీషుడు. అతడు తన భక్తి ప్రపత్తులతో విష్ణువును మెప్పించాడు. విష్ణువు అతనికి తన సుదర్శన చక్రాన్ని రక్షణగా ఇచ్చాడు.

విష్ణువు ప్రీతి కొరకు చేసే వ్రతాల్లో ఏకాదశీ వ్రతం ఒకటి. ఆ వ్రతం చేసినవారు మరునాడు అంటే ద్వాదశినాడు ఒక అతిథికి భోజనం పెట్టి ఆ తరువాత భుజించాలి. అది వ్రత నియమం. అంబరీషుడు కూడా ఏకాదశీ వ్రతం చేశాడు. ద్వాదశినాడు ఉదయాన్నే దుర్వాసుడు అంబరీషుని వద్దకు వచ్చాడు. తాను భోజనానికి వస్తానని చెప్పి, స్నానం చేయడానికి నదికి వెళ్ళాడు. దుర్వాసుడు వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తానని చెప్పినందుకు అంబరీషుడు సంతోషించాడు.

భోజన సమయం సమీపించింది. దుర్వాసుడు రాలేదు. ద్వాదశి ఘడియలు దాటిన తరువాత భుజిస్తే వ్రత ఫలితం దక్కదని పండితులు చెప్పారు. పెద్దల సలహా తీసుకున్నాడు. ఘడియలు దాటకుండా మంచినీళ్ళు త్రాగుమని, దుర్వాసుడు వచ్చిన తరువాత భోజనం చేయుమని పెద్దలు సలహా ఇచ్చారు. అంబరీషుడు మంచినీళ్ళు త్రాగే సమయానికి దుర్వాసుడు వచ్చాడు. అతిథిగా తాను వచ్చేలోపు మంచినీరు తాగినందుకు కోపించాడు. అంబరీషుడు జరిగినది చెప్పడానికి ప్రయత్నించినా వినలేదు. కృత్య అనే ఒక శక్తిని సృష్టించి అంబరీషుని మీదికి పంపించాడు. అంబరీషుడు భయపడి విష్ణుమూర్తిని తలచుకున్నాడు. అంబరీషుని దగ్గరే ఉన్న సుదర్శన చక్రం కృత్యకు అడ్డుపడింది. మంటలను సృష్టించింది. ఆ మంటలలో దుర్వాసుడు సృష్టించిన కృత్య కాలిపోయింది.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

సుదర్శన చక్రం కృత్యను చంపడంతో ఆగలేదు. దుర్వాసుని వెంటపడింది. దుర్వాసుడు భయపడి పారిపోయాడు. చక్రం అతనిని విడిచిపెట్టలేదు. అతడు ఏ లోకాలకు వెళితే ఆ లోకాలకు వెళ్ళింది. ఎవ్వరూ తనను రక్షించలేరని గ్రహించిన దుర్వాసుడు వైకుంఠం వెళ్ళాడు.

విష్ణుమూర్తిని శరణు వేడాడు. తాను చక్రాన్ని అంబరీషునికి ఇచ్చానని, అతనినే శరణు వేడుమని విష్ణువు చెప్పడంతో దుర్వాసుడు గత్యంతరం లేక భూలోకానికి వచ్చి అంబరీషుని ఆశ్రయించాడు. అంబరీషుడు దయతలచాడు. భక్తితో సుదర్శనాన్ని ప్రార్థించాడు. సుదర్శనం శాంతించి దుర్వాసుని విడిచిపెట్టింది. అప్పటి నుండి దుర్వాసుడు విష్ణుభక్తుల జోలికి వెళ్ళడం మానివేశాడు.

మహావిష్ణువు తన భక్తులకు ఆపద వస్తే ఏ విధంగా కాపాడతాడో అంబరీషుని వృత్తాంతం తెలియజేస్తుంది.

# కార్తవీర్యార్జునుడు-పరశురాముడు

హైహయదేశానికి రాజధాని మహిష్మతి. దానికి రాజు కార్తవీర్యార్జునుడు. అతడు మహాబల శాలి. అతనికి వేయి చేతులు. అంతేకాదు దేవతలను పూజించి వరాలు కూడా పొందాడు.

మహిష్మతీ నగర సమీపంలో ఒక నది ప్రవహిస్తూ ఉంది. ఒకరోజు కార్తవీర్యార్జునుడు తన భార్యలతో నదిలో స్నానానికి దిగాడు. జలక్రీడలతో హుషారుగా వేయి చేతులు అడ్డుపెట్టి నదీ ప్రవాహాన్ని నిలిపివేశాడు. దీని వలన నీరు దిగువకు వెళ్ళడం ఆగిపోయింది. ఎగువ ప్రాంతానికి ముంపు వచ్చింది. అదే నదీ తీరంలో ఇసుకతో సైకత లింగాన్ని చేసి రావణుడు శివపూజలో ఉన్నాడు. ముంపు రావడంతో సైకత లింగం నీటిలో కొట్టుకుపోయింది. దానితో కోపించిన రావణుడు ముంపుకు కారణమేమిటో తెలుసుకోమన్నాడు. కార్తవీర్యార్జునుని కారణంగా ముంపు ఏర్పడిందని గ్రహించాడు. అతని మీదికి రావణుడు దండెత్తి వచ్చాడు.

“నీవలన నా శివపూజకు భంగం కలిగింది. నిన్ను హతమారుస్తాను” అన్నాడు రావణుడు. “నన్ను శిక్షిస్తావా ? నన్ను జయించగలవాడు ఇంకా భూమి మీద పుట్టలేదు” అన్నాడు కార్తవీర్యార్జునుడు. ఇద్దరూ తలపడ్డారు. వేయి చేతులు కలిగిన కార్తవీర్యార్జునుడు గొప్ప బలవంతుడు కదా ! అతని ముందు రావణుడు నిలువలేకపోయాడు. ఓడి, బందీ అయ్యాడు. చివరకు ఎలాగో తప్పించుకొని లంకా నగరానికి పారిపోయాడు.

కార్తవీర్యార్జునుడు ఒకరోజు వేటకు వెళ్ళాడు. చాలాసేపు జంతువులను వేటాడి, అలసి పోయాడు. విశ్రాంతి కోసం సమీపంలో ఉన్న ఒక ముని ఆశ్రమానికి వెళ్ళాడు.

కార్తవీర్యార్జునుడు ప్రవేశించింది జమదగ్ని ఆశ్రమం. జమదగ్ని మహర్షి కార్తవీర్యార్జునునకు అతిథి సత్కారాలు చేసి గౌరవించాడు. అంతేకాదు అతనితో పాటు వచ్చిన సైనికులందరికీ విందు ఏర్పాటుచేశాడు. కార్తవీర్యార్జునుడు సంతోషించాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

"మహర్షీ ! మీ ఆతిథ్యం మాకు పరమానందం కలిగించింది. అనతి కాలంలో మీరు మాకు విందు ఎలా ఇవ్వగలిగారు ?" అని ప్రశ్నించాడు.

"మహారాజా ! నా దగ్గర కామధేనువు ఉంది. అది కోరిన కోర్కెలను మరుక్షణమే తీరుస్తుంది గదా ! దాని సహాయంతో మీకు వెంటనే విందు ఇవ్వగలిగాను" అని జమదగ్ని సమాధాన మిచ్చాడు.

"మహర్షీ ! అటువంటి కామధేనువు మా దగ్గర ఉంటే ప్రజలకు ఇతోధికంగా సహాయం చేయగలను. దానిని నాతో పంపండి" అన్నాడు రాజు. కాని జమదగ్ని నిరాకరించాడు. మునీశ్వరుని మాటలను లెక్కచేయకుండా కార్తవీర్యార్జునుడు కామధేనువును బలవంతంగా తీసుకొని వెళ్ళిపోయాడు.

జమదగ్ని కుమారుడు పరశురాముడు. అతడు విష్ణుమూర్తి అంశతో జన్మించినవాడే. రాజు కామధేనువును తీసుకొని వెళ్ళే సమయంలో పరశురాముడు ఆశ్రమంలో లేడు. ఆశ్రమానికి వచ్చిన తరువాత విషయం తెలుసుకొని మహిష్మతి రాజ్యానికి వెళ్ళాడు. తన ఆయుధమైన గండ్ర గొడ్డలితో కార్తవీర్యార్జునుని వేయి చేతులను ఖండించాడు. అతనిని హతమార్చాడు. కామధేనువును తీసుకొని వచ్చాడు.

రాజకుమారులు తమ తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నారు. పరశు రాముడు లేని సమయంలో ఆశ్రమం మీద దాడి చేశారు. తపస్సు చేసుకొంటున్న జమదగ్నిని చంపివేశారు. పరశురాముడు ఆశ్రమానికి తిరిగివచ్చాడు. మరణించిన తండ్రిని చూశాడు. రాకుమారులు చంపారని తెలుసుకొని మహిష్మతి నగరంపై రెండవసారి దాడిచేసి కార్తవీర్యార్జునుని కుమారులందరిని హతమార్చాడు.

పరశురాముని కోపం రాకుమారులను చంపడంతో తీరిపోలేదు. అసలు భూమిపై రాజులనే లేకుండా చేస్తే, అరాచకాలు ఉండవని భావించాడు. ఇరవై ఒక్కసార్లు భూమి మొత్తం తిరిగి రాజవంశాలన్నింటిని నాశనం చేశాడు. రాజుల రక్తంతో తడిసిన తన గండ్ర గొడ్డలిని తొమ్మిది మడుగులలో కడిగాడు.

పరశురాముడు దైవాంశ సంభూతుడు గదా ! అందువలన చనిపోయిన తన తండ్రిని తిరిగి బ్రతికించాడు. మనశ్శాంతి కోసం తపస్సు చేశాడు. అతని వద్ద వైష్ణవ చాపం ఉండేది. శ్రీరామచంద్రుడు శివధనుస్సు విరిచి, సీతను పెండ్లాడిన తరువాత తన వద్ద ఉన్న వైష్ణవచాపాన్ని ఎక్కుపెట్టుమని పరశురాముడు రాముడిని అడిగాడు. రాముడు ఎక్కుపెట్టాడు. విష్ణువే రామునిగా అవతరించాడని గ్రహించి పరశురాముడు తన అవతారం చాలించాడు.

VGS PUBLISHERS


VCS PUBLISHERS

# అజామిళుని కథ

పూర్వం కన్యాకుబ్జం అనే నగరంలో అజామిళుడు అనే బ్రాహ్మణ కుమారుడు ఉండేవాడు. అతడు ఒక గురుకులంలో చేరి చతుర్వేదాలు కూలంకషంగా చదువుకున్నాడు. అతనికి యౌవనం వచ్చింది. యౌవన సహజమైన కామవికారం అతనిలో ప్రారంభమయింది. అజామిళుని గురువుగారు ఒకరోజు దర్భలు, పువ్వులు, పండ్లు తీసుకొనిరమ్మని సమీపంలో ఉన్న అడవికి పంపించాడు.

అడవికి వెళ్ళిన అజామిళుడు దర్భలు, పండ్లు కోసుకున్నాడు. పూల కోసం ఒక పొద దగ్గరకు వెళ్ళాడు. పూలు కోస్తూ ఉన్న అజామిళునికి ఆ పొదలో శృంగారంలో ఉన్న ఒక యువతీ యువకుల జంట కనిపించింది. అప్పటికే కామంపై కోరికతో ఉన్న అజామిళుని మనస్సు చలించింది. చదువుకున్న విద్య, నేర్చుకున్న జ్ఞానం, పుట్టుక ద్వారా వచ్చిన బ్రాహ్మణత్వం కుటుంబం ద్వారా అలవడ్డ మంచి, మర్యాద – అన్నీ మంట గలిశాయి. అతడు ఆమెతో సంబంధాన్ని ఏర్పరచుకున్నాడు. బ్రాహ్మణత్వాన్ని విడిచిపెట్టాడు. వర్ణసంకరానికి ఒడిగట్టాడు. ఆమెతో కామసుఖాలు అనుభవిస్తూ, నేర్చుకున్న విద్యను, పొందిన జ్ఞానాన్ని మరచిపోయి అన్ని విధాలా పతనమయ్యాడు. క్రమంగా ఆమె వల్ల అతనికి సంతానం కలిగింది. కుటుంబాన్ని పోషించుకోవడానికి నీచమైన పనులెన్నింటినో చేశాడు. ఎంతో పాపాన్ని మూటగట్టుకున్నాడు.

కాలక్రమంలో అజామిళుడు ముసలివాడయ్యాడు. అతనికి చివరి ఘడియలు సమీపించాయి. కళ్ళ ముందు యమభటులు కనిపించారు. తనకు మృత్యువు దగ్గర పడిందని అతనికి అర్థమయింది. అతనికి తన చిన్న కొడుకు నారాయణ అంటే అమితమైన వాత్సల్యం. అతనిని "నారాయణా ! నారాయణా" అని పిలిచాడు. మరుక్షణం అతడు మరణించాడు. యమభటులు తమ పాశంతో అతని ఆత్మను పట్టుకొని యమలోకానికి బయలుదేరారు.

నరకానికి వెళ్ళే దారిలో యమభటులను విష్ణుదూతలు అడ్డగించారు. అజామిళుని ఆత్మను వైకుంఠం తీసుకొని వెళతామన్నారు. యమభటులు ఆశ్చర్యపోతూ "వీడు అనేక పాపాలు చేసిన పాపాత్ముడు. ఇటువంటి పాపులు నరకానికే గదా రావల్సింది !" అన్నారు. అప్పుడు విష్ణుదూతలు "మీరు చెప్పింది నిజమే. అతడు పాపాత్ముడే ! కాని మరణించే ముందు నారాయణుడిని స్మరించాడు. అందుకే అతని పాపాలు నశించాయి" అని చెప్పారు. "అతడు విష్ణువును స్మరించలేదు. తన కొడుకు నారాయణను పిలిచాడు. అది నారాయణ స్మరణ ఎలా అవుతుంది" అని ప్రశ్నించారు యమభటులు.

"ఎవరిని పిలిచినా, ఎందుకు పిలిచినా, ఎలా పిలిచినా, నారాయణ నామాన్ని స్మరిస్తే చాలు, అతడు చేసిన పాపాలన్నీ హరిస్తాయి. అంతేకాదు చివరి ఘడియల్లో నారాయణ శబ్దాన్ని విన్నా నరకబాధలు తప్పిపోతాయి. అందుకే ఇతనిని వైకుంఠానికి తీసుకొని వెళ్ళాలి" అని చెప్పారు విష్ణుదూతలు. అజామిళుని ఆత్మను యమదూతలు విష్ణుదూతలకు అప్పగించారు.

విష్ణుదూతలు అజామిళుని ఆత్మను దివ్య విమానంలో తీసుకొని వైకుంఠానికి తీసుకొని వెళ్ళారు.

కాబట్టి జీవితంలో ఎప్పుడయినా 'నారాయణ' అనే పేరును స్మరించినా, ఆలకించినా వారికి మోక్షం కలుగుతుంది. పాపాలన్నీ తొలగిపోతాయి.

VGS PUBLISHERS



VGS PUBLISHERS

# వృత్రాసుర వృత్తాంతం

ఒకప్పుడు త్వష్ట అనే ప్రజాపతి ఉండేవాడు. ఆయన తన దివ్య మహిమతో ఒక కుమారుని సృష్టించుకొన్నాడు. అతని పేరు విశ్వరూపుడు. అతనికి మూడు తలలు ఉండేవి. విశ్వరూపుడు తన మూడు తలలతో ఒకేసారి మూడు పనులు చేసేవాడు. ఎలాగంటే అతడు ఒక తలతో లోకాన్ని పరికిస్తూ, రెండవ తలతో వేదాలను చదువుతూ, మూడవ తలతో సురాపానం చేసేవాడు. ఒకానొకసారి దేవేంద్రునికి ఒక అవసరం వస్తే విశ్వరూపుడు అతనికి సాయం చేశాడు. అందుకు కృతజ్ఞతగా ఇంద్రుడు విశ్వరూపుని యాజ్ఞికునిగా నియమించుకున్నాడు.

విశ్వరూపుని ఒక శిరస్సు ఎప్పుడూ సురాపానం చేస్తూ ఉంటుంది కదా ! దాని వలన కలిగిన మత్తుతో ఏమి చేస్తున్నాడో తెలియక ఒకసారి రాక్షసులు నిర్వహించే ఒక యజ్ఞానికి విశ్వరూపుడు యాజ్ఞికునిగా వ్యవహరించాడు. ఆ విషయం ఇంద్రునికి తెలిసింది. ఇంద్రునికి ఆగ్రహం కలిగింది. ఆ కోపంతో ఇంద్రుడు విశ్వరూపుని మూడు తలలు నరికివేశాడు.

తన కుమారుని శిరస్సులు ఇంద్రుడు ఖండించాడని తెలిసి త్వష్ట దుఃఖించాడు. ఇంద్రుని మీద కోపంతో ఒక యజ్ఞం నిర్వహించాడు. ఆ యజ్ఞగుండం నుండి ఒక భయంకరమైన రాక్షసుడిని సృష్టించాడు. ఆ విధంగా త్వష్ట యజ్ఞగుండం నుండి జన్మించినవాడే వృత్రాసురుడు. బ్రహ్మను గురించి తపస్సు చేయుమని వృత్రాసురుని పంపాడు త్వష్ట. వృత్రాసురుని తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోవలసిందని చెప్పాడు.

“బ్రహ్మదేవా ! శిలానిర్మితమైన ఆయుధాల చేతగాని, చెక్కతో చేసిన ఆయుధాలతో గాని, అవి తడిసినవైనా, ఎండినవైనా – వాని వలన మరణం లేకుండా వరాన్ని ప్రసాదించండి” అని అడిగాడు వృత్రాసురుడు. బ్రహ్మ వరాన్ని అనుగ్రహించాడు. ఆ వరంతో వృత్రాసురుడు గర్వాన్ని పొందాడు. దేవతల మీద దాడి చేసి స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. నిరాశ్రయులైన దేవతలంతా శ్రీమహావిష్ణువును దర్శించి, వృత్రాసురుని వలన కలిగిన ఆపదను తెలిపి, తమను కాపాడుమని వేడుకున్నారు.

మహావిష్ణువు దేవతల మొర ఆలకించి “దధీచి అనే మునీశ్వరుడు ఉన్నాడు. అతని శరీరం తేజోవంతంగా ఉండేటట్లు నేనే వరం ఇచ్చాను. అశ్వనీదేవతలు దధీచికి అశ్వశిరోనామం అనే విద్యను ఉపదేశించారు. మీరు అతనిని ఆశ్రయించి, అతని శరీరాన్ని తీసుకోండి. అతడు దానశీలి. మీరు అడిగితే తప్పకుండా మీ కోరిక తీరుస్తాడు. శరీరాన్ని మీకు దానం చేస్తాడు. అతని శరీరంలోని ఎముకలను, వెన్నుపూసను విశ్వకర్మకు ఇవ్వండి. అతడు వాటితో ఒక ఖడ్గాన్ని తయారుచేస్తాడు. దానిలో వైష్ణవ తేజస్సును నిక్షిప్తం చేస్తాను. ఆ ఖడ్గమే వజ్రాయుధమని పిలువబడుతుంది. దానితో వృత్రాసురుని సంహరించండి. వృత్రాసురుని మరణంతో మీ తేజస్సు, మీ రాజ్యం, మీ సంపదలు మీకు తిరిగి సమకూరుతాయి. నన్ను ఆశ్రయించిన వారికి అపజయం కలుగదు. మీకు శుభం కలుగుతుంది” అని ఆశీర్వదించి పంపాడు.

దేవేంద్రుడు దిక్పాలకులతోను, అశ్వనీ దేవతలతోను వెళ్ళి దధీచిని దర్శించి వెన్నుపూస

VGS PUBLISHERS



ఇమ్మని కోరారు. దధీచి అందుకు సమ్మతించి, యోగనిష్ఠ ద్వారా ప్రాణాలు విడిచాడు. ఇంద్రుడు వెన్నుపూసను, ఎముకలను తీసుకొని విశ్వకర్మకు ఇవ్వగా అతడు ఖడ్గాన్ని తయారుచేశాడు. విష్ణువు ఆ ఖడ్గంలో వైష్ణవ తేజస్సును నింపి వజ్రాయుధంగా మార్చాడు. ఇంద్రుడు విష్ణువు అనుజ్ఞతో వృత్రాసురుని యుద్ధంలో సంహరించి తిరిగి స్వర్గం మీద ఆధిపత్యాన్ని, సకల సంపదలను పొందాడు.

శ్రీమహావిష్ణువు ఆశీర్వచన ప్రభావం వల్ల ఆ దేవదేవుని సహాయంతో ఇంద్రుడు వృత్రాసురుని జయించి తిరిగి స్వర్గాధిపతి అయ్యాడు.

# జయ విజయులు

శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో నివాసం ఉండేది వైకుంఠం. లక్ష్మీ నారాయణుల నివాసానికి ద్వారం దగ్గర ఇద్దరు ద్వారపాలకులు ఉండేవారు. వారే జయ విజయులు. ఇద్దరూ విష్ణుమూర్తికి మహాభక్తులు. విష్ణుమూర్తి అనుమతి లేనిదే లోపలికి ఎవ్వరినీ అనుమతించేవారు కాదు.

ఒకరోజు సనకుడు, సనందుడు, సనత్కుమారుడు మొదలైన మునులు విష్ణువును దర్శించ డానికి వైకుంఠం వచ్చారు. లోపలికి వెళ్ళడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో విష్ణువు లక్ష్మీదేవి కేళీ మందిరంలో ఏకాంతంలో ఉన్నారు. అప్పుడు ఎవరినీ లోనికి అనుమతించకూడదు. అందుచేత జయ విజయులు సనకాదులను లోనికి పంపలేదు. వారు అందుకు కోపించి "మా వంటి మహర్షులను వైకుంఠంలో ప్రవేశించకుండా అడ్డగించారు కనుక మీరు ఈ వైకుంఠానికి, ఈ లక్ష్మీనారాయణులకు దూరమై పోవుదురు గాక" అని శపించారు.

జయ విజయులు మహావిష్ణువును దర్శించి శాపవృత్తాంతం చెప్పి తమకు శాపవిముక్తి కలిగించవలసిందిగా ప్రార్థించారు. విష్ణువు వారితో "జయవిజయులారా ! మహర్షులు శాపానుగ్రహ సమర్థులు. వారి శాపాలు అనుభవించవలసిందే. మీ ఇద్దరిని ఒక ప్రశ్న అడుగుతాను. ఆరు జన్మలు నాకు భక్తులుగా జీవించి తిరిగి వైకుంఠం చేరడం ఒక పద్ధతి. మూడు జన్మలలో నాకు శత్రువులుగా ఉండి, నాతో యుద్ధం చేసి మరణించి వైకుంఠం చేరడం రెండో పద్ధతి. భక్తులుగా ఉంటారో, శత్రువులుగా ఉంటారో నిర్ణయించుకొని చెప్పండి" అని అన్నాడు.

జయవిజయులు "దేవదేవా ! ఆరు జన్మలపాటు వైకుంఠానికి దూరంగా ఉండడాన్ని మేము భరించలేము. మూడు జన్మలలో శత్రువులుగా ఉండి త్వరగా మిమ్ము చేరుకునే వరాన్ని ప్రసాదించండి" అని ప్రార్థించారు. అప్పుడు విష్ణువు "మీ కోరిక ప్రకారమే మీరు రాక్షసులుగా జన్మించి నాకు శత్రువులవుతారు. మీ జన్మలు లోకకల్యాణ కారకాలు అవుతాయి. నా చేతిలో మరణించి మూడు జన్మల అనంతరం వైకుంఠాన్ని చేరుకుంటారు" అని చెప్పాడు.

ఆ జయ విజయులు విష్ణుమూర్తికి శత్రువులుగా మొదటి జన్మలో హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగాను, రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగాను, మూడవ జన్మలో శిశుపాల దంతవక్త్రులుగాను జన్మించి, విష్ణువును ఎదిరించి, ఆయన చేతిలో మరణించి వైకుంఠం చేరుకున్నారు. ముందుగా హిరణ్యాక్ష హిరణ్యకశిపుల గురించి తెలుసుకుందాం.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల జననం

కశ్యపుడనే మహర్షి ఉండేవాడు. ఆయన భార్య దితి. ఆమె సంతానాన్ని అర్థించి అసుర సంధ్యవేళ భర్త వద్దంటున్నా కాదని భర్తతో కలిసింది. దాని ఫలితంగా ఆమె గర్భవతియై ఇద్దరు మగపిల్లలను ప్రసవించింది. వారే హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా జన్మించిన జయవిజయులు. వారు పుట్టిన వేళ ఎన్నో అపశకునాలు గోచరించాయి. ఆకాశం నుండి చుక్కలు రాలిపడ్డాయి. సముద్రాలు ఘోషించాయి. గాడిదలు ఓండ్ర పెట్టాయి. నక్కలు అరిచాయి. దితికి జన్మించారు కనుక వారిని దైత్యులు (రాక్షసులు) అంటారు.

# వరాహావతారం-హిరణ్యాక్షుని వధ

హిరణ్యాక్ష హిరణ్యకశిపుల్లో పెద్దవాడయిన హిరణ్యాక్షుడు రాక్షస సమూహానికి రాజయ్యాడు. బ్రహ్మను గురించి తపస్సు చేసి గొప్ప వరాలను పొందాడు. ఆ వరాల ప్రభావంతో మునులను వేధించాడు. దేవతలను బాధించాడు. భూమి మీద జరిగే యజ్ఞయాగాదుల వలన దేవతలకు శక్తి కలుగుతుంది కాబట్టి దేవతలను బలహీనులుగా చేయాలంటే భూమిని లేకుండా చేయడం మంచిమార్గమని తలపోశాడు. వెంటనే భూమిని పైకెత్తి మహాసముద్రంలోకి విసిరివేశాడు. భూమి సముద్ర గర్భంలోకి చేరింది. భూమి మీద నివసించే జీవరాశి తల్లడిల్లింది. దేవతలు ఈ అపాయాన్నుంచి గట్టెక్కించుమని విష్ణువును వేడుకున్నారు. మహావిష్ణువు వరాహావతారాన్ని ధరించాడు. బలమైన కోరలతో, పొడవైన మూతితో జనించిన వరాహరూపం తన రూపాన్ని పెంచుకున్నది. సముద్రంలో ప్రవేశించి భూమిని తన కోరలతో పైకెత్తింది. ఆ సమయానికి హిరణ్యాక్షుడు అక్కడికి వచ్చి వరాహాన్ని అడ్డుకున్నాడు. వరాహరూపంలో ఉన్న నారాయణునికి హిరణ్యాక్షునికి భీకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో వరాహస్వామి తన కోరలతో హిరణ్యాక్షుని చీల్చివేశాడు. అతనిని సంహరించి భూమిని తన కోరలతో పైకి లేపి, తెచ్చి, యథాస్థానంలో నిలబెట్టాడు. హిరణ్యాక్షుని చంపి, భూమిని కాపాడినందుకు దేవతా సమూహం సంతసించింది. సమస్త జీవరాశులు ఆనందించాయి.

# హిరణ్యకశిపుని కథ-ప్రహ్లాద చరిత్ర

శ్రీహరి వరాహరూపం ధరించి తన అన్న హిరణ్యాక్షుని సంహరించాడని తెలుసుకున్న హిరణ్యకశిపుడు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. మహావిష్ణువును వధించి తన అన్న మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతో బ్రహ్మను గూర్చి కఠోరమైన తపస్సు చేశాడు. హిరణ్య కశిపుని తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరం అడగవలసిందన్నాడు. హిరణ్యకశిపుడు "బ్రహ్మదేవా! అస్త్రం వల్లగాని, శస్త్రం వల్లగాని, దేవతల వల్ల గాని, మానవుల వల్లగాని, జంతువుల వల్లగాని, పగలుగాని, రాత్రిగాని, ఇంట్లోగాని, బయటగాని, భూమిమీదగాని, ఆకాశంలోగాని నాకు మరణం లేకుండా వరాన్ని ఇవ్వండి" అని అడిగాడు. బ్రహ్మ అతనికి వరాన్ని అనుగ్రహించాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# ప్రహ్లాదుని జననం

హిరణ్యకశిపుడు బ్రహ్మను గురించి తపస్సు చేసే నాటికి అతని భార్య లీలావతి గర్భవతి. హిరణ్యకశిపుడు తపస్సు చేస్తున్నాడని తెలిసి ఇంద్రుడు భయపడ్డాడు. అతనికి తపోభంగం చేయాలనే ఆలోచనతో లీలావతిని చెరబట్టి తీసుకొని వెళ్ళసాగాడు. ఆ సమయంలో అతనికి ఎదురుపడ్డ నారదుడు నిండు చూలాలు అయిన లీలావతిని హింసించడం పాపకారణమని హితబోధ చేసి, లీలావతి గర్భంలో పెరిగే బాలుని వలననే హిరణ్యకశిపుడు మరణిస్తాడని చెప్పి ఆమెను విడిపించాడు. నారదుడు లీలావతిని తీసుకొనివెళ్ళి తన ఆశ్రమంలో ఉంచుకున్నాడు. ఆమె గర్భంలో పెరుగుతున్న బాలునకు నారాయణ మంత్రాన్ని ఉపదేశించాడు. విష్ణుమూర్తి కథలను వినిపించాడు. నారదుని బోధనలతో గర్భంలో ఉండగానే శిశువు విష్ణుభక్తిని అలవరచుకున్నాడు. నెలలు నిండిన తరువాత లీలావతి ప్రసవించింది. ఒక బాలుని కన్నది. అతడే ప్రహ్లాదుడు.

# హిరణ్యకశిపుడు దేవతలను జయించుట

బ్రహ్మ నుండి వరాన్ని పొంది వచ్చిన హిరణ్యకశిపునికి అంతఃపురంలో లీలావతి కనిపించలేదు. ఆ సమయానికే నారదుడు లీలావతిని తీసుకొనివచ్చి బిడ్డతో సహా హిరణ్యకశిపునికి అప్పగించాడు. ఇంద్రుడు తనను చెరపట్టిన విషయాన్ని, నారదుడు తనను రక్షించిన విషయాన్ని లీలావతి భర్తతో చెప్పింది. తన భార్యా బిడ్డలను కాపాడి క్షేమంగా అప్పగించినందుకు హిరణ్యకశిపుడు నారదునికి కృతజ్ఞతలు తెలియజేశాడు. తన భార్యను అపహరించినందుకు ఇంద్రునిపై ఆగ్రహించిన హిరణ్యకశిపుడు స్వర్గం మీదకు దండెత్తాడు. బ్రహ్మ ప్రసాదించిన వరప్రభావం చేత దేవతలు హిరణ్యకశిపుని ఎదిరించలేకపోయారు. అతని చేతిలో పరాజితులై స్వర్గాన్ని విడిచి పారిపోయారు. ఇంద్రుని కోసం హిరణ్యకశిపుడు లోకాలన్నీ గాలించాడు. ఎక్కడా కనిపించలేదు.

ఇంద్రుడు అక్కడక్కడా తిరిగి తనను రక్షించేవారు కనిపించక వైకుంఠం చేరుకున్నాడు. మహావిష్ణువును దర్శించి హిరణ్యకశిపుని బారి నుండి రక్షించుమని వేడుకున్నాడు. "అతనికి బ్రహ్మవరం ఉంది. ఆ వర ప్రభావంతో విర్రవీగుతున్నాడు. సమయం కోసం ఎదురు చూడడం తప్ప ప్రస్తుతానికి ఏమీ చేయలేము" అని విష్ణువు ఇంద్రునితో అన్నాడు. కాసేపటికే ఇంద్రుని వెదుక్కుంటూ హిరణ్యకశిపుడు వైకుంఠానికి వచ్చాడు. విష్ణుమాయచే ఇంద్రుడుగాని, విష్ణువుగాని హిరణ్యకశిపునికి కనిపించలేదు. విష్ణువు కూడా తనకు భయపడి పారిపోయాడని హిరణ్యకశిపుడు భావించాడు. విజయగర్వంతో తన నగరానికి చేరుకున్నాడు. అప్పటి నుండి అహంకారంతో హిరణ్యకశిపుడు మునులను బాధించాడు. విష్ణుభక్తులను చిత్రహింసలు పెట్టాడు. తానే దేవుడనని, తననే పూజించాలని ఆజ్ఞాపించాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

ప్రహ్లాదునికి విద్యాభ్యాసం చేయవలసిన వయస్సు వచ్చింది. హిరణ్యకశిపుడు రాక్షస గురువు లైన చండామార్కులను పిలిపించి, విద్యలన్నింటిని నేర్పుమని ప్రహ్లాదుని వారికి అప్పగించాడు. చండామార్కులు ప్రహ్లాదుని తమ గురుకులానికి తీసుకొనివెళ్ళి, తక్కిన రాక్షస కుమారులతో పాటు విద్యను బోధించసాగారు. కాని ప్రహ్లాదుడు విష్ణునామాన్ని జపించేవాడు. తోటి విద్యార్థులకు విష్ణువును గురించి చెప్పేవాడు. రాక్షసులకు శత్రువైన విష్ణువును జపించకూడదని గురువులు ప్రహ్లాదునికి చెప్పారు. ప్రహ్లాదుడు మాటాడలేదు. మానలేదు.

కుమారుని విద్యాభ్యాసం ఎలా జరుగుతుందో తెలుసుకుందామని హిరణ్యకశిపుడు అనుకున్నాడు. ప్రహ్లాదుని తీసుకొని రమ్మని గురువులకు కబురుచేశాడు. తన వద్దకు వచ్చిన ప్రహ్లాదుడు విష్ణుభక్తితో ఉన్నాడని గ్రహించాడు. గురువులను ప్రశ్నించాడు. అతనికి బుద్ధి చెప్పి తీసుకువస్తామని చండామార్కులు ప్రహ్లాదుని తీసుకొనివెళ్ళారు. ఈసారి కూడా అతనిలో మార్పు తీసుకొని రాలేక రాజును దర్శించి తమ అసహాయతను తెలియజేశారు.

ప్రేమతో కాక భయపెట్టి ప్రహ్లాదుని తన దారికి తెచ్చుకోవాలని హిరణ్యకశిపుడు భావించాడు. అతనిని శిక్షించుమని భటులకు ఆజ్ఞాపించాడు. వారతనిని పాముల చేత కరిపించారు. కొండ మీది నుండి త్రోసివేశారు. ఏనుగుల చేత త్రొక్కించారు. ఎన్నిరకాలుగా ప్రయత్నించినా భటులు ప్రహ్లాదునికి ఎలాంటి అపాయం కలిగించలేకపోయారు. విష్ణుమూర్తి ప్రహ్లాదునికి అండగా నిలబడ్డాడు కాబట్టే అతనికి ప్రమాదం జరుగలేదు.

అన్ని విషయాలు భటులు రాజునకు తెలియజేశారు. తనే స్వయంగా ప్రహ్లాదునికి బుద్ధి చెప్పాలనుకున్నాడు హిరణ్యకశిపుడు. ప్రహ్లాదుని తన వద్దకు పిలిపించాడు. విష్ణువు తమకు శత్రువని, అతనిని పూజించడం మానుమని చెప్పాడు. ప్రహ్లాదుడు విష్ణువు దేవుడని బదులు చెప్పాడు.

"విష్ణువు ఎక్కడున్నాడు ?" ప్రశ్నించాడు హిరణ్యకశిపుడు.

"విష్ణువు సర్వాంతర్యామి. అన్నిచోట్ల ఉంటాడు" బదులిచ్చాడు ప్రహ్లాదుడు.

"ఇక్కడ ఉన్నాడా ?"

"ఎక్కడ వెదికినా కనిపిస్తాడు. నీలో, నాలో, ప్రతి అణువులో విష్ణుమూర్తి ఉన్నాడు. దేవుడు లేని చోటే లేదు."

"ప్రతి అణువులో ఉన్నాడంటున్నావు కదా ! అయితే ఈ స్తంభంలో ఉన్నాడా ?" వికటాట్టహాసం చేస్తూ ప్రశ్నించాడు హిరణ్యకశిపుడు.

"ఉన్నాడు"

"అయితే చూపించు !" అంటూ హిరణ్యకశిపుడు తన గదతో ఆ స్తంభాన్ని బ్రద్దలు కొట్టాడు. ఆ సమయంలో ప్రహ్లాదుడు "దేవదేవా ! నా తండ్రికి కనిపించి, ఆయన అజ్ఞానాన్ని తొలగించు" అంటూ విష్ణువును ప్రార్థించాడు.

VGS PUBLISHERS



# నరసింహావతారం

హిరణ్యకశిపుని గదా ఘాతానికి స్తంభం ముక్కలయింది. అందులోంచి సింహనాదం వెలువడింది.

అప్పుడే సూర్యుడు అస్తమించాడు. ఇంకా చీకట్లు అలముకోలేదు. అది సంధ్యా సమయం.

స్తంభం నుంచి ఒక ఆకారం బయటకు వచ్చింది. దాని శరీరం మానవ శరీరం. తల సింహం తల – మొత్తం మీద నరసింహ రూపం.

ఆ నరసింహం కళ్ళ నుంచి నిప్పులు రాలుతున్నాయి. వాడిగా ఉన్న కోరలు, చాకుల వంటి గోళ్ళు, బలమైన బాహువులు, భయంకరమైన జూలు – చూడడానికే ఆ ఆకారం భయం గొలిపేలా ఉంది. ప్రహ్లాదుడు నరసింహుడిని చూస్తూ "నారాయణా ! నారాయణా !" అంటూ స్మరించసాగాడు.

నరసింహునిగా స్తంభం నుంచి బయటకు వచ్చిన ఆ భయంకరాకారాన్ని చూచి మహావీరుడైన హిరణ్యకశిపుడు కూడా నిశ్చేష్టుడయ్యాడు.

నరసింహమూర్తి కోపంతో హిరణ్యకశిపుని ఒడిసి పట్టుకున్నాడు. ద్వారం దగ్గరకు తీసుకొని వెళ్ళి గడపపై కూర్చున్నాడు. హిరణ్యకశిపుని తన తొడలపై ఉంచుకొని, గిలగిలా కొట్టుకొంటున్న అతని పొట్టను గోళ్ళతో గ్రుచ్చి, కడుపు చీల్చి ప్రేగులను బయటకు లాగాడు. ప్రేగులను తన మెడలో దండలుగా అలంకరించుకున్నాడు. అంతటితో హిరణ్యకశిపుడు మరణించాడు.

అది సంధ్యా సమయం. రాత్రి కాదు, పగలు కాదు. చంపింది నరసింహుడు. మనిషి కాదు, జంతువు కాదు, దేవత కాదు. మూడింటి సమాహార రూపం. చంపింది గడపమీద. అది ఇల్లు కాదు, ఆరుబయట కాదు. చంపింది నరసింహమూర్తి తన తొడలపై ఉంచుకొని, అది భూమి కాదు, ఆకాశం కాదు. చంపింది అస్త్రంతో కాదు, శస్త్రంతో కాదు గోళ్ళతో. ఈ విధంగా బ్రహ్మ హిరణ్యకశిపునికి ఇచ్చిన వరానికి భంగం కలుగకుండా విష్ణువు నరసింహావతారాన్ని ధరించి, హిరణ్యకశిపుని సంహరించాడు.

దేవతలు ఆకాశం నుంచి నరసింహమూర్తిపై పూల వాన కురిపిస్తూ, స్తోత్రం చేశారు.

తండ్రి తరువాత ప్రహ్లాదుడు రాజయ్యాడు. జనానురంజకంగా పరిపాలన చేశాడు.

హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించిన జయవిజయులు విష్ణువుకు విరోధులుగా చరించి, ఆ విష్ణువు చేతనే చంపబడి తమ మొదటి జన్మను పూర్తిచేసుకున్నారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# రామావతారం

## జయవిజయులు రావణ కుంభకర్ణులుగా రెండవ జన్మ పొందుట

ఇక్ష్వాకు వంశంలో పుట్టిన రాజులలో దశరథుడు ఒకడు. ఆయనకు ముగ్గురు భార్యలు. వారి పేర్లు కౌసల్య, సుమిత్ర, కైకేయి. ఆయనకు పుత్ర సంతానం లేకపోవడంతో ఆయన బాధపడుతూ ఉండేవాడు. పుత్ర సంతానం కోసం పుత్రకామేష్టి అనే యాగాన్ని ఆచరించుమని మహర్షులు కొందరు ఆయనకు సూచించారు. మహర్షుల ఆనతిని తలదాల్చి దశరథుడు నిష్ఠగా పుత్రకామేష్టి యాగాన్ని ఆచరించాడు. ఆ యజ్ఞగుండం నుండి యజ్ఞపురుషుడు ఉద్భవించాడు. ఒక పాయస పాత్రను దశరథునికి ఇచ్చి, ఆ పాయసాన్ని సేవిస్తే అతని భార్యలకు పుత్రసంతానం కలుగుతుందని చెప్పాడు. దశరథుడు భార్యల చేత పాయసం త్రాగించాడు. తత్ఫలితంగా ముగ్వురు రాణులు గర్భవతులయ్యారు. కౌసల్యకు రాముడు, సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు, కైకకు భరతుడు జన్మించారు. వారు నల్వురు దినదిన ప్రవర్ధమానులై పెరుగసాగారు. పుత్రులను చూచుకుంటూ దశరథుడు, అతని భార్యలు సంతోషించసాగారు. నలుగురు పిల్లలకు దశరథుడు రాజులకు ఉచితమైన విద్యలన్నింటినీ నేర్పించాడు.

ఒకనాడు దశరథుడు కొలువులో ఉన్న సమయంలో విశ్వామిత్రుడు వచ్చాడు. "దశరథా! నేను యజ్ఞం చేస్తుంటే దానికి రాక్షసులు ఆటంకం కలిగిస్తున్నారు. అందుకే నీ సాయం కోరి వచ్చాను. నీ పెద్ద కుమారుడైన రాముని నా వెంట పంపించు. అతని సాయంతో యజ్ఞ నిర్వహణ నాకు సులువవుతుంది" అన్నాడు విశ్వామిత్రుడు. రాముడు బాలుడు కనుక అతనిని రాక్షసులను వధించడానికి పంపడం శ్రేయస్కరం కాదని దశరథుడు అనుకున్నాడు. కాని వసిష్ఠుని సలహా మేరకు రాముని విశ్వామిత్రుని వెంట పంపడానికి అనుమతి ఇచ్చాడు. బయలుదేరే సమయానికి లక్ష్మణుడు కూడా బయలుదేరాడు. విశ్వామిత్రుడు తన వెంట వచ్చిన రామలక్ష్మణులకు అనేక అస్త్రాలను బోధించాడు.

రామలక్ష్మణులు అడవిలోకి విశ్వామిత్రునితో వచ్చిన వెంటనే తాటకి అనే రాక్షసి వారిని అడ్డగించింది. రాముడు తాటకిని తన బాణాలతో సంహరించాడు. ఆశ్రమం చేరుకున్న తరువాత విశ్వామిత్రుడు యజ్ఞం మొదలుపెట్టాడు. యజ్ఞాన్ని నాశనం చేయడానికి మారీచుడు, సుబాహుడు అనే రాక్షసులు భీకరమైన శబ్దాలు చేస్తూ వచ్చారు. రామలక్ష్మణులు వారిపై బాణాలు వదిలారు. ఆ బాణాల వలన సుబాహుడు చనిపోయాడు. మారీచుడు సుదూరంగా పడిపోయాడు. విశ్వామిత్రుని యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయింది. ఆయన మహదానందం చెందాడు.

విశ్వామిత్రుడు నివసించే ప్రాంతానికి దగ్గరలో మిథిలా నగరం ఉంది. దానికి రాజు జనకుడు. అతని కూతురు సీత. జనకుడు సీతకు స్వయంవరం చాటించాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను స్వయంవరానికి తీసుకొని వెళ్ళాడు. శివధనుస్సును సభలో ఉంచి, ఆ శివధనుస్సును ఎక్కుపెట్టినవానికే తన కూతురు సీతను ఇచ్చి వివాహం చేస్తానన్నాడు జనకుడు. ఆ ధనుస్సును ఎవ్వరూ ఎత్తలేకపోయారు. రాముడు దానిని సునాయాసంగా ఎత్తి, ఎక్కుపెట్టాడు. అది వెంటనే రెండు ముక్కలయింది. జనకుడు సీతను రామునికిచ్చి వివాహం చేశాడు. అదే సమయంలో

VGS PUBLISHERS



జనకుని బంధువుల కుమార్తె లైన ఊర్మిళను లక్ష్మణుడు, మాండవిని భరతుడు, శ్రుతకీర్తిని శత్రుఘ్నుడు పెండ్లాడారు. వివాహానంతరం రాముడు భార్యా సోదరులతో అయోధ్యకు తిరిగి వస్తుండగా పరశురాముడు వారిని అడ్డగించాడు. శివధనుస్సును విరవడం కాదు, తన దగ్గరున్న వైష్ణవధనుస్సును విరువుమని పరశురాముడు అనగానే రాముడు అతని నుండి ఆ విల్లును తీసుకొని అవలీలగా విరిచివేశాడు. దానితో పరశురాముని గర్వం నశించింది. తన శక్తినంతా రామునికి ధారపోసి, పరశురాముడు తన అవతారాన్ని చాలించాడు.

కొంతకాలం తరువాత దశరథుడు రామునికి పట్టాభిషేకం చేయాలని భావించాడు. ఆ విషయం తెలిసి అందరూ సంతోషించారు. కాని మంథర అనే పరిచారిక దుర్బోధల వల్ల కైక రాముని పట్టాభిషేకానికి అభ్యంతరం తెలిపింది. గతంలో ఒక యుద్ధ సందర్భంగా తనకిచ్చిన కోర్కెలను నెరవేర్చుమని దశరథుని అడిగింది. అవేమిటని ఆయన అడిగితే రాముని పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపడం, భరతునికి పట్టాభిషేకం చేయడం అని చెప్పింది. ఆ కోరికలు విని దశరథుడు మూర్ఛపోయాడు. కైక రాముని పిలిపించి తన కోరికల విషయం తెలిపి అరణ్యవాసానికి వెళ్ళుమని, అది దశరథుని ఆజ్ఞ అని తెలియజేసింది. పితృవాక్య పరిపాలకుడైన రాముడు అడవికి బయలుదేరాడు. సీత, లక్ష్మణుడు కూడా రాముని వెంట అరణ్యవాసానికి సిద్ధపడ్డారు. ముగ్గురూ నారచీరలు ధరించి బయలుదేరారు. సుమంత్రుడనే మంత్రి వారిని గంగా నదివరకు తీసుకొని వెళ్ళాడు. గుహుడు అనే రామభక్తుడు వారిని తన పడవలో గంగానదిని దాటించాడు. సీతారామలక్ష్మణులను వనవాసానికి పంపినందుకు బాధపడుతూ దశరథుడు మరణించాడు. తండ్రి మరణవార్త తెలిసి మేనమామ ఇంటనున్న భరతుడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. తన తల్లి కైకేయి కోరికలు, రాముని వనవాసం, తండ్రి మరణం గురించిన విశేషాలన్నీ తెలుసుకున్నాడు. తల్లి మందిరానికి వెళ్ళి ఆమెను నిందించాడు. తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి భరతుడు రాముని కోసం అడవికి వెళ్ళాడు. చిత్రకూటంలో ఉన్న రాముని కలసి అయోధ్యకు తిరిగిరమ్మని కోరాడు. రాముడు తండ్రి మరణ విషయం విని విచారించాడు. తండ్రి ఇచ్చిన వరానికి భంగం కలిగించనని, రాజ్యానికి తిరిగిరానని చెప్పాడు. భరతుడు రాముని పాదుకలను తీసుకొనివచ్చి, వాటిని సింహాసనంపై ఉంచి, రామునికి రాజప్రతినిధిగా రాజ్యాన్ని పాలించసాగాడు.

రాముడు దండకారణ్యానికి వెళ్ళాడు. అక్కడ మునులను దర్శించి వారి ఆశీర్వాదంతో పంచవటీ క్షేత్రంలో నివాసం ఏర్పరచుకొని జీవించసాగాడు. అడవిలో మునులను బాధించే ఎందరో రాక్షసులను రాముడు మట్టుపెట్టాడు. లంకాధిపతి రావణుని చెల్లెలు శూర్పణఖ రాముని అందానికి ముగ్ధురాలై తనను వివాహమాడుమని రాముని కోరింది. తాను ఏకపత్నీవ్రతుడనని చెప్పి, రాముడామెను నిరాకరించాడు. ఆమె లక్ష్మణుని వద్దకు వెళ్ళి తన్ను పెండ్లాడుమని బలవంతం చేసింది. లక్ష్మణుడు ఆమెను నిరాకరించాడు. ముక్కు, చెవులు కోసి పంపించాడు. ఆమెకు జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవడానికి వచ్చిన ఖరదూషణాది రాక్షసులను రామలక్ష్మణులు సంహరించారు.

శూర్పణఖ రావణుని వద్దకు వెళ్ళి తనకు జరిగిన పరాభవాన్ని, ఖరదూషణాదుల మరణాన్ని గురించి చెప్పింది. సీత అందాన్ని గురించి చెప్పి, ఆమెను తీసుకొని రమ్మని రెచ్చగొట్టింది. రావణుడు సీతాపహరణకు సిద్ధమయ్యాడు. దానికి పథకం తయారుచేసుకున్నాడు. మారీచుడు వలదని



VGS PUBLISHERS



వారించినా వినలేదు. రావణుని వ్యూహం ప్రకారం మారీచుడు బంగారు లేడిగా మారి రాముని పర్ణశాల సమీపంలో తిరుగసాగాడు. సీత బంగారు లేడిని చూచి, ముచ్చటపడి దానిని పట్టి తెమ్మని రాముని కోరింది. రాముడు లక్ష్మణుని సీతకు రక్షణగా ఉంచి, బంగారు లేడికై బయలుదేరాడు. అది రామునికి దొరక్కుండా చాలాదూరం తీసుకుపోయింది. అది రాక్షస మాయగా గుర్తించిన రాముడు దానిని బాణంతో కొట్టాడు. అది రాముని గొంతును అనుకరిస్తూ "హా లక్ష్మణా !" అని అరుస్తూ పడిపోయింది.

మారీచుడు అరచిన అరుపు సీతకు, లక్ష్మణునకు వినిపించింది. రాముడు ఆపదలో చిక్కుకున్నాడని భావించిన సీత లక్ష్మణుని వెళ్ళి రాముని రక్షించుమని చెప్పింది. వదిన మాటను కాదనలేక లక్ష్మణుడు పర్ణశాల ముందు ఒక గీతను గీసి, ఎట్టి పరిస్థితుల్లోను ఆ గీతను దాటి రావద్దని సీతను హెచ్చరించి అన్న కోసం బయలుదేరాడు. లక్ష్మణుడు అటు వెళ్ళగానే రావణుడు సన్యాసివేషంలో పర్ణశాల వద్దకు వచ్చాడు. "భవతీ భిక్షాందేహి !" అంటూ నిలబడ్డాడు. భిక్ష తీసుకొని వచ్చిన సీత లక్ష్మణరేఖను దాటకుండా రావణునే వచ్చి భిక్ష తీసుకోమని కోరింది. లక్ష్మణరేఖను తాకితే అది తనను కాల్చివేస్తుందని రావణునకు తెలుసు. అందుచేతనే అతడు రేఖను సమీపించకుండా "ముందుకు వచ్చి భిక్ష వేస్తావా ? వట్టి చేతులతో తిరిగి వెళ్ళమంటావా?" అన్నాడు. యాచకుని వట్టి చేతులతో పంపడం ధర్మం కాదని సీతాదేవి లక్ష్మణరేఖను దాటి ముందుకు వచ్చింది. వెంటనే రావణుడు సహజ రూపాన్ని పొంది, ఆమె నిలిచి ఉన్నంత మేర భూమిని పెళ్ళగించి ఆమెను తీసుకొని ఆకాశంలోకి ఎగిరాడు.

రావణుడు సీతను అపహరించుకొని పోవడాన్ని చూచి జటాయువు అనే పక్షి రావణుని అడ్డగించింది. రావణుడు దాని రెక్కలు నరికివేశాడు. సీత తన నగలన్నింటినీ తన చెరగులో మూటకట్టి క్రింద వేసింది. ఆ మూట ఋష్యమూక పర్వతం మీద పడింది. రామలక్ష్మణులు పర్ణశాలకు తిరిగివచ్చి చూస్తే సీత కనిపించలేదు. ఆమె కోసం వెతుకుతుంటే జటాయువు రావణుడు సీతను ఎత్తుకొని వెళ్ళాడని చెప్పి ప్రాణాలు విడిచింది. రామలక్ష్మణులు సీత కోసం బయలుదేరారు. కబంధుడనేవానికి శాపవిమోచనం కలిగించారు. అతని సూచనపై సుగ్రీవుని కలుసుకోడానికి వెళుతూ శబరి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

వాలి, సుగ్రీవులు అన్నదమ్ములు. రాముడు సుగ్రీవుని కలుసుకున్నాడు. అతని కోరికపై వాలిని సంహరించి, సుగ్రీవుని వానర రాజ్యానికి పట్టంకట్టాడు. సుగ్రీవుని మంత్రి హనుమంతుడు. అతడు రామునికి భక్తుడయ్యాడు. సీతను వెదకడానికి సుగ్రీవుడు వానర ముఖ్యులను అన్ని దిక్కులకు పంపించాడు. హనుమంతుడు, సుగ్రీవుడు దక్షిణ దిక్కుగా బయలుదేరుతుంటే, రాముడతనికి సీతకు ఆనవాలుగా తన ఉంగరాన్ని ఇచ్చి పంపాడు. హనుమంతుడు సముద్రాన్ని లంఘించి, లంకను చేరుకున్నాడు. అశోకవనంలో సీతాదేవిని చూశాడు. ఆమెకు రాముని గూర్చి చెప్పాడు. ఉంగరాన్ని అందించాడు. ఆమె శిరోభూషణాన్ని తీసుకున్నాడు. రావణునికి తన బలాన్ని తెలియజేయాలనుకున్నాడు. అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. అక్షయ కుమారుని చంపాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడి రావణుని కొలువుకూటానికి వెళ్ళాడు.


VGS PUBLISHERS

హనుమంతుని తోకకు రావణుడు నిప్పు అంటించగా, హనుమంతుడు ఆ నిప్పుతో లంకా పట్టణాన్ని కాల్చివేశాడు. మళ్ళీ సముద్రాన్ని దాటి రాముని చేరుకున్నాడు. సీతాదేవి వృత్తాంతాన్ని చెప్పి ఆమె ఆనవాలుగా తాను తెచ్చిన చూడామణిని అందించాడు. రాముడు హనుమంతుని కౌగిలించుకొని తన అభిమానాన్ని వెల్లడించాడు.

సుగ్రీవుడు లంకపై దండయాత్రకు యుద్ధ సన్నాహాలు పూర్తి చేశాడు. సైన్యమంతా సముద్ర తీరం చేరుకున్నది. సముద్రానికి వారధి నిర్మించారు వానరులు. రావణుడు కూడా యుద్ధ సన్నాహాలు ప్రారంభించాడు. రావణుని తమ్ముడు విభీషణుడు రావణునితో విభేదించి రాముని పంచ చేరాడు. రాముడతనికి ఆశ్రయమిచ్చాడు. యుద్ధం ప్రారంభమయింది. వానర వీరులు ఎందరో రాక్షసులను మట్టుపెట్టారు. ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రంతో లక్ష్మణుడు మూర్ఛ పోగా, హనుమంతుడు సంజీవ పర్వతాన్ని పెకళించి తెచ్చి లక్ష్మణుని బ్రతికించాడు. మరునాడు జరిగిన యుద్ధంలో లక్ష్మణుడు ఇంద్రజిత్తును సంహరించాడు. రావణుని సైన్యంలో ముఖ్యులైన ధూమ్రాక్షుడు, అకంపనుడు, ప్రహస్తుడు మొదలైన వారిని వానరులు మట్టుపెట్టారు.

రావణుని తమ్ముడు కుంభకర్ణుడు, ఆరు నెలలు నిద్రపోతూ ఉంటాడు. రావణుడు కుంభకర్ణుని నిద్ర నుండి లేపి యుద్ధరంగానికి పంపాడు. వేయి ఏనుగుల బలం కలిగిన కుంభకర్ణుని మీద రాముడు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్ర ప్రభావంతో కుంభకర్ణుడు నేలరాలాడు. ఈసారి రావణుడే స్వయంగా యుద్ధానికి వచ్చి రామునితో తలపడ్డాడు. ఇద్దరి మధ్య యుద్ధం భయంకరంగా జరిగింది. రాముడు ప్రయోగించిన బాణాలకు రావణుని తలలు తెగిపోతున్నాయి గాని అవి తిరిగి యథాస్థానాల్లోకి వస్తున్నాయి. అప్పుడు విభీషణుడు "రావణుని నాభి వద్ద అమృతకలశం ఉంది. దాన్ని ఛేదిస్తేనే అతడు మరణిస్తాడు" అని రావణవధకు మార్గం తెలిపాడు. రాముడు బ్రహ్మాస్త్రాన్ని రావణుని నాభిపై ప్రయోగించాడు. దానితో రావణుడు నేల కూలాడు.

రావణుడు చనిపోయినందుకు దేవతలు సంతసించారు. విభీషణుడు రావణునికి అంత్యక్రియలు నిర్వహించాడు. సీతాదేవిని అశోకవనం నుంచి విభీషణుని భార్య తీసుకొని వచ్చింది. రాముడు సీతను అగ్ని ప్రవేశం చేయించి, ఆమె పరాయి రాజు దగ్గర ఉన్నా పవిత్రురాలు గానే ఉందని లోకానికి నిరూపించి స్వీకరించాడు. విభీషణుడు పుష్పక విమానాన్ని సిద్ధం చేయగా సీతారామలక్ష్మణులు వానర ప్రముఖులతో అయోధ్యానగరం చేరుకున్నారు. భరతుడు అంతఃపురకాంతలను, మంత్రులను, పౌరులను వెంట తీసుకొనివచ్చి రామునికి స్వాగతం చెప్పాడు. రామునికి రాజ్యాన్ని అప్పగించాడు. సుముహూర్తంలో శ్రీరామచంద్రునికి పట్టాభిషేకం జరిగింది. శ్రీరాముడు తనకు సాయం చేసిన వారందరినీ సత్కరించాడు.

రాముని పాలన ధర్మబద్ధంగా సాగింది. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించారు. రాముడు ప్రజలందరిని కన్నబిడ్డల్లాగా కంటికి రెప్పల్లాగా కాపాడుతూ మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆదర్శ ప్రభువుగా, పురుషోత్తమునిగా, ధర్మపాలకునిగా, ఏకపత్నీవ్రతునిగా, పితృవాక్య పరిపాలకునిగా కీర్తి పొందాడు. రావణ కుంభకర్ణులుగా జన్మించిన జయవిజయులు రెండవ జన్మలో కూడా విష్ణుమూర్తి అవతారమైన రామునికి శత్రువులుగా చరించి, అతని చేతిలోనే మరణించారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# శ్రీకృష్ణావతారం

యయాతి పుత్రుడైన యదువు యాదవులకు మూలపురుషుడు. యాదవ రాజులలో శూరసేనుడు అనే రాజు ఉండేవాడు. అతని రాజధాని మధుర. శూరసేనుని పుత్రుడు వసుదేవుడు. అతడు కంసుని సోదరి అయిన దేవకీదేవిని వివాహమాడాడు. దేవకీ వసుదేవులకు వివాహమయిన తరువాత ఒకనాడు కంసుడు తన సోదరిని, బావను తన రథంపై ఎక్కించుకొని తీసుకొనివెళు తున్నాడు. అప్పుడు ఆకాశవాణి "కంసా ! నీ సోదరి దేవకి అష్టమగర్భంలో జన్మించిన వాడే నిన్ను చంపుతాడు. నీ మరణానికి కారకులైనవారినే నువ్వు ప్రేమతో తీసుకువెళుతున్నావు" అని పలికింది. ఆ మాటలు విన్న కంసుడు వెంటనే రథాన్ని ఆపాడు. కత్తి తీసుకొని దేవకీదేవిని చంపబోయాడు.

వసుదేవుడు కంసుని వారిస్తూ "బావా ! దేవకీదేవికి పుట్టే ఎనిమిదవ బిడ్డ కదా నిన్ను చంపేది ! అందువల్ల ఇప్పుడే ఆమెను చంపడం ఎందుకు ? మాకు బిడ్డలు పుట్టిన వెంటనే నీకు అప్పగిస్తాము. వారిని నీవు వెంటనే చంపితే నీకు ప్రాణభయం ఉండదు. కాబట్టి ఇప్పుడే పెండ్లి చేసుకున్న ఈ దేవకిని చంపడం ఎందుకు ? కాదంటే మమ్ములను నీ అధీనంలో ఉంచుకో ! నువ్వు రాజువి. అధికారాలన్నీ నీవే కదా !" అని బ్రతిమిలాడాడు. కంసుడు అందుకు అంగీకరించి దేవకీ వసుదేవులను చెరసాలలో ఉంచాడు. వారికి సంతానం కలిగితే వెంటనే వారిని తెచ్చి తనకు అందజేసేటట్లు ఏర్పాటు చేసుకున్నాడు.

చెరసాలలో ఉన్న దేవకీదేవి గర్భం ధరించింది. ఆమెకు బిడ్డ పుట్టిన వెంటనే భటులు ఆ బిడ్డను తీసుకొని వెళ్ళి కంసునికి అప్పగించారు. అతడా బిడ్డను వెంటనే చంపివేశాడు. ఈ విధంగా ఆరుగురు బిడ్డలు కంసుని కత్తికి బలి అయ్యారు.

ఒకప్పుడు పాతాళానికి పారిపోయిన రాక్షసులు ద్వాపర యుగంలో తమ తమ అంశలను రాజులలో ప్రవేశపెట్టి, తద్వారా భూలోకంలో అధికారం చలాయించాలని భావించారు. అందుకు అనుగుణంగా మధుడు, మారీచుడు, బకాసురుడు, మురాసురుడు మొదలైన రాక్షసులు తమ తమ అంశలను చేది, మధుర, మగధ రాజ్యాధినేతలలో వ్యవస్థాపితం చేశారు. వారు చేస్తున్న అరాచకాలతో ధర్మం నశింపసాగింది. భూమాత వారి భారాన్ని భరించలేక బ్రహ్మతో చెప్పి వాపోయింది. బ్రహ్మ భూదేవిని ఓదార్చి, ఆమెను తీసుకొనివెళ్ళి మహావిష్ణువును కలిశాడు. భూదేవి బాధను అర్థం చేసుకున్న శ్రీహరి కొద్దికాలంలో తాను భూమిపై అవతరిస్తానని, దేవతలు కొందరు భూమిపై పుట్టి తనకు సాయపడతారని, ఆ అవతారం ద్వారా భూభారాన్ని తగ్గిస్తానని మాట ఇచ్చాడు.

రాక్షస అంశలతో పుట్టిన కంసుడు, దంతవక్త్రుడు, జరాసంధుడు మొదలైన రాజుల బాధలను భరించలేని దేవతలు శ్రీహరిని సంప్రదించారు. అప్పుడాయన "మీరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. నా అంశలైన నరనారాయణులు బదరికావనంలో తపస్సు చేసుకుంటున్నారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

మేము త్వరలోనే కృష్ణార్జునులుగా అవతరిస్తాం. ముందుగా ఆదిశేషువు బలరామునిగా జన్మిస్తాడు. మేమందరం కలిసి ధర్మసంస్థాపన చేస్తాం" అని దేవతలకు మాట ఇచ్చాడు.

విష్ణువు దేవతలకు మాట ఇచ్చిన కొద్దికాలానికి దేవకి ఏడవసారి గర్భం ధరించింది. భగవంతుని అనుమతితో యోగమాయ ఆ గర్భాన్ని వసుదేవుని మొదటి భార్య రేణుకా దేవి గర్భంలో నిలిపింది. దేవకి గర్భాన్ని పోగొట్టుకున్నదని కంసునికి తెలిసింది. కాని కొంతకాలానికి రోహిణి ఒక మగబిడ్డని కన్నది.  అతడే బలరామునిగా జన్మించిన ఆదిశేషువు. ఒకరి గర్భాన్ని మరొకరికి సంక్రమింపచేయడం వల్ల జన్మించాడు కాబట్టి బలరాముని 'సంకర్షణుడు' అనికూడా అంటారు. మహావిష్ణువు ఆనతివ్వడంతో దేవతలు కూడా భూలోకంలో అవతరించారు.

# శ్రీకృష్ణ జననం

దేవకీదేవి ఎనిమిదవసారి గర్భాన్ని ధరించిందనే విషయం కంసునికి తెలిసింది. ఈసారి కంసుడు కారాగారం చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశాడు. శిశువు పుట్టిన వెంటనే తనకు కబురు చేయాలని గట్టిగా భటులను హెచ్చరించాడు.

అది శ్రావణమాసం. అష్టమీ తిథి. అర్ధరాత్రి. దేవకీదేవికి కుమారునిగా శ్రీహరి ఆ చెరసాలలో ఉద్భవించాడు. ఆ సమయానికి భగవంతుని మాయవలన భటులందరూ గాఢంగా నిద్రపోతున్నారు. చెరసాల గది తలుపులు తెరచుకున్నాయి. వసుదేవుడు పుట్టిన బిడ్డను ఎత్తుకున్నాడు. చెరసాల నుండి బయటకు వచ్చాడు. బాగా వర్షం కురుస్తోంది. ఆ వానలోనే పురవీధుల్లో నడుస్తూ యమునా తీరం చేరుకున్నాడు. యమునానది అతనికి దారి ఇచ్చింది. వసుదేవుడు ఆశ్చర్యపోతూ ఆ దారిలో పయనించి నందుని ఇంటికి చేరుకున్నాడు. అప్పుడే యశోద ప్రసవించి ఒక ఆడపిల్లను కన్నది. వసుదేవుడు తన కొడుకును యశోద ప్రక్కలో పడుకోబెట్టాడు. అక్కడున్న ఆడపిల్లను తీసుకొని చెరసాలలో ప్రవేశించాడు. దేవకీదేవి ప్రక్కలో ఆ పిల్లను పడుకోబెట్టాడు.

అప్పటివరకు నిద్రపోతున్న కాపలావారికి మెలకువ వచ్చింది. అప్పుడే దేవకీదేవి ప్రక్కలో ఉన్న ఆడపిల్ల ఏడవడం మొదలుపెట్టింది. దేవకీదేవి ప్రసవించిందనుకొని కావలివాండ్రు ఆ వార్తను కంసునికి తెలియజేశారు. వెంటనే ఆ శిశువును చంపడానికి కత్తిని తీసుకొని కంసుడు చెరసాలకు వచ్చాడు. కంసుని చూచి దేవకీదేవి "అన్నయ్యా ! ఆడపిల్ల. అది నిన్నేమి చేస్తుంది. కనికరించు" అంటూ బ్రతిమలాడింది. ఆకాశవాణి చెప్పింది కాబట్టి అష్టమ గర్భంలో జన్మించింది మగ అయినా ఆడ అయినా చంపవలసిందే నన్నాడు కంసుడు. పిల్లను పైకి విసిరాడు. క్రింద కత్తిని అడ్డంగా పెట్టాడు తెగిపోవడానికి వీలుగా.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

పైకి ఎగిరిన బిడ్డ క్రింద పడలేదు. కత్తికి ఎరకాలేదు. దివ్యమైన కాంతితో యోగమాయగా ప్రత్యక్షమయింది. "ఓరీ కంసా ! నేను మహాశక్తిని. నిన్ను చంపేది నేను కాదు. నిన్ను చంపేవాడు వ్రేపల్లెలో ఉన్నాడు. అక్కడే పెరుగుతున్నాడు. ఇక్కడి నుండి నీకు ఆయువు తరిగిపోతుంది. జాగ్రత్త" అని హెచ్చరించి మాయమయింది. ఎక్కడో పొరపాటు జరిగిందని కంసుడు భావించాడు. వ్రేపల్లెలో పెరిగే ఆ బాలుడిని చంపితే తన ప్రాణాలకు ముప్పు కలుగదని భావించుకున్నాడు. తనను చంపడానికి పుట్టిన ఆ బాలుడు వ్రేపల్లెలో ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని, అతనిని చంపుమని పూతన అనే రాక్షసిని పంపించాడు.

వ్రేపల్లెలో వసుదేవుడు తన కొడుకును యశోద ప్రక్కలో ఉంచి వెళ్ళిన కాసేపటికి యశోద కళ్ళు తెరిచింది. నీలమేఘవర్ణంతో మెరుస్తున్న ఆ బాలుడే తన కుమారునిగా భావించి ముద్దాడింది. ఆమె భర్త నందుడు కూడా వచ్చి బాలుని చూచి ఆనందించాడు. జాతక కర్మలన్నీ చేయించి 'కృష్ణుడు' అని నామకరణం చేసి, గారాబంగా పెంచసాగాడు.

# పూతన వధ

పూతన కంసుని ఆజ్ఞతో వ్రేపల్లెలో అడుగుపెట్టింది. చిన్నపిల్లలు ఏయే ఇళ్ళల్లో ఉన్నారో తెలుసుకుంది. యశోద ఇంటికి వచ్చింది. ఆ రోజు యశోద ఇంట్లో ముత్తైదువలు అందరూ చేరారు. మానవ రూపం ధరించిన పూతన వాళ్ళతో కలిసిపోయింది. అందరూ ఎత్తుకున్నట్లే చిన్ని కృష్ణుని ఎత్తుకుని ముద్దు చేసింది. ప్రక్కనే ఉన్న గదిలోనికి తీసుకొని వెళ్ళి పాలివ్వబోయింది. అప్పటికే ఆమె తన రొమ్ములకు విషం రాసుకుంది. పాలకోసం తన రొమ్మును నోట్లో పెట్టుకున్న వెంటనే విష ప్రభావంతో కృష్ణుడు మరణిస్తాడని పూతన ఆలోచన. ఆమె తన రొమ్మును కృష్ణుని నోటికి అందివ్వగానే కృష్ణుడు విషంతో సహా చప్పరిస్తూ పాలతోపాటు ఆమె ప్రాణాలు కూడా త్రాగడం మొదలుపెట్టాడు. ఆమె ఆ బాధను భరించలేకపోయింది. కృష్ణుని నుండి విడిపించుకొని పారిపోడానికి ప్రయత్నించింది. కృష్ణుడు ఆమెకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఆమె శరీరంలోని రక్తాన్ని, ప్రాణాలను పీల్చేశాడు. ఆమె తన సహజ రూపంతో గదిలో పడిపోయింది.

బాలకృష్ణుడు కనిపించకపోవడంతో అందరూ కంగారుపడ్డారు. అన్నిచోట్ల వెదకడం మొదలుపెట్టారు. గదిలో క్రిందపడి ఉన్న రాక్షసిని, ఆమె గుండెపై ఉన్న బాలకృష్ణుని చూశారు. యశోద త్వరత్వరగా వెళ్ళి కృష్ణుని ఎత్తుకుని అక్కున చేర్చుకుంది. బాలకృష్ణుడు ఒక రాక్షసిని చంపాడని వ్రేపల్లె అంతా తెలిసింది. ఆ వార్త కాలక్రమంలో కంసునికి కూడా తెలిసింది.

VGS PUBLISHERS


VCS PUBLISHERS

# శకటాసుర సంహారం

కంసుడు కృష్ణుని చంపడానికి శకటాసురుని పిలిపించాడు. అతనికి జాగ్రత్తలు చెప్పి పంపించాడు. పూతన చనిపోయినప్పటి నుండి యశోద కృష్ణునికి రాక్షసుల వలన అపాయం ఉందని గ్రహించి మరింత జాగ్రత్తగా అతనిని చూచుకోసాగింది. శకటాసురుడు వ్రేపల్లె చేరుకున్నాడు. బండి రూపంలో ఒంటరిగా ఉన్న కృష్ణుని మీదికి వెళ్ళి అతనిని చంపాలని అతని ఆలోచన. అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. ఒకరోజు కృష్ణుడు ఆరుబయట ఆడుకుంటున్నాడు. యశోద ఇంట్లో ఉన్నది. అదే సరైన సమయం అనుకుంటూ శకటాసురుడు బండి రూపం ధరించాడు. వేగంగా కృష్ణుని మీదికి వెళ్ళాడు. తన మీదికి వస్తున్న శకటాసురుని కృష్ణుడు ఒక్క తన్ను తన్నాడు. ఆ దెబ్బకు శకటాసురుడు నిజ రూపం ధరించి నెత్తురు కక్కుకుంటూ మరణించాడు. ఈ విధంగా కంసుని రెండవ ప్రయత్నం కూడా సఫలం కాలేదు.

# చక్రాసుర వధ

శకటాసురుడు మరణించాడని తెలిసి కంసుడు చక్రాసురుని పంపించాడు. చక్రాసురుడు ఒంటరిగా ఉన్న కృష్ణుని మీదికి బండి చక్రంగా మారి దొర్లుకుంటూ వచ్చాడు. అతనిని గమనించి కృష్ణుడు తన్నిన తన్నుకు చక్రాసురుడు క్రిందపడి దొర్లుకుంటూ మరణించాడు. అతని శరీరం ముక్కలుగా మారిపోయింది.

# తృణావర్తుని వధ

కంసుడు తన ప్రయత్నాలు ఆపలేదు. ఈసారి తృణావర్తుని పంపించాడు. ఒకనాడు పిల్లలతో ఆడుకుంటున్న శ్రీకృష్ణుని తృణావర్తుడు చూశాడు. సుడిగాలిగా వచ్చిన తృణావర్తుడు శ్రీకృష్ణుని గాలితోపాటు ఎగరేసుకుపోయాడు. గాలిలో శ్రీకృష్ణుడు తిరిగిపోతున్నాడు. పైకి ఎగిరిపోతున్నాడు. అలా గాలిలో తిరుగుతూనే కృష్ణుడు తృణావర్తుని పట్టుకున్నాడు. గుండెలు పగిలేలా కొట్టాడు. అతనికి అవకాశం ఇవ్వకుండా పిడిగుద్దులు గుద్దాడు. కృష్ణుని దెబ్బలను తృణావర్తుడు సహించలేకపోయాడు. నెత్తురు కక్కుకుంటూ నేల మీద రాలిపడ్డాడు. అతనితోపాటు సుడిగాలి నుంచి క్రిందికి వచ్చిన శ్రీకృష్ణుడు అతనిని గట్టిగా కొట్టడంతో వాడు సహజ రూపాన్ని పొంది క్రిందపడి పొర్లుతూ చనిపోయాడు. యశోదతోపాటు వ్రేపల్లెలోని స్త్రీలందరూ శ్రీకృష్ణుని గొప్పతనాన్ని మెచ్చుకున్నారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# అల్లరి కృష్ణుడు

వయస్సుతో పాటే కృష్ణుని అల్లరి కూడా పెరగసాగింది. గోపాలురను వెంటబెట్టుకొని వ్రేపల్లెనంతా తిరిగేవాడు. మిత్రులతో కలిసి గోశాలలో కట్టివేసి ఉన్న గోవులను విడిచిపెట్టేవాడు. దూడల్ని విడిచి పాలనన్నింటినీ తాగించేవాడు. ఇళ్ళలోదూరి వెన్నను దొంగిలించి తినేవాడు.

తాను తిని వెళ్ళిపోతూ కొంత వెన్న తీసి ఇంటి కోడలు పెదవుల మీద రాసేవాడు. కోడళ్ళ పెదవుల మీద వెన్న చూచి, వెన్న కోడళ్ళే తిన్నారని, అత్తలు గోల చేస్తుంటే ఆనందించేవాడు. ఇలా రకరకాలైన తన చేష్టలతో వ్రేపల్లెలోని అందరికీ తలలో నాలుకలా కలిసిపోయాడు.

ఒకరోజు బలరామకృష్ణులు తమ స్నేహితులతో ఆడుకుంటున్నారు. కృష్ణుడు గుప్పెడు మట్టిని తీసుకుని తన నోట్లో పోసుకున్నాడు. బలరాముడు వెళ్ళి తమ్ముడు మన్ను తిన్నాడని యశోదకు చెప్పాడు. ఆమె కృష్ణుని పిలిచింది. అతని మూతికి అంటుకున్న మట్టి కనిపించింది.

"మట్టి ఎందుకు తిన్నావు ?" అని గద్దించి అడిగింది. "నేను తినలేదు" అన్నాడు కృష్ణుడు. "అబద్ధాలాడుతున్నావు – తప్పు కదూ !" అన్నది యశోద. "మట్టి తినడానికి నేనేమన్నా పిచ్చివాడినా? నమ్మకం లేకపోతే నా నోరు తెరుస్తాను. చూడు" అంటూ బాలకృష్ణుడు నోరు తెరిచాడు.

బాలకృష్ణుని నోట్లోకి చూసింది యశోద. అంతే ! అలాగే ఆశ్చర్యపోయి చూస్తూ ఉండిపోయింది. ఆ నోట్లో ఆమెకు పధ్నాలుగు లోకాలు, నవగ్రహాలు, సమస్త దేవతలు, పర్వతాలు, నదులు, సమస్త ప్రకృతి, సంపూర్ణమైన జీవరాశులు – అన్నీ కనిపించాయి. చివరకు తాను కూడా కనిపించింది. కాసేపు అలా చూచిన యశోద కళ్ళు తిరిగి పడిపోయింది. బలరామకృష్ణులు ఆమెకు సపర్యలు చేశారు. ఆమె లేచి ఆశ్చర్యంతో కృష్ణుని వైపు చూచింది.

"అమ్మా ! నా నోట్లో నీకు మట్టి కనిపించిందా? నేను తప్పుచేశానా ?" అన్నాడు కృష్ణుడు. "లేదు నాన్నా ! తప్పు నీది కాదు. నా చేతులలో పెరిగిన నువ్వు చిన్నపిల్లవాడి వనుకున్నాను. కాని నువ్వు శ్రీ మహావిష్ణువు వని గుర్తించలేకపోయాను" అంటూ కృష్ణుని కౌగిలించుకొని ముద్దులతో ముంచెత్తింది.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# చిలిపి కృష్ణుడు

కృష్ణుడు చేసే చిలిపి పనులకు హద్దులు లేకుండా పోయాయి. ఆ అల్లరి పనుల గురించి తెలిస్తే యశోద అతనిని మందలించాలనుకునేది. కాని కృష్ణుడు కనిపిస్తే ఆ విషయాలన్నీ మరచిపోయి అతనితో కాలం గడిపేది. ఒకరోజు వ్రేపల్లెలోని గోపకాంతలు ఒక్కుమ్మడిగా యశోద దగ్గరకు వచ్చారు. కృష్ణుని అల్లరి భరించలేకపోతున్నామని, అతనిని అదుపు చేయలేకపోతే, ఊరు విడిచి వెళ్ళిపోతామని విన్నవించుకున్నారు. కృష్ణుడు ఏం చేశాడని ఆమె ప్రశ్నించింది. వచ్చిన గోపకాంతలు వరుసగా చెప్పసాగారు. మా ఇంట్లో ఎత్తుగా ఉట్టి మీద ఉంచిన పాలకుండను రాయితో కొట్టి పాలన్నింటినీ నేలపాలు చేశాడని ఒక గొల్లస్త్రీ చెప్పింది. మా ఇంట్లో దాచిపెట్టుకున్న వెన్ననంతా తిన్నాడు అని ఇంకొక స్త్రీ అంటే మా ఇంట్లో అత్తగారికి నాకు తగాదాలు పెట్టాడు అని మరొక స్త్రీ చెప్పింది. మా ఇంట్లోని నేతి కడవలు ఎత్తుకు వెళ్ళాడని ఒకరు, తన ఇంట్లోని పెరుగు మరొకరి ఇంట్లో ఉంచాడని మరొకరు, తమను కొట్టి పారిపోయాడని ఇంకొకరు, తమ ఇంట్లో, ఆడపిల్లలు స్నానం చేస్తుంటే చీరలు దొంగిలించాడని ఇంకొకరు, ఙడకు, దూడ తోకకూ ముడివేశాడని మరొకరు – ఈ విధంగా అందరూ శ్రీకృష్ణుని మీద చాడీలు చెప్పారు.

గోపకాంతులు తమ కుమారుని గురించి అన్ని నేరాలు చేసినట్లు పూసగ్రుచ్చినట్లు చెపుతుంటే యశోదకు కోపం వచ్చింది. "నేను కృష్ణుని తప్పకుండా మందలిస్తాను. అదుపులో ఉండేటట్లు చేస్తాను. మీరు కోపాన్ని వదలి నిశ్చింతగా ఉండండి" అని వారినందరినీ ఊరడించి త్రిప్పి పంపింది. కాసేపటి తరువాత కృష్ణుడు వస్తే, అతనిని పట్టుకుంది. తన తల్లి ఎందుకో కోపంగా ఉందని కృష్ణుడు గ్రహించాడు. కోపం ఎందుకని ప్రశ్నించాడు. చెపుతాను అంటూ యశోద అతనిని తీసుకొనివెళ్ళి ఒక రోటికి కట్టివేసింది.

చిన్ని కృష్ణుడు కుదురుగా ఉంటాడా ? అక్కడి నుండి వెళ్ళి స్నేహితులతో కలిసి అల్లరి చేయాలంటే రోటి నుండి విడిపించుకోవాలి లేదా రోటితోనే వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి. తల్లి కట్టింది కాబట్టి ఆ కట్టు విప్పకూడదనుకున్నాడు. రోటిని లాక్కుంటూ పెరటిలో వెళ్ళసాగాడు. రోలు రెండు మద్ది చెట్ల మధ్య ఇరుక్కొంది. కృష్ణుడు గట్టిగా లాగాడు. దాంతో ఆ రెండు చెట్లు పెళపెళమని విరిగి క్రింద పడ్డాయి. ఆ చెట్ల నుండి ఇద్దరు దివ్య రూపాలతో బయటకు వచ్చి "కృష్ణ పరమాత్మా! మాకు నీ వలన శాప విమోచనం కలిగింది. మాకు సెలవు" అంటూ ప్రార్థించి అంతర్ధానమయ్యారు.

చెట్లు పడిన శబ్దానికి ఆందోళన పడుతూ వచ్చిన యశోద పడిపోయిన మద్ది చెట్లను, మధ్య ఉన్న కృష్ణుని చూచింది. తన బిడ్డకు అపాయం తప్పిందని సంతోషించింది. గోపకాంతలు ఎన్ని చాడీలు చెప్పినా, ఇకముందు అతనిని దండించకూడదని మనసులో అనుకుంది.

VGS PUBLISHERS



# అందాల బృందావనం

వ్రేపల్లెలో రాక్షసులు రావడం, కృష్ణుని చంపడానికి ప్రయత్నించడంతో యశోద, నందుడు భయపడిపోయారు. వ్రేపల్లె నుంచి బృందావనానికి వలస వెళ్ళడానికి సిద్ధపడ్డారు. బృందావనానికి చేరుకున్న తరువాత అక్కడి అందమైన వాతావరణం బలరామకృష్ణులకు బాగా నచ్చింది. అక్కడి పిల్లలు కూడా వీరికి త్వరలోనే మంచి మిత్రులుగా మారిపోయారు. యమునా తీరం. ఇసుక తిన్నెలు. వెన్నెల వెలుగులు. అందమైన ప్రకృతి. బృందావనం అందాలను చూడాలంటే వందకళ్ళు చాలవు. అలాంటి బృందావనంలో బలరామకృష్ణులు ఆనందంగా తిరుగుతున్నారు.

# వత్సాసుర మరణం

కంసుడు కృష్ణుడు ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తే బృందావనంలో ఉన్నాడని తెలిసింది. ఈసారి అతడిని అంతం చేయడానికి వత్సాసురుడిని పంపించాడు. వత్సాసురుడు ఆవుదూడ రూపంలో వచ్చి, దూరం నుంచి కృష్ణునే చూడసాగాడు. దానిని గమనించిన కృష్ణుడు అది రాక్షస రూపం అని గ్రహించాడు. తానే దాని దగ్గరకు వెళ్ళాడు. అది కృష్ణుని కొమ్ములతో కుమ్మడానికి ప్రయత్నించేలోపు, కృష్ణుడు దాని నాలుగు కాళ్ళు పట్టుకొని గిరగిరా త్రిప్పి నేలకేసి కొట్టాడు. అంతే అది తన సహజ రాక్షస రూపం ధరించి ప్రాణాలు కోల్పోయి నేలమీద పడింది.

# బకాసుర వధ

ఈసారి కంసుడు బకాసురుని పంపాడు. బలరామకృష్ణులు తమ మిత్రులతో ఒక చెరువులో ఈత కొట్టడానికి వెళుతున్నారని బకాసురుడు గ్రహించాడు. తాను ఒక కొంగ రూపం ధరించి సరస్సులో దొంగ జపం చేస్తూ నిలబడ్డాడు. కృష్ణుడు ఆ మాత్రం గ్రహించలేడా! స్నేహితులతో ఆడుకుంటూనే కృష్ణుడు ఆ కొంగను ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు. కాసేపు అయిన తరువాత కొంగ తన ఆకారాన్ని పెంచింది. కృష్ణుని మ్రింగాలని దాని ఆలోచన. ఈలోపు కృష్ణుడు దానిని పట్టుకొని దాని ముక్కును రెండుగా చీల్చివేశాడు. అది రాక్షస రూపాన్ని పొంది చెరువులో పడి మరణించింది. మిత్రులు ముందుగా భయపడినా తరువాత కృష్ణుని అభినందించారు.

బకాసురునికి ఒక తమ్ముడు ఉన్నాడు. వాడి పేరు అఘాసురుడు. వాడు కొండచిలువ రూపంతో వచ్చాడు. కొండ గుహలాగా నోరు తెరచి పడుకున్నాడు. గోపాలురు తమ పశువులతో సహా దాని నోటిలో ప్రవేశించారు. కృష్ణుడు అది రాక్షసుడని తెలుసుకున్నాడు. తానూ దాని నోట్లో దూరాడు. ఆ కొండచిలువ వారినందరినీ మ్రింగివేసింది. కొండచిలువ కంఠం దగ్గర ఆగిపోయిన కృష్ణుడు తన ఆకారాన్ని పెంచసాగాడు. కృష్ణుడు పెరుగుతూ ఉంటే అఘాసురునికి ఊపిరి ఆడడం లేదు. కడుపు ఉబ్బిపోయింది. పొట్టపగిలిపోయి అది చనిపోయింది. గోపాలురు తమ గోవులతో సహా బయటకు వచ్చారు.

VGS PUBLISHERS



# ధేనుకాసుర వధ

కంసుడు ఈసారి ధేనుకాసురుని పంపించాడు. బృందావనానికి సమీపంలో ఉన్న ఒక తాడితోపు దగ్గర గాడిద రూపంలో ధేనుకాసురుడు మాటువేసి కృష్ణుని కోసం చూస్తున్నాడు. బలరామకృష్ణులు మిత్రులతో తాటి పండ్ల కోసం తోపు వద్దకు వెళ్ళారు. చెట్లను ఊపుతూ క్రింద పడిన పండ్లను ఏరుకుంటూ స్నేహితులంతా ఉత్సాహంగా ఉన్నారు.

గాడిద రూపంలో ఉన్న ధేనుకాసురుడు పరుగులు తీస్తూ, ఓంఢ్ర పెడుతూ బలరామకృష్ణుల దగ్గరకు వచ్చాడు. వెనుక కాళ్ళను పైకెత్తి బలరాముని రొమ్ముపై బలంగా తన్నాడు. ఈ హఠాత్పరిణామానికి మిత్రులందరూ చెల్లాచెదరయ్యారు. బలరాముడు ధేనుకాసురుని ఎదిరించాడు. దాని కాళ్ళు పట్టుకొని త్రిప్పి నేలపై కొట్టి చంపాడు. మిత్రులంతా బలరాముని బలాన్ని, పరాక్రమాన్ని ప్రశంసించారు.

# కాళీయ మర్దనం

ఒకరోజు బలరామకృష్ణులు తమ స్నేహితులతో కలసి గోవులను మేపడానికి అడవికి వెళ్ళారు. ఆటపాటలతో గడుపుతూ బాగా అలసిపోయారు. దాహం వేసింది. ఆ సమీపంలోనే కాళింది సరస్సు ఉంది. అందులో దిగి కొంతమంది దప్పిక తీర్చుకున్నారు. ఆ కాళింది మడుగులో కాళీయుడనే పాము తన భార్యలతో నివాసం ఉంటున్నది. అది ఆ సరస్సు నీటిని తన విషంతో నింపింది. ఆ విష ప్రభావంతో చెరువులో దిగి నీళ్ళు త్రాగిన గోపాలురు, గోవులు క్రిందపడి మరణించాయి. కృష్ణుడు తన శక్తితో అందరినీ బ్రతికించాడు.

కాళీయునికి బుద్ధి చెప్పాలనుకున్న కృష్ణుడు కాళింది మడుగు దగ్గరకు వెళ్ళాడు. మడుగులో దూకి అల్లకల్లోలం చేశాడు. మడుగు అడుగున ఉన్న కాళీయునికి కోపం వచ్చింది. వెంటనే పైకి వచ్చాడు. కృష్ణుని చూస్తూ అతని మీద బుస కొడుతూ విషాన్ని చిమ్మాడు. కృష్ణుడు కదలలేదు. తాను విషాన్ని చిమ్మినా ఆ పిల్లవాడు మరణించనందుకు కాళీయుడు ఆశ్చర్యపోయాడు. కృష్ణుని చుట్టుకుంటూ కాటువేయాలనుకున్నాడు. కృష్ణుడు దాని తోకను పట్టుకున్నాడు. బలంగా మెలిత్రిప్పాడు. కాళీయుడు ఆ బాధ భరించలేకపోయాడు. ఈ లోపు కృష్ణుడు దాని తోకను విడువకుండానే దాని తలమీదికి ఎక్కాడు. నాట్యం చేయడం మొదలుపెట్టాడు. కృష్ణుని బరువు మోయలేకపోయింది పాము. దాని నోటి వెంట రక్తం కారసాగింది. ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడింది. కాళీయుడు బాధతో అరవడం మొదలుపెట్టాడు.

కాళీయుని అరుపులు విని అతని భార్యలు పైకి వచ్చారు. కృష్ణునికి నమస్కరిస్తూ తమకు

VGS PUBLISHERS


VGS PUBLISHERS

పతిభిక్ష పెట్టుమని వేడుకున్నారు. కాళీయుడు కూడా తనను చంపవద్దని ప్రార్థన చేశాడు. "కృష్ణా! గరుత్మంతుడు వెంటాడడంతో అతనికి భయపడి నా భార్యలతో ఈ మడుగులో తలదాచుకున్నాను. ఈ సరస్సు సమీపానికి ఇతరులెవరూ రాకుండా చేయడానికి ఈ నీటిని విషపూరితం చేశాను. నన్ను క్షమించి ప్రాణాలు నిలబెట్టు" అని ప్రార్థించాడు. కృష్ణుడు అతనిని చూస్తూ "కాళీయా ! నీరు ప్రాణికోటికి జీవనాధారం. అటువంటి నీటిని విషపూరితం చేశావు. నీటిలో ఉన్న విషాన్ని పీల్చుకో ! నీటిని పరిశుభ్రంగా మార్చు. ఇక్కడి నుండి భార్యలతో ఎక్కడికైనా వెళ్లిపో ! గరుత్మంతుడు నిన్నేమీ చేయకుండా నీ తల మీద నా పాదముద్రలు ఉంచుతాను" అంటూ అతని తలపై తన పాదముద్రలు ఉంచాడు. కాళీయుడు బ్రతుకు జీవుడా ! అనుకుంటూ తన భార్యలతో కలిసి మరొక ద్వీపానికి బయలుదేరాడు. వెళ్ళిపోతూ మడుగులోని విషాన్నంతా పీల్చి, నీటిని శుభ్రం చేశాడు. గోపాలకులందరూ తమ ప్రాణాలు కాపాడినందుకు కృష్ణునికి ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రలంబాసుర సంహారం

ప్రలంబాసురుడనేవాడు కృష్ణుని చంపడానికి బృందావనం వచ్చాడు. ప్రలంబాసురుని రాకను కృష్ణుడు ముందుగానే పసిగట్టాడు. అతని విషయం తనకేమీ తెలియనట్లే అతనితో స్నేహం చేసి గోపాలురతో కలిసిపోయేటట్లు చేశాడు. ఒకరోజు గోపాలురందరూ ఆలమందలను తోలుకొని పచ్చిక మైదానానికి వెళ్ళారు. ఆలమందలు పచ్చిక మేస్తుంటే గోపాలురు ఆటల్లో లీనమయ్యారు.

బలరామకృష్ణులు ఆటలో భాగంగా గోపాలురను రెండు వర్గాలుగా విభజించారు. రాళ్ళను దూరంగా విసరడం, దూరంగా విసరలేనివారు ఓడడం, ఓడినవారు గెల్చినవారిని తమ భుజాల మీద ఎక్కించుకొని మోయడం - అనేవి ఆట నియమాలు. ఆ ఆటలో ప్రలంబాసురుడు ఓడిపోయాడు. బలరామకృష్ణులు గెలిచారు. ప్రలంబుడు బలరాముని తన భుజాలపై ఎక్కించుకొని పోసాగాడు. కొంతదూరం తీసుకొనివెళ్ళి బలరాముని చంపాలని అతని ఆలోచన. అది కృష్ణుని ద్వారా ముందే తెలుసుకున్న బలరాముడు ప్రలంబుని ముందుగానే మట్టుపెట్టాలనుకున్నాడు. వేగంగా వెళుతున్న ప్రలంబుని శిరస్సు మీద తన పిడికిలితో గట్టిగా కొట్టాడు. అతని దెబ్బలకు ప్రలంబుని శిరస్సు ముక్కలయింది. ప్రలంబాసురుడు మరణించాడు. బలరాముడు తిరిగివచ్చి, గోపాలురను కలుసుకున్నాడు.

ఒకరోజు అడవిలో కార్చిచ్చు వ్యాపించింది. ఆవులను మేపుతున్న గోపాలురు కార్చిచ్చును చూచి భయపడి పరుగులు తీశారు. కృష్ణుడు ఆ దావానలాన్ని తన మాయతో తానే మ్రింగి గోవులను, గోపాలురను కాపాడాడు.

VGS PUBLISHERS



# గోపికల వస్త్రాలను అపహరించుట

ఒకరోజు గోపికలు యమునా నదిలో స్నానం చేయడానికి వెళ్ళారు. నదీ తీరంలో ఉన్న చెట్టు మూలంలో తాము విడిచిన వస్త్రాలను, నగలను ఉంచి, నదిలో దిగి స్నానం చేస్తున్నారు. జలక్రీడలో మునిగిన వారి మనస్సులో కృష్ణుడు మెదిలాడు. కాత్యాయనీదేవిని తలచుకొని,

కృష్ణుని వంటి భర్తను తమకు ప్రసాదించుమని మ్రొక్కుకున్నారు. ఆ సమయంలో కృష్ణుడు తన స్నేహితులతో యమునా తీరానికి వచ్చాడు. గోపికలు స్నానం చేయడం చూశాడు. గోపాలురను పంపించాడు. గోపికలు విడిచిపెట్టిన బట్టలను, ఆభరణాలను తీసుకున్నాడు. చెట్టెక్కి కూర్చున్నాడు.

యమునలో స్నానం చేస్తున్న గోపకాంతల్లో ఒక స్త్రీ యథాలాపంగా చెట్టువైపు చూచింది. చెట్టు మొదట్లో తాము ఉంచిన వస్త్రాలు కనిపించలేదు. బయటకు వెళదామంటే శరీరాల మీద బట్టలు లేవు. నీళ్ళలో ఎంతసేపని ఉండగలరు ? ఏమి చేయాలో పాలుపోక తత్తరబిత్తర లాడారు. అంతలో ఎక్కడి నుండో వేణుగానం వినిపించింది. కృష్ణుడు తమ సమీపంలో ఉన్నాడని, అతడే తమ చీరలు దొంగిలించాడని వారికి అర్థమయింది. అంతలో కృష్ణుడే మెల్లగా వచ్చి వారికి కనిపించాడు. అతని చేతిలో తమ చీరలు కనిపించాయి. అందరూ తమ చీరలు తమకివ్వమని ప్రార్థించారు. తీరానికి వచ్చి తన దగ్గర ఉన్న చీరలు తీసుకోమన్నాడు కృష్ణుడు. బయటకు వెళదామంటే వారి తనువులపై నూలుపోగు లేదు. సిగ్గు విడిచి రాలేమన్నారు కాంతలు. వస్తేనే ఇస్తానన్నాడు కృష్ణుడు. ఏమి చేయాలో పాలుపోక ఒకరి ముఖం మరొకరు చూచుకున్నారు. మా మానాన్ని కాపాడుమని మళ్ళీ మళ్ళీ వేడుకున్నారు.

కృష్ణుడు గోపికలను నవ్వుతూ చూశాడు. "నా వంటి భర్త కావాలని కాత్యాయనీ దేవిని కోరుకుంటారు. నేనే వస్తే, నా దగ్గరకు రావడానికి సిగ్గు అంటారు. శరీరం మీద అంతటి అభిమానాన్ని పెంచుకోవద్దు. శరీరం కన్నా మనసు ముఖ్యం. భక్తితో పూజించాలి" అని చెప్పాడు. ఆ ఉపన్యాసం విన్న గోపికలు సిగ్గుపడుతూ "కృష్ణా ! మేము సామాన్య గోపికలం. మమ్ములను మామూలు గోపికలుగానే చూడు" అన్నారు. రెండు చేతులు ఎత్తి కృష్ణునకు నమస్కారం చేశారు. కళ్ళు తెరచి చూస్తే కృష్ణుడు కనిపించలేదు. గట్టుమీద చీరలు కనిపించాయి. గోపకాంతలు తీరానికి చేరి తమ చీరలు కట్టుకున్నారు. శ్రీకృష్ణుని లీలలను తలచుకొని పులకించిపోతూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

VGS PUBLISHERS



# గోవర్ధన గిరిధారి

"ఇంద్రుడు వర్షాధిదేవత. ఆయనను పూజిస్తే వర్షాలు పడతాయి. పాడి పంటలకు లోటు ఉండదు" అని భావించే నందుడు ప్రతి సంవత్సరం ఇంద్రుని పూజిస్తూ ఉత్సవం నిర్వహించేవాడు. ఆ సంవత్సరం కూడా ఇంద్రుని పూజిద్దామనుకున్నాడు నందుడు. "మన పశువులకు మేత, మనకు కలప ఇచ్చేది గోవర్ధన పర్వతం. దానికి పూజ చేద్దాం" అన్నాడు కృష్ణుడు. అందరూ సరేనన్నారు.

గోవర్ధన పర్వతం దగ్గర ఉత్సవం ప్రారంభమయింది. తనకు పూజ చేయకుండా, ఒక కొండను పూజిస్తున్నందుకు ఇంద్రుడు కోపించాడు. కాలమేఘాలను పిలిచి ఉరుములతో, పిడుగులతో వర్షం కురిపించుమన్నాడు. భయంకరంగా వర్షం ప్రారంభమయింది. ఉరుములకు, పిడుగులకు గోవులు, గోపాలురు భయపడ్డారు. కృష్ణుడు వారికి అభయమిచ్చాడు. గోవర్ధన గిరిని పైకి లేపి తన చిటికెన వ్రేలిపై ఉంచుకున్నాడు. పశువులు, గోపాలురు ఆ గోవర్ధన గిరి క్రింద చేరి, భయం లేకుండా గడిపారు. వారం రోజులపాటు ఎడతెరపి లేకుండా వర్షాన్ని కురిపించినా కృష్ణుడు పర్వతాన్ని మోస్తూనే ఉన్నాడు. గోపాలురు ఏ ఇబ్బంది లేకుండా అక్కడే ఉన్నారు. ఇంద్రుడు వర్షాన్ని ఆపి కృష్ణుని వద్దకు వచ్చాడు. తనను క్షమింపుమని ప్రార్థించాడు. కృష్ణుడు అతనిని క్షమించాడు. గోవర్ధన గిరిని యథాస్థానంలో ఉంచాడు.

# వంశీకృష్ణుడు

కృష్ణుని చేతిలో ఎప్పుడూ వేణువు ఉంటుంది గదా ! కృష్ణుడు ఆ వేణువును మ్రోగిస్తే చాలు బృందావనమంతా మైమరచిపోతుంది.

వేణుగానం వినిపించినంతనే ప్రకృతి పులకించి క్రొత్త చివుళ్ళు తొడిగేది. ఆకాశంలో ఉన్న మబ్బులు ఆనందంతో తేలిపోతూ వర్షంగా జారిపోయేవి. ఎగిరిపోయే పక్షులు తిరిగివచ్చి కొమ్మల మీద వాలి ఆ గానాన్ని అనుకరిస్తూ పాటలు పాడేవి. పాములు తోకమీద లేచి నాట్యం చేసేవి. పూల మొగ్గలు రేకలు విప్పి తమ ఆనందాన్ని వ్యక్తం చేసేవి. చెట్లు సంతోషంతో కొమ్మలు ఊపుతూ తమ సంతోషాన్ని తెలియజేసేవి.

బృందావనంలోని గోపకాంతల సంగతి ఇంక చెప్పేది ఏముంది ? వేణుగానం వినిపిస్తే చాలు ఇళ్ళు విడిచి పరుగులు తీసేవారు. బిడ్డకు పాలిచ్చే తల్లి, ఇంట్లో అన్నం వండే ఇల్లాలు, పాలు పితికే కాంత, భోజనం చేసే పిల్లలు, పశువులు మేపే గోపకులు – ఇలా ఒకరేమిటి ఆబాల గోపాలం కృష్ణుని వేణుగానానికి పులకరించేది. గంధర్వ లోకాల్లోకి వెళ్ళి విహరించేది.

గోపికలయితే నిలువెల్లా కళ్ళు చేసుకుని కృష్ణుని కోసం ఎదురుచూచేవారు. అతని వేణుగానం కోసం తపించేవారు. పువ్వులు కోసుకునే అమ్మాయి వేణుగానం వినిపిస్తే పువ్వులు కోయడం మరచిపోయేది. పువ్వులు మాలగా కూర్చే పడతి వేణుగానంతో తాను చేసే పనిని మరచిపోయేది.

VGS PUBLISHERS



తలదువ్వే తరుణి తనను తాను మరచి అలాగే నిలబడిపోయేది. స్నానం చేసే పడతి ఆ సమయంలో మురళీగానానికి సిగ్గుతో తడిసిపోయేది.

వేణుగానం వినిపించిన దిశగా గోపకాంతలు పరుగులు తీసేవారు. బృందావనంలో యమునా తీరంలో, సైకత శ్రేణులలో తన గానాన్ని వినడానికి వచ్చిన యువతులను చూచి శ్రీకృష్ణుడు "ఈ రాత్రి ఎందుకు వచ్చారు. భయం కలుగలేదా ?" అని మృదువుగా చెప్పేవాడు. వారు విడువలేక విడువలేక తిరిగి వెళ్ళేవారు.

# కంసుడు-ధనుర్యాగం

తనను చంపడానికి పుట్టినవాడు శ్రీకృష్ణుని పేరుతో పెరుగుతున్నాడని కంసునికి తెలుసు. అతనిని చంపడానికి ఎంతమంది రాక్షసులను పంపినా, వారందరూ కృష్ణుని చేతిలో హతమయ్యారని కంసుడు కలవరపడ్డాడు. కృష్ణుని సంహరించే మార్గం తెలియక, ఆ కోపాన్ని దేవకీ వసుదేవుల మీద ప్రదర్శిస్తూ, వారిద్దరినీ గొలుసులతో బంధించాడు. తన సన్నిహితులతో, మంత్రులతో సుదీర్ఘ మంతనాలు చేశాడు. బలరామకృష్ణులను ఏదో ఒక మిషతో మధురకు పిలిపించి, అక్కడ చంపడం మంచిదని వారు సలహా ఇచ్చారు. వారిద్దరిని చంపడానికి కువలయాపీడమనే మదపుటేనుగును సిద్ధం చేయించాడు. చాణూర ముష్టికులనే మల్లయోధులను తయారుగా ఉండుమని చెప్పాడు.

కంసుడు ధనుర్యాగం చేయబోతున్నాడని, ఆ యాగ సందర్భంగా యుద్ధ విద్యలు ప్రదర్శించ వచ్చని, ఆయా యుద్ధ విద్యల్లో ఆరితేరినవారు పోటీల్లో పాల్గొని విజయం సాధిస్తే బహుమతులు ఉంటాయని ప్రకటనలు చేయించాడు. పోటీలలో పాల్గొనవలసినదిగా బలరామకృష్ణులను ఆహ్వానించడానికి ప్రత్యేకంగా అక్రూరుని ఎంపిక చేసి పంపించాడు కంసుడు. అక్రూరుడు మహాభక్తుడు. ఆయన వెళ్ళి కంసుని కోరికను బలరామకృష్ణులకు తెలియజేశాడు. నందుడు వద్దన్నాడు. కాని బలరామకృష్ణులు తండ్రికి నచ్చజెప్పారు. మధురకు బయలుదేరారు.

VGS PUBLISHERS

# మధురలో మావుడు

బలరామకృష్ణులు మధురలో ప్రవేశించారు. అప్పటికే బలరామకృష్ణులు అద్భుత కార్యాల గురించి విన్న మధురాపుర ప్రజలు వారిని చూడడానికి ఎగబడ్డారు. ఆ మహాపురుషుల దివ్య దర్శనం కలగడం తమ పూర్వజన్మసుకృతంగా భావిస్తూ, వారికి స్వాగతం పలికారు. ప్రజల మర్యాదలు స్వీకరిస్తూ వారు మధురానగరమంతా తిరిగి చూశారు.

రాజవీధిలో వెళుతున్న బలరామకృష్ణులకు కంసుని రజకుడు ఎదురువచ్చాడు. అతనివద్ద రాజుగారి పట్టువస్త్రాలున్న మూట ఉంది. బలరామకృష్ణులు అతనిని ఆపి ఆ మూటను విప్పారు.


VGS PUBLISHERS

అందులో అందంగా ఉన్న వస్త్రాలను ఎంపికచేసి వాటిని తమకు ఇమ్మన్నారు. "ఆవులు కాసుకొనేవారికి రాజుల వస్త్రాలు ఎందుకు ? మీ స్థాయిని బట్టి వస్త్రాలు ధరించాలి గాని రాజ వస్త్రాలపై మక్కువ తగదు" అని పరిహాసం చేశాడు ఆ రజకుడు.

అంతే కృష్ణుడు ఆ చాకలి పొట్టలో ఒక గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు వాడికి చుక్కలు కనిపించాయి. క్రింద పడిపోయాడు. వాడు క్రింద పడిపోవడంతో అతని వెనుక బట్టల మూటలతో వస్తున్న మిగిలిన రజకులు తమ భుజాల మీద ఉన్న బట్టల మూటలు అక్కడే వదిలేసి పరుగు లంకించుకున్నారు. బలరామకృష్ణులు ఆ మూటల్లో ఉన్న బట్టల నుంచి మేలైన వస్త్రాలను ఎంపిక చేసుకొని ధరించి మళ్ళీ నగర సందర్శనానికి బయలుదేరారు.

దారిలో సుదాముడనే విష్ణుభక్తుని గృహం ఉంది. అక్కడికి వెళ్ళారు. సుదాముడు బలరామకృష్ణులను పూలతో పూజించాడు. అతనికి సంపదలను వరంగా ప్రసాదించి మళ్ళీ వారు మరొకవీధిలో ప్రవేశించారు.

## అందగత్తెగా మారిన అనాకారి

కంసుని ఆస్థానంలో ఒక కుబ్జ ఉండేది. ఆమె గూనిది. పూలమాలలు కట్టడంలో నేర్పరి. కంసుని కోసం పూలమాలలు, పరిమళ ద్రవ్యాలు తీసుకొనివెళ్ళేది. వీధిలో ఆమె బలరామకృష్ణులకు తారసపడింది. కృష్ణుడు ఆమెతో "సుందరీ ! మాకు మాలలిస్తావా ?" అన్నాడు. ఆ మాటలకు ఆమె ఆనందంతో ఒకమాలను బలరామునికి ఇచ్చి, ఒకమాలను తనే స్వయంగా శ్రీకృష్ణుని మెడలో వేసింది. కొన్ని పరిమళ ద్రవ్యాలను కూడా అందజేసింది. "నీ పేరేమిటి" అని అడిగాడు బలరాముడు. "నా పేరు కుబ్జ. గూనిదాననని అందరూ అలాగే పిలుస్తారు" అన్నది కుబ్జ. ఆమె మాటల్లో బాధ ధ్వనిస్తూనే ఉంది.

కృష్ణుడు "నాకు అందంగా కనిపించావంటే నువ్వు అందగత్తెవే. రేపటి నుండి లోకంలో అందరికీ అందంగానే కనిపిస్తావు. నిన్ను మించిన అందగత్తెలు మధురలో మరెవరూ ఉండరులే !" అంటూ ఆమె పాదాలపై తన పాదాలు ఉంచి చంకల క్రింద చేతులుపెట్టి పైకి లేపాడు. దానితో గూని పోవడంతోపాటు అద్భుత సౌందర్యరాశిగా కుబ్జ మారిపోయింది. చూస్తున్న వారందరూ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. కృష్ణుని మహత్తులు అందరూ కీర్తించారు.

"నీవు ప్రసాదించిన ఈ అందమంతా నీకే అర్పితం స్వామీ ! నా ఆతిథ్యాన్ని స్వీకరించి నా ఇంటిని, ఈ ఒంటిని పావనం చెయ్యి !" అని కుబ్జ ప్రాధేయపడింది. "నేనొక పని మీద వచ్చాను. ఆ పని పూర్తయిన తరువాత నీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తాను" అని కృష్ణుడు ఆమెకు మాట ఇచ్చాడు. తరువాత తిన్నగా రాజసౌధంవైపు అడుగులు వేశారు.

VGS PUBLISHERS


VCS PUBLISHERS

# కువలయాపీడంతో కుమ్ములాట

బలరామకృష్ణులు రాజసౌధాన్ని సమీపించేలోపు సింహద్వారం దగ్గర మదపుటేనుగు ఒకటి ఘీంకరిస్తూ వారిద్దరిపైకి దూకింది. దానిపేరు కువలయాపీడం. అది బాగా మదించింది. తన తొండంతో బలరామకృష్ణులను పట్టుకొని, నేలకేసి కొట్టి చంపేవిధంగా కంసుడు దానికి శిక్షణ ఇప్పించాడు. అది బలరామకృష్ణులను పట్టుకోబోయింది. కాని ఇద్దరూ అతినేర్పుగా దాని నుండి తప్పించుకున్నారు. వెనుకపాటుగా వచ్చి దాని మీదికి ఎగిరి కూర్చున్నారు. దాని కుంభస్థలం మీద తమ పిడికిళ్ళతో బాగా కుమ్మారు. ఆ దెబ్బలకు ఆ కువలయాపీడం కుంభస్థలం నుంచి నెత్తురు వరదగా కారింది. అది పిచ్చిపట్టిన దానిలా అరుస్తూ నేలమీద కూలిపోయింది. బలరామకృష్ణులు దాని దంతాలను కోసుకున్నారు. వాటిని తీసుకొని ధనుర్యాగం జరిగే ప్రదేశానికి వెళ్ళారు.

# చాణూర ముష్టికుల వధ

బలరామకృష్ణులు యాగశాలలోకి అడుగుపెట్టేటప్పటికే అక్కడ చాణూరుడు, ముష్టికుడు మదించిన ఏనుగుల్లాగా వీరి కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. అప్పటికే ఎందరినో ఓడించి విజయగర్వంతో మీసాలు తిప్పుతూ ఉన్నారు వారిద్దరూ. వారిని ఎవ్వరూ జయింపలేరని, వారిచేత బలరామకృష్ణులను హతమార్పించాలని కంసుడు వారిని తన ఆస్థానంలో ఉంచుకున్నాడు. బలరామకృష్ణులు వస్తున్నారని తెలిసినప్పటి నుండి బలరామకృష్ణులను చంపితే గొప్ప బహుమానం ఇస్తానని వారికి ఆశపెట్టాడు.

బలరామకృష్ణులు తాము చంపిన ఏనుగు దంతాలను తీసుకొని లోపలికి అడుగుపెట్టగానే వారు కువలయాపీడాన్ని చంపి వచ్చారని అక్కడి వారందరికీ అర్థమయింది. కంసుడు కూడా అర్థం చేసుకున్నాడు. ఈ మల్లయుద్ధంలో వారికి చావు తప్పదులే అనుకున్నాడు.

చాణూరముష్టికులు తొడలు, భుజాలు చరుచుకుంటూ బలరామకృష్ణులను మల్లయుద్ధానికి ఆహ్వానించారు. తమతో పోరాడే దమ్ముందా అంటూ రెచ్చగొట్టారు. బలరామకృష్ణులు ఊరుకుంటారా? వెంటనే రంగంలోకి దిగిపోయారు.

మల్లయుద్ధంలో అనేకరకాల బంధాలుంటాయి. అవన్నీ తమకు తెలుసునని చాణూర ముష్టికుల అభిప్రాయం. కాని బలరామకృష్ణులతో పోటీ ప్రారంభమయ్యాక వారికి తెలియని బంధాలు ఎన్నో ఉన్నాయని అర్థమయింది. వారు పట్టిన పట్టు తప్పించుకోవడం వీరికి సాధ్యం కావడం లేదు. కాసేపటికే ఇద్దరూ కళ్ళు తేలేశారు. బలరాముడు, కృష్ణుడు వారిద్దరినీ తమ చేతులతో పైకెత్తి గిరగిరా త్రిప్పి క్రింద పడవేశారు. ఇద్దరి శరీరాలు నుగ్గునుగ్గయ్యాయి. తిరిగి లేవలేకపోయారు. కాసేపటికే వారి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఇదంతా తిలకిస్తున్న కంసుడు అక్కడి నుండి లేచి వెళ్ళిపోయాడు.

VGS PUBLISHERS



# యమసదనం చేరిన కంసుడు

కువలయాపీడం, చాణూర ముష్టికులు మరణించడంతో కంసుడు సహించలేకపోయాడు. కోపంతో ఊగిపోయాడు. వెంటనే భటులను పిలిచి చెరసాలలో ఉన్న దేవకీ వసుదేవులను, తన తండ్రి ఉగ్రసేనుని చిత్రహింసలు పెట్టుమని ఆజ్ఞాపించాడు. ఆ విషయం గ్రహించిన బలరామకృష్ణులు కంసుని వెదుక్కుంటూ అంతఃపురంలోకి వెళ్ళారు. వీరిని చూచిన వెంటనే కంసుడు ఆసనం మీద నుంచి లేచి కత్తి దూసి ముందుకు వచ్చాడు. అతని అంగరక్షకులు కూడా ఆయుధాలు ధరించి బలరామకృష్ణుల మీదికి దూకారు.

కృష్ణుడు కంసుని ఢీకొన్నాడు. బలరాముడు అంగరక్షకులతో తలపడ్డాడు. కృష్ణుడు ఎగిరిదూకి కంసుని మెడను పట్టుకున్నాడు. ఆ విసురుకు అతని కిరీటం క్రింద పడింది. కంసుడు తన కత్తితో కృష్ణుని మీద తిరగబడ్డాడు. కృష్ణుడు అతని కత్తిని మధ్యలోనే ఆపివేశాడు. రెండో చేత్తో అతని జుట్టు పట్టుకున్నాడు. గట్టిగా గుంజడంతో కంసుడు క్రింద పడ్డాడు. ఆ విధంగా పడడంతో అతని చేతిలోని కత్తి జారిపోయింది. కృష్ణుడు పిడికిలి బిగించి కంసుని గట్టిగా గుద్దాడు. ఆ దెబ్బకు కంసుడు గుడ్లు తేలేశాడు. అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. యమసదనం చేరుకున్నాడు కంసుడు. బలరాముడు కంసుని అంగరక్షకులనందరినీ తెగనరికాడు. ఒక్కడు కూడా మిగలలేదు. ఇంతలో వచ్చిన కంసుని సోదరులు బలరాముని ఎదిరించారు. బలరాముడు ఒక ఇనుపదూలాన్ని ఎత్తి వారి మీదకు విసిరాడు. వారు కూడా కంసునితోపాటు యమలోకం చేరుకున్నారు. వీరి మీదకు రావడానికి మరెవ్వరూ ధైర్యం చేయలేదు.

బలరామకృష్ణులు చెరసాలకు వెళ్ళారు. దేవకీ వసుదేవులను విడిపించారు. తాత ఉగ్రసేనుని విడిపించి తీసుకొనివచ్చి మధురానగరానికి రాజుగా పట్టాభిషేకం చేయించారు. ప్రజలందరూ ఉగ్రసేనుడు రాజయినందుకు ఆనందించారు.

# జరాసంధుని పరాజయం

మగధను పాలించే జరాసంధుడు తన కూతురును కంసునికి ఇచ్చి వివాహం చేశాడు. కృష్ణుని చేతిలో తన అల్లుడు మరణించాడని తెలిసి, కృష్ణుని చంపడానికి సైన్యంతో దండయాత్ర చేశాడు. బలరాముడు జరాసంధుని ఎదుర్కొన్నాడు. జరాసంధుడు కూడా మహావీరుడే. బలరామునికి, జరాసంధునికి యుద్ధం భీకరంగా జరిగింది. చివరకు బలరామునిదే పై చేయి అయింది. బలరాముడు జరాసంధుని నేల మీద త్రోశాడు. తన హలాయుధంతో చంపబోతుంటే కృష్ణుడతనిని ఆపి "అన్నా ! వీడిని సంహరించే వాడు వేరొక చోట ఉన్నాడు. కాలం మూడినంతనే వీడు అతని చేతిలో అంతమవక తప్పదు. అప్పటిదాకా బ్రతకనివ్వు" అన్నాడు. జరాసంధుడు అవమానభారంతో తిరిగి తన రాజ్యానికి వెళ్ళిపోయాడు.

VGS PUBLISHERS


KSS PUBLISHERS

# సాందీపుని శిష్యరికం

ఎంత గొప్పవాళ్ళయినా విద్య నేర్చుకోకపోతే ఎట్లా ? వసుదేవుడు అదే అనుకున్నాడు. బలరామకృష్ణులకు విద్యాభ్యాసం చేయించుమని నందునితో చెప్పాడు. నందుడు వారిద్దరినీ అవంతీపురంలో ఉండే సాందీపుని గురుకులంలో చేర్పించాడు. సాందీపుడు బలరామకృష్ణులకు విద్యలన్నింటిని నేర్పించాడు. ఆ కాలంలోనే కుచేలుడు అనే బ్రాహ్మణ బాలకుడు శ్రీకృష్ణునికి మిత్రుడయ్యాడు.

విద్యాభ్యాసం ముగిసిన తరువాత బలరామకృష్ణులు గురువుకు నమస్కారం చేసి, "మాకు సమస్త విద్యలు నేర్పారు. మీకు గురుదక్షిణగా ఏమి ఇవ్వాలో తెలియజేయండి" అని వేడుకున్నారు. సాందీపుడు "బాలకులారా ! మా ఒక్కగానొక్క కొడుకు సముద్ర గర్భంలో మునిగి మరణించాడు. అప్పటి నుండి పుత్రశోకంతో పరితపిస్తున్నాము. తీసుకొని రాగలిగితే నా కుమారుని తెచ్చి ఇవ్వండి" అన్నాడు కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"మీ పుత్రుని తీసుకొని వస్తాం. మీకు గురుదక్షిణ సమర్పిస్తాం" అని బలరామకృష్ణులు గురుపుత్రుని వెదుకుతూ బయలుదేరారు. సముద్రమంతా గాలించారు. కనిపించలేదు. అప్పుడు పంచజనుడనే రాక్షసుడు వీరిని అడ్డగించాడు. కృష్ణుడు అతనిని సంహరించి అతని వద్ద గల శంఖాన్ని తీసుకున్నాడు. పంచజనుడి నుంచి తీసుకున్న శంఖం కాబట్టే దానికి పాంచజన్యం అనిపేరు. అదే శ్రీకృష్ణునికి శంఖమయింది.

సముద్ర గర్భంలో గురుపుత్రుడు కనిపించలేదు. అతని కోసం గాలిస్తూ బలరామకృష్ణులు యమలోకం వెళ్ళారు. నరకద్వారం దగ్గర నిలబడి కృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. ఆ శంఖం నుంచి వెలువడిన శబ్దం ప్రళయకాలపు ప్రభంజనంలా వినిపించి యముడు బయటకు వచ్చాడు. కళ్ళ ముందు కనిపించే కృష్ణుడు విష్ణుమూర్తి అవతారమని గుర్తించాడు. ఏమి ఆశించి వచ్చారో తెలుపుమని కోరాడు. శ్రీకృష్ణుడు గురుదక్షిణ విషయం చెప్పగానే యముడు సాందీపుని కుమారుని తెచ్చి అప్పగించాడు. బలరామకృష్ణులు గురుపుత్రుని తెచ్చి సాందీపునికి అప్పగించారు. సాందీపుడు పరమానందం చెందాడు. శిష్యులిద్దరినీ ఆశీర్వదించాడు. "మిత్రమా ! ఎప్పుడయినా నన్ను కలువు" అని కుచేలునితో చెప్పి కృష్ణుడు బలరామునితో మధురకు చేరుకున్నాడు.

# ముచికుందుడు-కాలయవనుడు

ఇక్ష్వాకు ప్రభువైన మాంధాత పుత్రుడు ముచికుందుడు. ఆయన గొప్ప వీరుడు. దేవతలను బాధిస్తున్న రాక్షసులతో అనేక సంవత్సరాల పాటు యుద్ధం చేశాడు. ఆయన చేసిన యుద్ధంతో రాక్షసులు చాలామంది మరణించారు. ముచికుందుని సాయానికి దేవతలు సంతోషించారు. "రాజా!

VGS PUBLISHERS



మీ అనుగ్రహం వల్ల రాక్షసుల పీడ దూరమయింది. మేమందరం ఇప్పుడు సంతోషంగా ఉన్నాం. మీకు ప్రత్యుపకారంగా ఒక వరం ఇవ్వాలనుకుంటున్నాం. మీ కోరిక ఏమిటో సెలవివ్వండి" అన్నారు దేవతలు. అందుకు ముచికుందుడు "నాకు దీర్ఘమైన నిద్రను ప్రసాదించండి. అదే నా కోరిక" అన్నాడు. దేవతలు ఆ వరాన్ని ప్రసాదించారు. ఆనాటి నుండి ముచికుందుడు ఒక గుహలో నిద్రపోతున్నాడు. అతనికి నిద్రా భంగం కలిగితే, ఆయన చూపులవేడికి ఎంతటి వాడయినా మరణించకతప్పదు.

ఆ కాలంలో కాలయవనుడు అనే రాజు ఉండేవాడు. తన పరాక్రమంతో ఎన్నో రాజ్యాలను జయించి విర్రవీగుతూ ఉండేవాడు. అతనికి గర్వభంగం చేయాలనే ఉద్దేశంతో నారదుడు అతని వద్దకు వెళ్ళి "నువ్వు నీ పరాక్రమంతో ఎందరో రాజులను జయించావు. యాదవవీరుడైన శ్రీకృష్ణుని చూచి భయపడి ద్వారక వైపు వెళ్ళలేదు. బహుశా జరాసంధునికి జరిగినట్లు పరాభవం జరుగుతుందని భయమా ?" అని అడిగాడు. నారదుని మాటలకు కాలయవనునికి కోపం వచ్చింది. "నారదమునీ ! పిరికితనమనేది నా రక్తంలో లేనేలేదు. యాదవులు నాకు లెక్కా ! త్వరలోనే వాళ్ళను నా పాదాక్రాంతులను చేసుకుంటాను" అన్నాడు ఆవేశంగా. అందుకు నారదుడు "కృష్ణుడు నీవనుకున్నంత సామాన్యుడు కాదు. మహావీరుడే కాదు, మాయావి కూడా. అతనిని జయించడం నీకు సాధ్యం కాదు" అని రెచ్చగొట్టాడు. కాలయవనునికి కోపం వచ్చింది. వెంటనే సైన్యాన్ని సమీకరించుకొని మధురపై దండెత్తాడు.

కాలయవనుడు సైన్యంతో మధురను సమీపించినా, యాదవ సైన్యం అతనికి ఎదురు రాలేదు. కృష్ణుడొక్కడే ఆయుధాలు లేకుండా ఒంటరిగా ముందుకు వచ్చాడు. కృష్ణుడు ఒంటరిగా రావడంలోగల అర్థమేమిటో కాలయవనునికి బోధపడలేదు. ఒంటరిగా వచ్చిన కృష్ణుని బంధించడానికి కాలయవనుడు ముందుకు వచ్చాడు. కృష్ణుడు పరుగెత్తాడు. తనను చూచి భయపడి పారిపోతున్నాడని కాలయవనుడు అనుకున్నాడు. "పిరికిపందలా పారిపోతున్నావు కృష్ణా ! యుద్ధమంటే అంత భయమా ! నీవేదో గొప్ప వీరుడవని నారదుడు చెప్పాడు. ఇదేనా నీ వీరత్వం" అని ఎగతాళి చేస్తూ కృష్ణుని తరుమసాగాడు. కృష్ణుడు మందహాసం చేస్తూ ఒక కొండ గుహలోకి వెళ్ళాడు. ముచికుందుడు నిద్రపోయే గుహ అదే.

గుహలోకి వెళ్ళిన కృష్ణుడు తన చేతిలో చిక్కినట్లే అనుకుంటూ కాలయవనుడు లోపలికి వెళ్ళాడు. లోపల కృష్ణుడు కనిపించలేదు. అటూ ఇటూ పరికించాడు. నిద్రపోతున్న ఒక వ్యక్తి తప్ప అక్కడెవ్వరూ అతనికి కనిపించలేదు. కృష్ణుడే వేషం మార్చుకుని అలా నిద్ర నటిస్తున్నాడని కాలయవనుడు అనుకున్నాడు. అతని దగ్గరకు వెళ్ళి కాలుతో తన్నాడు. "ఇంక నిద్ర నటించడం చాలు – లే !" అన్నాడు. నిద్రపోతున్న వ్యక్తి ముచికుందుడు. ఆయన కళ్ళు తెరచి కాలయవనుని చూశాడు. ఆ దృక్కుల వేడికి కాలయవనుడు కాలి బూడిదయ్యాడు. కృష్ణుడు చిరునవ్వుతో గుహ బయటకు నడిచాడు. తెలివితో ఎంతటి వాడినయినా జయించవచ్చు అనుకున్నాడు కృష్ణుడు.

VGS PUBLISHERS



# రుక్మిణీ కళ్యాణం

ఆ రోజుల్లో భీష్మకుడు అనే రాజు ఉండేవాడు. అతని రాజ్యం పేరు విదర్భ. దానికి రాజధాని కుండిన నగరం. అతనికి ఐదుగురు కుమారులు. వారిలో పెద్దవాడు రుక్మి. ఒక కూతురు. ఆమె పేరు రుక్మిణి. చేదిరాజయిన శిశుపాలునికి రుక్మికి స్నేహం. మగధ భూపాలుడైన జరాసంధుడు వీరిద్దరికీ మిత్రుడు. తన చెల్లెలైన రుక్మిణిని శిశుపాలునికిచ్చి వివాహం చేయాలని రుక్మి భావించేవాడు. శిశుపాలునికి కూడా ఆమెను వివాహమాడాలని కోరిక. రుక్మిణికి కృష్ణుడు అంటే అనురాగం. రుక్మి, శిశుపాలుడు, జరాసంధుడు కృష్ణునికి శత్రువులు. అందుచేత తన మనసులోని మాటను రుక్మిణి తన అన్నతో చెప్పడానికి భయపడింది. కాని ఎలాగయినా కృష్ణుని వివాహం చేసుకోవాలని మనసులో అనుకుంటూ ఉండేది. నందుడు అప్పటికే బలరామునికి రేవతిని ఇచ్చి వివాహం చేశాడు. కృష్ణునికి కూడా వివాహం చేయాలని ఆలోచిస్తున్నాడు.

రుక్మిణికి యుక్తవయస్సు వచ్చింది. ఆమెకు వివాహం చేయాలని తండ్రి అనుకున్నాడు. రుక్మిణి కృష్ణుని వివాహం చేసుకుంటానని చెప్పింది. భీష్మకుడు అంగీకరించాడు. కాని రుక్మి అంగీకరించలేదు. శిశుపాలునికి ఇచ్చి వివాహం చేయవలసిందే అని పట్టుపట్టాడు. భీష్మకుడు ఏమీ చేయలేక మౌనం వహించాడు. రుక్మి శిశుపాలునితో రుక్మిణి వివాహానికి ముహూర్తం నిర్ణయించాడు. ఆ విషయం తెలిసి రుక్మిణి బాధపడింది. ఎలాగయినా తన ప్రేమను కృష్ణునికి తెలియజేస్తే బాగుంటుంది అనిపించింది. అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడు రుక్మిణికి తెలుసు. అతడు రుక్మిణి శ్రేయస్సును కోరేవాడు. అతనిని పిలిపించి "బ్రాహ్మణోత్తమా ! మీరు ద్వారకా నగరం వెళ్ళండి. నేను తనను ప్రేమిస్తున్నానని కృష్ణునికి తెలియజేయండి. శిశుపాలునితో వివాహానికి పూర్వమే వచ్చి నన్ను తీసుకొనివెళ్ళమని మనవి చేయండి" అని చెప్పి ద్వారకా నగరం పంపించింది. అగ్నిద్యోతనుడు ద్వారకా నగరం వెళ్ళాడు. రుక్మిణి ప్రేమను కృష్ణునికి తెలియజేశాడు. వెంటనే తిరిగివచ్చి కృష్ణుడు తప్పక వచ్చి తీసుకొని వెళతాడని రుక్మిణికి చెప్పాడు. రుక్మిణి ఆనందంతో కృష్ణుని రాక కోసం ఎదురు చూడసాగింది.

విదర్భలో పెళ్ళి పనులు ప్రారంభమయ్యాయి. శిశుపాలుడు వివాహం కోసం బంధు మిత్రులతో విదర్భకు తరలివచ్చాడు. కృష్ణుడు వస్తాడనే విషయం విదర్భలో ఎవరికీ తెలియదు. భీష్మకుని ఇంటి ఆచారం ప్రకారం పెళ్ళికి ముందురోజు వధువు గౌరీదేవి ఆలయంలో పూజలు చేయాలి. గౌరీదేవి ఆలయం నగరానికి వెలుపల ఉంది. ఆచారం ప్రకారం రుక్మిణి గౌరీదేవి ఆలయానికి వచ్చింది. గౌరీదేవికి పూజలు చేసింది. దేవాలయం నుండి బయటకు రాగానే ఎదురుగా కృష్ణుడు కనిపించాడు. చేయి ఊతగా ఇచ్చి రుక్మిణిని తన రథంపై ఎక్కించుకున్నాడు. ద్వారకా నగరానికి రుక్మిణిని తీసుకొని వెళ్ళసాగాడు.

VGS PUBLISHERS



రుక్మిణిని తీసుకొని కృష్ణుడు వెళుతున్నాడనే వార్త రుక్మికి తెలిసింది. విడిదిలో ఉన్న శిశుపాలునికీ తెలిసింది. శిశుపాలుడు తన మిత్రుడైన జరాసంధుని తీసుకొని సైన్యంతో బయలు దేరాడు. రుక్మి తన సైన్యంతో కృష్ణుని రథాన్ని వెంబడించాడు. తనను వెన్నంటి వస్తున్న శత్రువులను కృష్ణుడు గమనించాడు. రథాన్ని నడుపుమని రుక్మిణికి పగ్గాలు అందించాడు. ధనుస్సును చేబూనాడు. బాణాలు ప్రయోగించాడు. శిశుపాలుడు, జరాసంధుడు ఓడిపోయారు.

కృష్ణుని శరానికి రుక్మి చేతిలో విల్లు విరిగిపోయింది. మరొక బాణానికి సారథి చనిపోయాడు. మరొక బాణానికి రథం ముక్కలయింది. రుక్మిని హతమార్చడానికి కృష్ణుడు ఆయుధాన్ని ప్రయోగిస్తుంటే రుక్మిణి "స్వామీ ! మీ ప్రతాపం తెలియక నా అన్న మిమ్ము ఎదిరించాడు. అతనిని చంపితే నా తల్లిదండ్రులు పుత్రశోకంతో దుఃఖిస్తారు. దయతో నా అన్నను విడిచిపెట్టండి" అని ప్రార్థించింది. "నీ కోరిక తీరుస్తాను" అని కృష్ణుడు రుక్మిణికి మాట ఇచ్చాడు.

క్రిందపడి ఉన్న రుక్మిని కృష్ణుడు పట్టుకున్నాడు. తల గొరిగి పంపించాడు. రుక్మిణితో ద్వారకా నగరం చేరుకున్నాడు. రుక్మిణీ కృష్ణులకు నందుడు వైభవంగా వివాహం జరిపించాడు. లక్ష్మీదేవి అవతారమైన రుక్మిణీదేవి, శ్రీహరి అవతారమైన కృష్ణుని చేరుకుంది.

# అష్టమహిషులు

సత్రాజిత్తు సూర్యుని ప్రార్థించి, ఆయనను మెప్పించి శమంతకమణి అనే రత్నాన్ని పొందాడు. ఆ మణి రోజుకు నూరు బారువుల బంగారాన్ని ఇస్తుంది. ఆ కారణంగా సత్రాజిత్తు బాగా ధనవంతుడయ్యాడు. ఆ విషయం తెలిసిన శ్రీకృష్ణుడు ఆ రత్నాన్ని తనకివ్వమని, అది ప్రభువు దగ్గరుంటే ప్రజలకు ఎన్నో సౌకర్యాలు కల్పించవచ్చునని చెప్పాడు. కాని సత్రాజిత్తు అంగీకరించలేదు. ఇవ్వనని చెప్పాడు.

సత్రాజిత్తుకు ప్రసేనజిత్తు అనే సోదరుడు ఉన్నాడు. అతడొకనాడు శమంతకమణిని ధరించి అడవికి వెళ్ళాడు. అడవిలో ఒక సింహం ప్రసేనజిత్తును చంపి ఆ మణిని నోట కరచుకొని వెళ్ళిపోయింది. ఆ సింహాన్ని చంపి జాంబవంతుడనే భల్లూక రాజు ఆ మణిని తీసుకొని వెళ్ళి తన కూతురు జాంబవతికి ఇచ్చాడు. వేటకోసం అడవికి వెళ్ళిన తన తమ్ముడు రాకపోవడంతో సత్రాజిత్తు కృష్ణుడే శమంతకమణి కోసం తన తమ్ముని హత్య చేశాడని ఆరోపించాడు. ఆ నింద నిజం కాదని నిరూపణ చేసుకోవడానికి కృష్ణుడు అడవికి వెళ్ళాడు. ఒకచోట ప్రసేనజిత్తు కళేబరం కనబడింది. అక్కడే కనిపించిన సింహం కాలిజాడలను అనుసరించిపోగా, ఎలుగుబంటి పాదముద్రలు కనిపించాయి. వాటిని అనుసరించి వెళ్ళి ఒక గుహను చేరుకున్నాడు. ఆ గుహలోనే జాంబవతి దగ్గర శమంతకమణిని చూశాడు. ఆ మణి కృష్ణుడు తీసుకోబోయాడు. జాంబవతి పెద్దగా ఏడ్చింది. ఆ ఏడుపు విని జాంబవంతుడు అక్కడికి వచ్చాడు. కృష్ణునితో పోరాటం మొదలుపెట్టాడు. కృష్ణునికి జాంబవంతునికి యుద్ధం కొన్ని రోజులపాటు జరిగింది. జాంబవంతుడు అలసిపోయాడు. వచ్చినవాడు అవతారపురుషుడని గ్రహించాడు. ఒకప్పుడు తనకు మాట ఇచ్చిన రాముడే ఇప్పుడీ రూపంలో వచ్చాడని తెలుసుకున్నాడు. జాంబవతితో పాటు శమంతకమణిని అప్పగించాడు. కృష్ణుడు జాంబవతిని భార్యగా గ్రహించాడు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

శమంతకమణిని తీసుకొని జాంబవతిని వెంటబెట్టుకొని కృష్ణుడు సత్రాజిత్తును కలిసి, మణిని అందజేశాడు. జరిగిన వృత్తాంతాన్ని వివరించాడు. తొందరపడి నింద వేశానని సత్రాజిత్తు కృష్ణుని క్షమాపణలు వేడుకున్నాడు. తన పుత్రిక సత్యభామను భార్యగా స్వీకరింపుమని, దానితో పాటు శమంతకమణిని తీసుకొమ్మని ప్రార్థించాడు. కృష్ణుడు శమంతకమణిని తీసుకోడానికి అంగీకరించలేదు. సత్యభామను గ్రహించడానికి అంగీకరించడంతో, సత్రాజిత్తు కృష్ణుని కాళ్ళు కడిగి సత్యభామను కన్యాదానం చేశాడు. కృష్ణుడు సత్యభామతో, జాంబవతితో ద్వారకా నగరం చేరుకున్నాడు. ఆ తరువాత కృష్ణుడు నాగ్నజితి, మిత్రవింద, లక్షణ, కాళింది, భద్ర అనే యువతులను వివాహమాడాడు. తన ఎనిమిది మంది భార్యలతో సుఖంగా జీవించసాగాడు.

# నరకాసుర వధ-దీపావళి

ప్రాగ్జ్యోతిషపురాన్ని నరకాసురుడు అనే రాజు పాలించేవాడు. అతడు దుర్మార్గుడు. మునులను బాధించేవాడు. దేవతలను పారద్రోలి అమరావతిని కైవసం చేసుకున్నాడు. పదహారువేలమంది కన్యలను చెరపట్టి వారిని చెరసాలలో ఉంచాడు. దేవతలు నరకాసురుని వలన బాధ లేకుండా చేయుమని కృష్ణుని ప్రార్థించారు. నరకాసురుని పీడ తొలగించుమని పదహారువేలమంది కన్యలు కృష్ణుని తమ మనస్సుల్లోనే వేడుకున్నారు.

నరకాసురుని సంహరించడానికి కృష్ణుడు బయలుదేరాడు. సత్యభామ కూడా వస్తానంటే ఆమెను కూడా వెంటపెట్టుకొని వెళ్ళాడు. నరకాసురునితో యుద్ధం భయంకరంగా జరిగింది. నరకుడు ప్రయోగించిన అస్త్రంతో కృష్ణుడు మూర్ఛపోయాడు. వెంటనే సత్యభామ విల్లందుకుని నరకునితో పోరాటం సాగించింది. కాసేపటికి కృష్ణునికి తెలివి వచ్చింది.సత్యభామ యుద్ధ నైపుణ్యం చూచి కృష్ణుడు ముచ్చటపడ్డాడు. ఆమెను మెచ్చుకుంటూ తన సుదర్శన చక్రాన్ని నరకునిపై ప్రయోగించాడు. అది నరకాసురుని సంహరించింది. కృష్ణుడు వెంటనే చెరసాలలో ఉన్న పదహారువేలమంది కన్యలను చెర నుండి విడిపించాడు. తమ తమ దేశాలకు వెళ్ళమని చెప్పాడు. వారందరూ కృష్ణునితోనే ఉంటామని, తమ కోరిక మన్నించుమని వేడుకున్నారు. కృష్ణుడు అంగీకరించి వారందరినీ వివాహం చేసుకున్నాడు.

నరకాసురుడు ఇంద్రుని ఓడించి అతనివద్ద ఉన్న అదితి కుండలాలను తీసుకొనివచ్చాడు. కృష్ణుడు ఆ కుండలాలను తీసుకొనివెళ్ళి ఇంద్రునికి అందజేశాడు. స్వర్గానికి వెళ్ళినపుడు పారిజాతపు వాసన చూచిన సత్యభామ ఆ చెట్టు తన పెరటి చెట్టుగా కావాలని అడిగింది. కృష్ణుడు ఇంద్రుని అడిగి పారిజాతవృక్షాన్ని తెచ్చి సత్యభామ పెరటిచెట్టుగా నాటించాడు.

నరకాసురుడు మరణించిన రోజు ఆశ్వయుజమాసం బహుళ చతుర్దశి. మరునాడు అమావాస్య. నరకాసురుడు మరణించినందుకు ప్రజలు సంతోషించారు. దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి పండుగ చేసుకున్నారు. అదే దీపావళి అమావాస్య.

VGS PUBLISHERS



# జరాసంధ వధ

జరాసంధుడు శిశుపాలునికి మిత్రుడు. మగధ సామ్రాజ్యానికి అధిపతి. గొప్ప బలవంతుడు. కృష్ణుడు రుక్మిణిని తీసుకొనివెళ్ళి రాక్షసవివాహం చేసుకున్న సందర్భంలో శిశుపాలుని పక్షంలో యుద్ధం చేసినా ఓడిపోయాడు. అప్పటి నుండి ఎలాగయినా కృష్ణుని ఓడించాలని అతని ఆలోచన.

నరనారాయణులే అర్జుననిగా, కృష్ణునిగా జన్మించారు గదా ! వారిద్దరూ పరస్పరం ప్రాణమిచ్చుకొనేటంత ఆప్తులయ్యారు. అర్జునుడే కాదు, పాండవులందరూ కృష్ణుని తమకు ఆత్మీయునిగా భావించి, అతని సూచన మేరకే ఏ పనినయినా నిర్వహించేవారు. పాండవుల అధికారాన్ని సుస్థిరం చేయాలంటే ధర్మరాజు చేత రాజసూయయాగం చేయించాలని కృష్ణుడు తలపోశాడు. ధర్మరాజుతో రాజసూయయాగం నిర్వహించుమని, తద్వారా రాజులందరిని ఓడించి రాజ్యాన్ని విస్తరించుకోమని చెప్పాడు. ధర్మరాజు అంగీకరించాడు.

రాజసూయం ప్రారంభమయింది. ఎందరో రాజులు ధర్మరాజుకు సామంతులుగా ఉండడానికి అంగీకరించారు. అంగీకరించనివారిని పాండవులు యుద్ధంలో ఓడించారు. జరాసంధుని ఓడించాలంటే మాయోపాయమే మార్గమని కృష్ణునికి తెలుసు. అందుచేతనే భీమార్జునులను తీసుకొని బ్రాహ్మణ వేషాలలో మగధలో ప్రవేశించాడు. జరాసంధుని యుద్ధానికి రమ్మని ఆహ్వానించాడు. తాను భీమునితో యుద్ధం చేస్తానన్నాడు జరాసంధుడు. ఇద్దరికీ మల్లయుద్ధం ప్రారంభమయింది.

భీమ జరాసంధులు భీకరంగా పోరాడుతున్నారు. భీముడు జరాసంధుని క్రింద పడవేశాడు. ఒక కాలుపై తన కాలు ఉంచి, రెండవ కాలును పైకి లేపి జరాసంధుని రెండు భాగాలుగా చీల్చి దూరంగా విసిరివేశాడు. ఆ రెండు భాగాలు తిరిగి కలుసుకున్నాయి. ఎన్నిసార్లు జరాసంధుని రెండు ముక్కలుగా చేసి దూరంగా విసిరినా ఆ భాగాలు కలుసుకోవడం, జరాసంధుడు తిరిగి బ్రతకడం జరుగుతూనే ఉన్నాయి. దానికి కారణం 'జర' అనే రాక్షసి. రెండు ఖండాలుగా పుట్టిన జరాసంధుని కలిపి 'జర' బ్రతికించింది. ఆమె కారణంగానే ఇప్పుడు కూడా రెండు భాగాలు కలుసుకుంటున్నాయి. అతనిని చంపాలంటే కేవలం శారీరక బలం సరిపోదని, బుద్ధిబలం కావాలని కృష్ణునికి తెలుసు. భీమునికి తెలియదు. అందుచేత ఈసారి శరీరాన్ని చీల్చినప్పుడు శరీర ఖండాలను వ్యతిరేక దిశలో వేయుమని కృష్ణుడు సైగ చేశాడు. కృష్ణుని భావాన్ని గ్రహించి భీముడు ఈసారి జరాసంధుని చీల్చి, భాగాలను వ్యతిరేక దిశలో వేశాడు. దానితో శరీర భాగాలు కలుసుకోలేకపోయాయి. జరాసంధుడు మరణించాడు. మగధ రాజ్యం ధర్మరాజుకు వశమయింది. రాజసూయం నిర్విఘ్నంగా జరిగింది.

VGS PUBLISHERS



# శిశుపాల వధ

ధర్మరాజు చేస్తున్న రాజసూయ యాగానికి దేశంలోని రాజులందరూ వచ్చారు. కౌరవులు, కర్ణుడు, శకుని, సైంధవుడు, శిశుపాలుడు, అతని సోదరుడు దంతవక్త్రుడు, పెద్దలైన భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, గురుపుత్రుడు అశ్వత్థామ, విదురుడు మొదలైనవారందరూ సభలో ఆసీనులయ్యారు. బంధుమిత్రులు, సామంత పురోహితులు, పండితులు, నీతి కోవిదులు కూడా సభకు వచ్చారు. యాగం పూర్తి అయిన తరువాత మీకు ఆప్తుడయిన ఒక మహాత్ముని పూజించాలని భీష్ముడు ధర్మరాజుకు సూచించాడు. అటువంటి మహాత్ముడెవడో చెప్పుమని ధర్మరాజనగా భీష్ముడు విష్ణుమూర్తి అవతారమయిన శ్రీకృష్ణుడే అందుకు అర్హుడని చెప్పాడు.

పాండవులు అగ్రతాంబూలం ఇచ్చి పూజించడానికి శ్రీకృష్ణుని ఆసనం మీదికి సగౌరవంగా తీసుకొనివెళ్ళారు. తనకు దక్కవలసిన రుక్మిణిని అపహరించుకుని పోయిన కృష్ణుని పాండవులు సభలో పూజించాలనుకోవడం శిశుపాలునికి నచ్చలేదు. "పశువులు కాసుకొనేవాడికి పూజా ? ముసలితనంలో మతిచెడి భీష్ముడు చెప్పినంత మాత్రం చేత మీరు ఈ గొల్లవానిని పూజిస్తారా? ఇది సభలో ఉన్న రాజులందరిని అవమానించడమే ! దీనిని మేము అంగీకరించం" అంటూ శిశు పాలుడు నిండు సభలో భీష్ముని, కృష్ణుని నిందించాడు.

కృష్ణుడు "శిశుపాలా ! నీ తల్లి నీవు చేసిన నూరు తప్పులు క్షమింపుమని నన్ను వేడుకుంది. ఆమెకు సరేనని మాట ఇచ్చాను. ఇప్పటితో నీ వంద తప్పులు పూర్తయ్యాయి. ఇక నీకు మరణం తప్పదు" అంటూ తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. ఆ చక్రం శిశుపాలుని తలను ఛేదించింది. శిశుపాలుని తమ్ముడు దంతవక్త్రుడు శ్రీకృష్ణుని మీదికి రాబోయాడు. అతనిని కూడా సుదర్శన చక్రం హతమార్చింది.

శిశుపాల, దంతవక్త్రులుగా జన్మించిన జయవిజయులు మూడవ జన్మలో కూడా విష్ణువుకు శత్రువులుగా పుట్టి అతని చేతిలో హతమయ్యారు. దీనితో వారి శాపం పూర్తయింది. తిరిగి వారు వైకుంఠం చేరుకున్నారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

# కుచేలోపాఖ్యానం

సాందీపుని వద్ద విద్యాభ్యాసం చేసే రోజుల్లో కృష్ణునికి కుచేలుడనే బ్రాహ్మణ కుమారునితో స్నేహం ఉందని చెప్పుకున్నాం గదా ! కృష్ణుడు పెరిగి పెద్దయినట్లే కుచేలుడు పెరిగి పెద్దయ్యాడు. వివాహం చేసుకున్నాడు. సంతానం కూడా అధికంగానే ఉంది. దానితో సంసారం నిర్వహించు కోవడం కష్టమయింది. పిల్లలకు పాలుగాని, సరియైన ఆహారంగాని, మంచి బట్టలు గాని ఇచ్చే స్థోమత అతనికి కరువయింది. యాచన చేసి కుచేలుడు తెచ్చే బియ్యం ఒక పూటకు సరిపోతే రెండో పూట పస్తులుండవలసిన పరిస్థితి దాపురించింది. కుచేలుని ఇల్లాలు తమ పరిస్థితికి బాధపడిందే గాని కుచేలుని సాధించేదికాదు.

పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే చూడలేని ఆ ఇల్లాలు కుచేలునితో "పిల్లలు బాధపడడం మీరు చూస్తున్నారు. మీరు ఏమీ అనుకోకపోతే ఒక చిన్నమాట చెపుతాను. మీరు ఎప్పుడూ శ్రీకృష్ణుడు మీ బాల్యమిత్రుడని అంటూ ఉంటారు గదా ? ఒకసారి ఆయనను దర్శిస్తే మన దరిద్రం తీరే దారి చెపుతాడేమో !" అని మెల్లగా చెప్పింది. ఆమె మాటలు సముచితమే అని కుచేలుడు అనుకున్నాడు. ఒక మంచి రోజు చూచుకొని శ్రీకృష్ణుని దర్శనానికి బయలుదేరాడు. "రాజ దర్శనానికి ఒట్టి చేతులతో వెళ్ళకూడదు. ప్రస్తుతానికి ఇంట్లో ఈ అటుకులు తప్ప వేరేమీ లేవు. ఈ అటుకులు తీసుకొని వెళ్ళండి" అంటూ ఆమె అతని ఉత్తరీయానికి వాటిని మూట కట్టింది. కుచేలుడు ద్వారకకు వెళ్ళాడు.

అంతఃపుర కాంతలతో ముచ్చటలాడుతున్న శ్రీకృష్ణుడు కుచేలుడు తన కోసం వచ్చాడని తెలిసి ముఖద్వారం వద్దకు ఎదురుగావచ్చి అంతఃపురంలోనికి స్వయంగా తానే తీసుకొనివెళ్ళాడు. తన భార్యల చేతే అతనికి అతిథి సత్కారాలు చేయించాడు. తన ప్రక్కన కూర్చుండబెట్టుకొని "మిత్రమా ! నా కోసం ఏమి తెచ్చావు ?" అని అడిగాడు. కృష్ణుని దేవేరుల ముందు అటుకుల మూటను విప్పడానికి కుచేలుడు సందేహించాడు. "ఏదీ కొంగున ఏదో కట్టుకొని వచ్చావు. చూపించు" అంటూ కృష్ణుడే అతని కొంగున కట్టి ఉన్న మూటను విప్పి "మిత్రమా ! నాకు అటుకులు అంటే చాలా ఇష్టమని ఇంకా గుర్తుంచుకున్నావు. అవే తెచ్చావు. నాకు పరమానందంగా ఉంది" అంటూ రెండు గుప్పిళ్ళు తీసుకొని తిన్నాడు. మిగిలినవి రుక్మిణికి ఇచ్చాడు.

కృష్ణుడు, కుచేలుడు ఆ రోజంతా తమ చిన్ననాటి ముచ్చట్లు గుర్తుచేసుకుంటూ, సాందీపుని ఆశ్రమంలో తాము పొందిన అనుభవాలను నెమరు వేసుకుంటూ గడిపారు. మరునాటి ఉదయం కృష్ణుడు ద్వారం వద్దకు వచ్చి కుచేలుని సాగనంపాడు. కృష్ణుడు తనతోపాటు ఒక రోజంతా గడపడమే అదృష్టంగా భావించుకున్న కుచేలుడు తనకు సాయం చేయుమని అడగలేక పోయాడు. కృష్ణుడు కూడా అతనికి సాయం చేస్తానని చెప్పలేదు.

తిరిగి తన గ్రామానికి వెళ్ళిన కుచేలునికి ఆ ఊళ్ళో తన ఇల్లు కనిపించలేదు. తన ఇల్లు ఉండవలసిన చోట పెద్ద భవనం, దానిచుట్టూ తోట, అక్కడక్కడా పనివారు కనిపించారు. "దారి

VGS PUBLISHERS


VGS PUBLISHERS

తప్పి మరొక ఊరుకు వచ్చానేమో" అనుకుంటున్నంతలో సేవకులు అతనిని ఇంట్లోకి ఆహ్వానించారు. పట్టు వస్త్రాలు, రత్నాభరణాలు ధరించిన ఒక ముత్తైదువ కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆశ్చర్యంతో కుచేలుడు ఆమెను పరీక్షగా చూసి ఆమె తన భార్యయేనని గ్రహించాడు. "ఏమిటిదంతా?" అని కుచేలుడు అడగగానే "శ్రీకృష్ణ పరమాత్మ వారి దయ స్వామీ !" అన్నది ఆయన భార్య.

కుచేలుని శరీరం కృతజ్ఞతా భావంతో పులకరించిపోయింది. అడగకుండానే అష్టైశ్వర్యాలు ప్రసాదించిన శ్రీకృష్ణుని కరుణార్ద్రహృదయానికి మనస్సులోనే శతకోటి వందనాలు సమర్పించు కున్నాడు. శ్రీకృష్ణ పరమాత్మనే ఆత్మలో నిలుపుకొని జీవితాంతం భక్తి భావంతో జీవించాడు. మరణానంతరం కుచేలునికి శ్రీహరి వైకుంఠవాసం కల్పించాడు.

# ప్రభావతీ ప్రద్యుమ్నం

రుక్మిణి కృష్ణుల కుమారుడు ప్రద్యుమ్నుడు. అతడు పూర్వజన్మలో మన్మథుడు. కృష్ణునికి పుత్రునిగా జన్మించినప్పుడు కూడా ఎంతో అందగాడు. వజ్రనాభుడనే రాక్షసరాజు కూతురు ప్రభావతి.

వజ్రనాభుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. తనను ఎవ్వరూ గెల్వలేకుండా వరాలను పొందాడు. అతని పురము వజ్రనాభపురం. దానిలోకి ప్రవేశించడానికి ఇతరులకు సాధ్యం కాదు. అతని కూతురు ప్రభావతి పార్వతి దయచే జన్మించింది. పార్వతే ప్రభావతికి ప్రద్యుమ్నుడు భర్త అని నిర్దేశించింది. ఒక చిలుక ప్రభావతికి ప్రద్యుమ్నునికి రాయబారం నిర్వహించి, పరస్పరం ప్రేమికులయ్యే విధంగా చేసింది. శ్రీకృష్ణుడు వారి ప్రేమవృత్తాంతాన్ని తెలుసుకొని వారిద్దరికీ వివాహం జరిపించాడు.

రుక్మిణి సోదరుడు రుక్మి ఉన్నాడు గదా ! అతని కూతురు రుక్మవతి. రుక్మి ఆమెకు స్వయంవరం చాటించాడు. ఆ విషయం తెలిసి ప్రద్యుమ్నుడు రుక్మి నగరానికి వెళ్ళి, స్వయంవరానికి వచ్చిన రాజులందరిని ఓడించి రుక్మవతిని ద్వారకకు తీసుకొనివచ్చాడు. కృష్ణుడు వారిద్దరికీ పెండ్లి జరిపించాడు.

# ఉషాపరిణయం

బలిచక్రవర్తికి వందమంది కుమారులు. వారిలో బాణాసురుడు పెద్దవాడు. గొప్ప వీరుడు. బలవంతుడు. అతని కూతురు ఉష. ఆమె కలలో శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధుని చూసింది. అతనిని ప్రేమించింది. కలలో కనిపించిన అనిరుద్ధుడు ఇలలో ఎక్కడ ఉంటాడో తెలుసుకోమని తన చెలికత్తెకు చెప్పింది. చెలికత్తె అనిరుద్ధుని వివరాలు సేకరించి ఉషకు చెప్పింది. ఆమెకు రాక్షసులకు ఉచితమైన మాయలు ఎన్నో తెలుసు. ఆమె తన చెలికత్తెను పంపించి నిద్రపోతున్న

VGS PUBLISHERS


VGS PUBLISHERS

అనిరుద్ధుని అసురమాయతో తన అంతఃపురానికి తెప్పించింది. తన ప్రేమను వ్యక్తం చేసి అతనిని తన సొంతం చేసుకుంది. ఈ విషయాలేవీ బాణాసురునికి తెలియవు.

ఉషానిరుద్ధులు ఏకమయ్యారు. ఆనందంగా అంతఃపురంలో విహరించసాగారు. కొంతకాలానికి ఉష గర్భవతి అయింది. అప్పుడు బాణాసురుడు తన కూతురు విషయం గ్రహించి ఆశ్చర్యపోయాడు. వెంటనే అంతఃపురానికి వెళ్ళి అనిరుద్ధుని బంధించాడు. అనిరుద్ధుడు కనిపించకపోవడంతో బలరామకృష్ణులు ఆందోళన చెందారు. నారదునివలన అనిరుద్ధుడు బాణాసురునికి బందీగా ఉన్నాడని తెలుసుకున్నారు.

బాణాసురుడు శివభక్తుడు. తన భక్తితో శివుని నుండి వరాలు పొందినవాడు. కృష్ణుడు తన సైన్యంతో బాణాసురుని మీదికి దండెత్తాడు. వారిద్దరికీ జరిగిన యుద్ధంలో శివుడు స్వయంగా వచ్చి బాణాసురునికి అండగా నిలబడ్డాడు. శ్రీకృష్ణుడు బాణాసురుని సంహరించడానికి సుదర్శన చక్రాన్ని పంపించాడు. అది బాణాసురుని చేతులు నాలుగింటిని తప్ప మిగతా వాటిని ఖండించింది. బాణాసురుడు ఏమీ చేయలేకపోయాడు. బాణాసురుని విడిచిపెట్టుమని శివుడు కృష్ణునికి నచ్చచెప్పాడు. శ్రీకృష్ణుడు అంగీకరించాడు. బాణాసురుడు కూడా శివుని అనుజ్ఞతో కృష్ణునకు నమస్కరించాడు. తగిన మర్యాదలు చేసి, ఉషను, అనిరుద్ధుని పిలిపించి, వారికి వైభవంగా వివాహం చేశాడు. నవదంపతులను తీసుకొని కృష్ణుడు ద్వారకకు తిరిగివచ్చాడు.

# పౌండ్రకవాసుదేవుని వృత్తాంతం

వాసుదేవుడు అనే రాజు కరూశం అనే రాజ్యానికి ప్రభువు. పౌండ్రక వంశంలో పుట్టడం చేత అతనిని పౌండ్రక వాసుదేవుడు అని పిలిచేవారు. ఇతనికి కృష్ణుడంటే గిట్టదు. కృష్ణుని కంటె తానే గొప్ప అని అతని అభిప్రాయం. తన రాజ్యంలో కృష్ణుని ఎవరూ పూజించకూడదని, తనను మాత్రమే పూజించాలని ఆయన ఆదేశాలు జారీచేశాడు. అంతేకాకుండా అతడు కూడా కృష్ణుని లాగానే నెమలిపింఛం ధరించేవాడు. చేతిలో వేణువు ధరించేవాడు. వస్త్రధారణ చేసుకునేవాడు. చక్రమొకదాన్ని చేతిలో తిప్పుకుంటూ ఉండేవాడు. తానే నిజమైన వాసుదేవుడని, కృష్ణుడు తనను అనుకరిస్తున్నాడని ప్రచారం చేసుకునేవాడు.

బలరాముడు విహారానికి వెళ్ళినప్పుడు పౌండ్రకుడు ఒక దూతను పంపి శ్రీకృష్ణుని గురించి నిందావాక్యాలు చెప్పించాడు. బలరాముడు ఈ విషయమంతా శ్రీకృష్ణునికి తెలిపాడు. కృష్ణుడు వెంటనే పౌండ్రకుని మీద యుద్ధం ప్రకటించాడు. యుద్ధానికి కూడా పౌండ్రకుడు కృష్ణుని వేషాన్ని ధరించివచ్చాడు. అతని వేషధారణ చూచి కృష్ణుని వెంట వచ్చిన వారందరూ ఎగతాళిగా నవ్వసాగారు. వారి పరిహాసాన్ని సహించలేక పౌండ్రకుడు యుద్ధానికి తయారయ్యాడు. వేషం ధరించినంత మాత్రం చేత పరాక్రమం రాదు గదా ! యుద్ధం మొదలైన కాసేపటికే కృష్ణుడు అతనిని సంహరించాడు.

VGS PUBLISHERS



తనకు శత్రువుగా వ్యవహరించినప్పటికీ, తన వేషాన్ని అనుకరిస్తూ, తనలాగే కనిపించాడు కాబట్టి కృష్ణుడతనికి మోక్షాన్ని ప్రసాదించాడు.

# సుభద్రా పరిణయం

సుభద్ర బలరామకృష్ణులకు చెల్లెలు. ఆమెను దుర్యోధనునికిచ్చి, వివాహం చేయాలని బలరాముని ఆలోచన. మహావీరుడయిన అర్జునునికిచ్చి పెళ్ళి చేయడం కృష్ణునికి ఇష్టం. సుభద్ర కూడా అర్జునుని ప్రేమించింది. అతనినే భర్తగా కోరుకుంది.

బలరామునికి యతులంటే గౌరవం. అందుచేత తీర్థయాత్రలు చేస్తున్న అర్జునుని యతి రూపంలో కృష్ణుడు ద్వారకకు రప్పించాడు. బలరాముని కలిసేవిధంగా చేశాడు. అర్జునుడు నిజమైన యతిగా బలరాముడు నమ్మి, సుభద్రను అర్జునునికి సేవలు చేయడానికి నియోగించాడు. తన వద్దకు వచ్చిన సుభద్రకు తాను ఎవరో చెప్పి, తన ప్రేమను వ్యక్తం చేశాడు అర్జునుడు. బలరాముడు వేరొక చోటికి వెళ్ళిన సందర్భంలో కృష్ణుడు సుభద్రార్జునులకు వివాహం జరిపించాడు. వారిద్దరిని ఇంద్రప్రస్థానికి పంపించాడు. యాదవులు అర్జునుని అడ్డగించడానికి ప్రయత్నించారు గాని అర్జునుడు వారిని ఓడించి, సుభద్రను తీసుకొని వెళ్ళాడు.

చెల్లెలైన సుభద్ర మనస్సు తెలుసుకుని, ఆమెను ప్రేమించినవానికిచ్చి వివాహం జరిపించి, సోదరిపై తనకెంత అనురాగముందో కృష్ణుడు తెలియజేశాడు.

# కృష్ణమహిమ గ్రహించిన నారదుడు

ఒకరోజు నారదుడు ద్వారకకు వచ్చాడు. కృష్ణుడు అంతమంది భార్యలతో సుఖంగా ఉండడం చూచి ఆశ్చర్యపోతాడు. ఆ రహస్య మేమిటో తెలుసుకుందామని కృష్ణుని దర్శించి "ఇంతమంది భార్యలతో కాపురం చేస్తూ సుఖంగా ఎలా ఉంటున్నావు ?" అని అడిగాడు. "ఆ సంగతి నా భార్యలను అడిగి తెలుసుకో ! ఏదయినా అనుమానం ఉంటే పదహారు వేలమందిని పెండ్లాడాను కదా ! వారిని కూడా అడిగి తెలుసుకో ! తెలుసుకున్న విషయం నాకు కూడా చెప్పు" అన్నాడు శ్రీకృష్ణుడు. అలాగే అంటూ నారదుడు వెళ్ళిపోయాడు. నారదుడు రుక్మిణి ఇంటికి వెళ్ళాడు. కృష్ణుడు అక్కడే ఉన్నాడు. వచ్చిన నారదునికి ఇద్దరూ ఆసనం చూపి మర్యాద చేశారు. శ్రీకృష్ణుడు అక్కడే ఉన్నప్పుడు తన అనుమానాన్ని ఆమె ముందు వ్యక్తం చేయకూడదనుకున్నాడు. సెలవు తీసుకొని నేరుగా సత్యభామ ఇంటికి వెళ్ళాడు. కృష్ణుడు రుక్మిణీ గృహంలో ఉన్నాడు కాబట్టి సత్యభామను కృష్ణుని ప్రేమను గురించి అడగవచ్చు అనుకున్నాడు. సత్యభామ అతనిని గౌరవించి అతిథి మర్యాదలు చేసింది. నారదుడు "తల్లీ ! సత్యభామా ! నేను రుక్మిణి ఇంటికి

VGS PUBLISHERS


VGS PUBLISHERS

వెళ్ళివస్తున్నాను. ఆయనకు రుక్మిణి అంటే ఇష్టం కదా ! అందుకే కాబోలు ఆమె మందిరంలోనే ఉన్నాడు. ఎప్పుడూ అక్కడే ఉంటాడా ? నీ వద్దకు ఎప్పుడు వస్తాడు ?" అంటూ ప్రశ్నించాడు.

"మునీంద్రా ! నాకు, నా భర్తకు పొరపొచ్చాలు పెట్టడానికి వచ్చారా ? వారు నా మందిరంలో ఉంటే రుక్మిణి మందిరంలో ఉన్నాడని అబద్ధాలు చెపుతారా ? రండి. చూపుతాను" అంటూ శయన మందిరంలో నిద్రపోతున్న శ్రీకృష్ణుని చూపించింది. చీవాట్లు పెట్టి పంపించింది. నారదునికి మతిపోయినంత పనయింది. బహుశా తన కంటె ముందు కృష్ణుడు సత్యభామ గృహానికి వచ్చి ఉంటాడని నారదుడు అనుమానించాడు. జాంబవతి వద్దకు వెళితే అసలు సంగతి బయటపడుతుందని ఆమె ఇంటికి వెళ్ళాడు.

తనకు ఆహ్వానం పలికిన జాంబవతితో కుశల ప్రశ్నలయిన తరువాత నారదుడు కృష్ణుని గురించి ప్రశ్నించాడు. "నారద మునీంద్రా ! మిమ్ము కలహ భోజనులని ఎందుకంటారో ఇప్పుడు నాకు అర్థమయింది. కలహం పెట్టడానికి నేనూ, నా పతే దొరికామా ? భార్యాభర్తల మధ్య తగాదాలు సృష్టించడం మంచిది కాదు" అని హితవు చెప్పి తన ఇంట్లో కృష్ణుని చూపించింది.

నారదుడు కృష్ణుని దేవేరులతో పాటు పదహారువేలమంది భార్యల వద్దకు వెళ్ళాడు. ప్రతి ఇంట్లో కృష్ణుడు ఉన్నట్లు గ్రహించాడు. తన తప్పును గ్రహించాడు. శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి "అంతా కృష్ణమాయ" అని చెప్పి లెంపలు వేసుకున్నాడు.

VGS PUBLISHERS

## గాంధారీ దేవి శాపం

కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడు పాండవపక్షం వహించాడు. అర్జునునికి రథసారథిగా వ్యవహరించాడు. కౌరవులందరిని హతమార్చడంలో ప్రధానపాత్ర వహించాడు. తన కుమారులందరూ మరణించడానికి కృష్ణుడే కారణమని గాంధారి భావించేది.

కురుక్షేత్రం ముగిసిన తరువాత పాండవులను తీసుకొని కృష్ణుడు గాంధారీ ధృత రాష్ట్రులను కలుసుకున్నాడు. గాంధారి అప్పుడు "కృష్ణా ! నా పుత్రశోకానికి కారణం నీవే. నీవు తలచుకుంటే యుద్ధం లేకుండా చేయగలిగి ఉండేవాడివి. అలా చేయకుండా కౌరవ వంశాన్ని నాశనం చేశావు. కౌరవ వంశం ఏ విధంగా నామరూపాలు లేకుండా నాశనమయిందో మీ యాదవ వంశం కూడా అదేవిధంగా నామరూపాలు లేకుండా పోతుంది" అని శపించింది.

గాంధారి శాపం ప్రభావంతో యాదవులు తమ ఇచ్ఛ వచ్చినట్లు అహంకారంతో ప్రవర్తించ సాగారు.



# యాదవకులంలో ముసలం

ఒకరోజు మహర్షులందరూ శ్రీకృష్ణుని దర్శించి తిరిగిపోతున్నారు. ఆ సమయంలో యాదవులు ఆ మునులను అవమానించాలనుకున్నారు. సాంబుడు అనేవానికి ఆడవేషం వేశారు. పైగా గర్భవతి అయినట్లుగా అలంకరించి మునుల వద్దకు తీసుకొని వెళ్ళారు. అప్పుడు సాంబుడు ఆ మునులతో "అయ్యా ! మీకు అన్ని విషయాలు తెలుసు కదా ! నాకు పుట్టేది అబ్బాయో, అమ్మాయో తెలపండి" అని అడిగాడు. అతని వెనుక ఉన్న యాదవులు ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు.

దుర్వాసుడు తన శక్తితో అసలు విషయం గ్రహించాడు. అతనికి కోపం వచ్చింది. "ఈ గర్భవతికి ముసలం పుడుతుంది. మహర్షులయిన మమ్ము పరిహాసం చేస్తున్న మీ జాతి ఈ ముసలం వల్లనే నాశనమవుతుంది" అని శపించాడు. యాదవులు భయపడిపోయారు. అంతలోనే సాంబునికి ముసలం పుట్టింది.

యాదవులు ఆ రోకలిని తీసుకొనివెళ్ళి కృష్ణునికి చూపించారు. జరిగిన విషయాన్ని ఆయనకు వివరించారు. "ఆయన శాపానికి తిరుగులేదు. మీరు మదంతో చేసిన పనికి ఫలితం అనుభవించక తప్పదు" అని చెప్పాడు. ఆ రోకలిని తీసుకొనివెళ్ళి దానిని అరగదీసి సముద్రంలో కలపండి అని ఆజ్ఞాపించాడు. వారందరూ కృష్ణుడు చెప్పిన విధంగా సముద్ర తీరానికి వెళ్ళారు. ముసలాన్ని బాగా అరగదీసి సముద్రంలో కలిపారు. అరగదీయగా మిగిలిన ముక్కను సముద్రంలో పారవేశారు. దానిని ఒక తిమింగలం మింగింది. అది ఒక జాలరి వలలో చిక్కింది. అది ఒక బోయవానికి చేరింది. అది బాణంలాగా అతడు తన అమ్ముల పొదిలో ఉంచుకున్నాడు.

# యాదవుల అంతఃకలహం

యాదవులు ముసలాన్ని అరగదీసి సముద్రంలో కలిపారు గదా ! ఆ పొడి సముద్రం లోపలికి పోలేదు. అలల తాకిడికి తీరానికి కొట్టుకువచ్చింది. అదే పెద్దరెల్లు పొద లాగా పెరిగింది. రోకలి చూర్ణమే ఆ విధంగా పెరిగిందని ఎవ్వరూ ఊహించలేదు.

కొంతకాలం జరిగిపోయింది. యాదవులు ప్రభాస తీర్థంలో జాతర జరుపుకున్నారు. ఆ సందర్భంగా అందరూ మద్యం సేవించారు. ఆ మత్తులో చిన్న తగాదా చోటుచేసుకుంది. తగవు పెరిగి పెద్దదయింది. యాదవులందరూ రెండు వర్గాలయ్యారు. కొట్టుకోవడం మొదలు పెట్టారు. సముద్రతీరంలో పెరిగిన రెల్లును పెరికి వాటితో కొట్టుకోసాగారు. రెల్లుగడ్డి తగలడమే తరువాయి ఒక్కొక్కరూ మరణించసాగారు. ఈ విషయం తెలిసి బలరాముడు కృష్ణుని వద్దకు వెళ్ళి జరుగుతున్న విషయాన్ని తెలియజేశాడు. "దీన్ని ఆపడం అసాధ్యం. మనం కూడా మన అవతారాలు చాలించే సమయం వచ్చింది. నీ అవతారాన్ని చాలించు" అన్నాడు కృష్ణుడు. బలరాముడు ధ్యానంలో మునిగి తన అవతారాన్ని చాలించి, వేయి పడగలు గల ఆదిశేషువుగా మారి వైకుంఠం చేరుకున్నాడు.

VGS PUBLISHERS



# కృష్ణావతారం సమాప్తం

శ్రీకృష్ణుడు తన సారథిని పిలిపించాడు. వెంటనే బయలుదేరి ధర్మరాజు వద్దకు వెళ్ళి తాను చెప్పిన విషయాలను తెలియజేయుమన్నాడు. సారథి తక్షణమే బయలుదేరి వెళ్ళి ధర్మరాజుతో "మహారాజా ! కృష్ణుడు మీతో మనవి చేయుమని నన్ను పంపించాడు. యాదవులు తప్పతాగి ఒకరినొకరు కొట్టుకొని అందరూ మరణించారు. బలరాముడు పరలోకగతుడయ్యాడు. వారం రోజుల్లో సముద్రానికి ఉప్పెన వస్తుందట. ద్వారకా నగరం మునిగిపోతుందిట. ఈలోపు మిగిలి ఉన్న యాదవ స్త్రీలను, బాలురను, వృద్ధులను క్షేమంగా ద్వారక నుంచి తరలించాలని, అందుకోసం వెంటనే అర్జునుని పంపవలసిందని మీకు తెలుపుమన్నాడు" అని దుఃఖిస్తూ తెలియజేశాడు. అర్జునుడు వెంటనే ద్వారకా నగరానికి బయలుదేరాడు.

తాను కూడా తన అవతారాన్ని చాలించవలసిన సమయం వచ్చిందని కృష్ణుడు అనుకున్నాడు. వెంటనే ఒక అడవికి వెళ్ళి దట్టంగా ఉన్న పొదల మధ్య చెట్టుకు ఆనుకొని పడుకున్నాడు. ఎడమ కాలు నిలువుగా మడిచి, కుడికాలి పిక్కను ఎడమకాలిపై అడ్డంగా ఆన్చి ధ్యానంలోకి వెళ్ళిపోయాడు. ఆయన కుడిపాదం అటూ ఇటూ కదులుతూ ఉంది.

అదే సమయానికి రోకలి పుల్లను బాణంగా తన అమ్ముల పొదిలో పెట్టుకున్న బోయవాడు వేటకోసం అడవికి వచ్చాడు. అతడెవరో కాదు త్రేతాయుగంలో విష్ణువు శ్రీరామునిగా జన్మించినప్పుడు అతని చేత చంపబడిన వాలి. సుగ్రీవునితో స్నేహం చేసి, అతనికి రాజ్యాన్ని కట్టబెట్టడానికి ఆనాడు రామావతారంలో చెట్టు చాటు నుండి బాణాన్ని ప్రయోగించి వాలిని సంహరించాడు గదా ! అప్పుడు వాలి చనిపోతూ "నన్ను బాణంతో ఎలా సంహరించావో, అలాగే నీవు కూడా బాణం దెబ్బతో మరణిస్తావు" అని శపించాడు. ఆ శాపం ద్వాపర యుగంలో నెరవేర్చడానికి వాలి ఇప్పుడు బోయవానిగా జన్మించాడు.

బోయవాడు గుబురుగా ఉన్న పొదలలో అటూ ఇటూ తిరుగుతున్న శ్రీకృష్ణుని పాదాన్ని గమనించాడు. అది లేడి చెవిగా భ్రమించాడు. లేడిని చంపడానికి అమ్ముల పొదిలో చేయి పెట్టాడు. అతనికి రోకలిపుల్ల చేతికి తగిలింది. అతడు దానిని వింటికి సంధించి గురిచూచి వదిలాడు. అది వెళ్ళి కృష్ణుని కుడికాలి బొటన వ్రేలిలో గ్రుచ్చుకుంది. ఆత్మధ్యానంలో ఉన్న కృష్ణుడు శాశ్వతంగా కళ్ళు మూసుకున్నాడు. దేవతా గణమంతా స్వాగతం చెపుతుండగా అవతారాన్ని చాలించిన కృష్ణుడు, వైకుంఠంలో ఆదిశేషువుపై శయనించాడు.

ఇవి మహావిష్ణువు అవతారాలను గురించిన దివ్యకథలు. శ్రీమన్నారాయణుని భక్తులైన మహాపురుషుల జీవిత సుధలు.

ఇది మహాభాగవతం. ఇది పఠించినవారికి, ఆలకించినవారికి మోక్షం కలుగుతుందని హిందువులు విశ్వసిస్తారు.

VGS PUBLISHERS


VGS PUBLISHERS

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తధాత్మానం సృజామ్యహమ్ ।
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

VGS PUBLISHERS

VGS PUBLISHERS